ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు, fb.com/vaartha
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-11-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 278 పేజీలు: 12 వెల: 6.50

అతివాద శక్తులకు కెనడాలో ఆశ్రయం!
ఢిల్లీలో అదుపుతప్పిన వాయు కాలుష్యం
9లో




## 'పట్టం' ఎవరికో?

ఆసక్తికరంగా అమెరికా పోలింగ్

### వివిధ రాష్ట్రాలలో ఓటుహక్కు వినియోగించుకొంటున్న ప్రజలు

### డిక్స్‌విల్లేలో వెల్లడైన తొలి ఫలితం

### కమల, ట్రంప్‌కు చెరో మూడు ఓట్లు

### తుది ఫలితాలకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం


**వాషింగ్టన్, నవంబరు 5:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మొదలైంది. అధ్యక్ష పదవికి డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పోటీపడుతున్నారు. మంగళవారం పోలింగ్ మొదలైన కొన్ని గంటలకే అక్కడి ఓ చిన్న కౌంటీలో కౌంటింగ్ కూడా పూర్తయింది. అమెరికా వ్యాప్తంగా అధ్యక్ష ఎన్నికలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం ప్రారంభం కానుండగా ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ సమయాలు వేర్వేరుగా ఉన్నాయి. అమెరికాలో వివిధ కాలమానాల ప్రకారం కొన్ని రాష్ట్రాల్లో ఉదయం ఆరు గంటలకు, మరికొన్ని రాష్ట్రాల్లో ఏడు, ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలో ఉదయం ఆరు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా డిక్స్ విల్లే నాచ్ ప్రాంతంలో మాత్రం అతి తక్కువ ఓట్లు ఉండటంతో నవంబర్ 5వ తేదీలోకి అడుగుపెట్టిన కొన్ని గంటలకే పోలింగ్ నిర్వహించి కౌంటింగ్ కూడా పూర్తి చేశారు. మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్న అమెరికాలో పోలింగ్ రేపు ఉదయం 1:30 వరకు కొనసాగనుంది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపడతారు. తుది ఫలితాలు వచ్చేందుకు కొన్ని రోజుల >>2

# సాగుకు మరింత చేయూత

### సాంకేతికతతో సాగు ఖర్చులు తగ్గించాలి

### ప్రకృతి సేద్యానికే ముందుముందు పెద్దపీట

### రబీ నుంచి రైతులకు పాతపద్ధతిలో పంట బీమా: సిఎం చంద్రబాబు



**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతును నిలబెట్టి సాగును మరింత ప్రోత్సహించేందుకు అవసరమైనన్ని నూతన విధానాలను రాష్ట్రంలో వ్యవసాయశాఖ అమలు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వ్యవసాయ శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు సమీక్షను నిర్వహించారు. నేటి ఆధునిక యుగంలో సాంకేతికతను వినియోగించి రైతులకు సాగు ఖర్చులు గణనీయంగా తగ్గించవచ్చని ఈ సందర్భంగా సిఎం అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు ఐటి ఎలా అయితే గేం ఛేంజర్ అయ్యిందో రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం కూడా గేం ఛేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రకృతి సేద్యంలో ఎపి పయనీర్‌గా నిలవాలని దీనికి టెక్నాలజీని జోడించడం ద్వారా అనూహ్య, అద్భుత ఫలితాలు సాధించవచ్చని సిఎం అన్నారు. ప్రకృతి సేద్యం- అగ్రిడీప్ టెక్ విధానంతో దేశానికి ఎపి వ్యవసాయ రంగంలో దిక్సూచి అయ్యేలా చేయాలని అందుకు అవసరమైన ప్రణాళికలను అమలు చేయాలని సిఎం ఆదేశించారు. ఖర్చులు గణనీయంగా పెరిగి రైతులకు సాగు భారంగా మారిన పరిస్థితుల్లో టెక్నాలజీ ద్వారా ఆ ఖర్చులు తగ్గించాలని అన్నారు.

పంటల సాగులో డ్రోన్లకు కేంద్ర ప్రభుత్వం రూ.8 లక్షల వరకు సబ్సిడీ ఇస్తుందని తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తుందని ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సిఎం సూచించారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు డ్రోన్‌లపై శిక్షణ ఇచ్చి డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దితే ఇదొక కుటీర పరిశ్రమ అవుతుందన్నారు. గతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రకృతి సేద్యాన్ని గత ప్రభుత్వం పక్కన పెట్టిందని తెలిపిన అధికారులు ప్రకృతి సేద్యంతో సాగయ్యే పంటలు సాధారణ పంటల కంటే ఎక్కువగా వరదలు, విపత్తులను తట్టుకుంటున్నట్లు పరిశీలనలో తేలిందని అధికారులు వివరించారు. రెండు నెలల క్రితం వచ్చిన భారీ వర్షాలు, వరదల సమయంలో చేసిన స్టడీలో ఈ విషయాలు వెలుగు చూశామని తెలిపారు.

ఒకే ప్రాంతంలో పక్క పక్కనే ప్రకృతిసాగు, సాధారణ సాగు చేసిన ఒకే రకమైన పంటలు వరదలకు దెబ్బతిన్న శాతాన్ని పరిశీలించి తాము ఈ అంశంపై నివేదిక సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. వరదల కారణంగా కెమికల్ ఫార్మింగ్ జరిగే పంటలు 100 శాతం దెబ్బతింటే ఆ పక్కనే ఉన్న ప్రకృతి వ్యవసాయం కింద సాగయ్యే పంట 10 శాతం మాత్రమే దెబ్బతిన్నట్లు తాము గుర్తించామని అధికారులు తెలిపారు.

ఇది చాలా కీలకమైన అంశమని రైతులను ప్రకృతి సాగు వైపు తీసుకువెళ్లడానికి ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని సిఎం అన్నారు. ఇలాంటి సమాచారాన్ని ప్రజల వద్దకు చేర్చివారిని ప్రకృతి సేద్యం లాభాల గురించి తెలుసుకునేలా చేయాలని సిఎం చెప్పారు. అంతకముందు అధికారులు పంట ఉత్పత్తుల పెంపు సాగు విస్తీర్ణం పెంపు, భూసార పరీక్షలు వంటి అంశాల్లో తీసుకున్న చర్యలను సిఎంకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా భూసారపరీక్షలు చేసి రైతులకు అవసరమైన పోషకాలు అందించే పరిస్థితి రావాలని సిఎం అన్నారు. జులై నెలలో జరిగిన పంటనష్టానికి సంబంధించి రూ.37 కోట్లు రైతులకు పరిహారం కింద చెల్లించాల్సి ఉందని అధికారులు చెప్పగా ఆ నిధులు విడుదలకు సిఎం అంగీకారం తెలిపారు. సెప్టెంబరు నెలలో వచ్చిన వరద >>2

# పోలీసు శాఖ మరింత పటిష్టం

### రాష్ట్రంలో ఎక్కడ అఘాయిత్యాలు జరిగినా కఠినంగా అణచివేస్తాం

### నార్కోటిక్స్ కట్టడికోసం మంత్రులతో సబ్‌కమిటీ

### చట్టాలకు అనుగుణంగా పనిచేయాలి: రాష్ట్ర హోంమంత్రి అనిత, డిజిపి తిరుమలరావు



ప్రతిభకనబరిచిన డీఎస్పీలకు పతకాలు అందజేస్తున్న హోం మంత్రి అనిత

**అనంతపురం, నవంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డిజిపి ద్వారకా తిరుమల రావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రొబేషనరీ డీఎస్పీల దిశానిర్దేశం చేశారు.

**శాంతిభద్రతలను పరిరక్షించండి: హోంమంత్రి అనిత**

రాష్ట్ర శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని కల్పించి ఇందులో భాగస్వామ్యం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇన్ని రోజులు కష్టపడి తమ కలలు, తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి విధుల్లో చేరబోతున్న నూతన డిఎస్పీలందరికీ హృదయకపూర్వక అభినందనలు తెలిపారు. పోలీసుల ఉద్యోగం మిగతా ఉద్యోగాల వంటిది కాదన్నారు. ఇందులో 24 గంటల పాటు విధుల్లో ఉంటారన్నారు. బాధితుల పట్ల సానుభూతి, విధిపట్ల అంకితభావం కలిగి ఉండాలని అన్నారు. పోలీసు శాఖకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసు శాఖ నిర్వీర్యమయ్యిందన్నారు. ప్రస్తుతం పోలీసు వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైన మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే ముఖ్యమంత్రి ఆయా జిల్లాల ఎస్పీలతో >>2

## నేడు కేబినెట్ సమావేశం

**విజయవాడ, నవంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం ఈ నెల6వ తేది బుధవారం జరుగుతుంది. ఉదయం 11గంటలకు ఈ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతుంది. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982బిల్లు ప్రతిపాదనపై కేబినెట్ కీలకంగా చర్చిస్తుంది. భూసేకరణ చట్టంలోని కొన్ని నిబంధనల కారణంగా భూ అక్రమణల్లో కేసుల నమోదుకు ఇబ్బందులు వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గత ప్రభుత్వ హయంలో లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయినట్లు ప్రభుత్వం అభిప్రాయపడుతుంది. ఇందుకు సంబంధించి పలు ఫిర్యాదులను తాజా ప్రభుత్వానికి వచ్చాయి. ప్రభుత్వానికి అందుతున్న ఫిర్యాదుల్లో 80శాతం భూ అక్రమణలపైనే ఉన్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత చట్టంతో భూ అక్రమణదారులపై చర్యలు తీసుకునేందుకు ఇబ్బందులున్నాయని ప్రభుత్వ భావిస్తోంది.

దీని స్థానంలో కొత్త చట్టం తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే భూసేకరణ చట్టం 1982ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది, కొత్తగా ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లు-2024 తీసుకుని వచ్చే దిశలో ప్రభుత్వం సిద్ధమవుతుంది. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదించే అవకాశం ఉంది. నామినేటేడ్ పోస్టులో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించడం తదిరంశాలపై మంత్రి వర్గం చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



మంగళవారం ఇంటర్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్

# మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటు

### ఇంటర్ విద్యపై సమీక్షలో మంత్రి లోకేష్

**మంగళగిరి, నవంబరు 5, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ కళాశాల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని విద్య, ఐటి, శాఖల మంత్రి నారా లోకేష్ అధికారు లను ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో ఇంటర్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ కాలేజీల్లో స్టూడెంట్స్ లెర్నింగ్ ఆవుట్ కమ్స్ పై దృష్టి సారించాలన్నారు. ప్రవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఐఐటి, మెడిసిన్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పోటీలను దినపత్రికల్లో ప్రచురించేలా కసరత్తు చేయాలన్నారు.

ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకుఉచితంగా పాఠ్యపుస_్తకాలు అందించడం వల్ల 15వేల వరకు అడ్మిషనుల పెరిగాయనే విషయాన్ని అధికారులు మంత్రికి >>2



### ప్రైవేటు ఆస్తుల స్వాధీనం హక్కు

# రాష్ట్రాలకు లేదు..

### సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు

### కొన్ని కేసుల్లో మినహాయింపు: సిజెఐ చంద్రచూడ్

### ప్రైవేటు ఆస్తి సమాజవనరు కాదన్న న్యాయస్థానం

**న్యూఢిల్లీ, నవంబరు 5:** ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు 8.1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. అయితే కొన్ని కేసుల్లో మాత్రం మినహాయింపు ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను సమాజ వనరుగా పరిగణించవచ్చా? అన్న కీలక కేసుపై కొద్దినెలల క్రితం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ ప్రైవేట్ ఆస్తి సమాజ వనరు కాదు. అన్ని ప్రైవేట్ ఆస్తులూ సమాజ వనరులే ఈ రెండు పరస్పర భిన్నమైన విధానాలు. వీటిపై ప్రస్తుత ప్రైవేటీకరణ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమకాలీన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడింది. 1950ల్లో భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు వ్యాఖ్యానం చేయకూడదు. అప్పుడు జాతీయీకరణ జరుగుతోంది. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతోంది. ప్రైవేట్ పెట్టుబడులు ఉన్నాయి. ఇది పరివర్తన. కాబట్టి న్యాయస్థానం వ్యాఖ్యానం కొత్తగా ఉండాలి. ప్రస్తుత భారత్‌కు అనుగుణంగా >>2

## డిసెంబరులో లక్ష గృహప్రవేశాలు: సిఎం

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** డిసెంబరులో లక్ష గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. గృహ నిర్మాణ శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. 2029 నాటికి అర్హులైన అందరికీ ఇల్లు నిర్మించే లక్ష్యంతో పని చేయాలని సిఎం అన్నారు. రాష్ట్రంలో పిఎంఏవై 2.0 పథకం ప్రారంభించేందుకు కేంద్రంతో ఎంఓయూ కుదుర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటయ్యాక పిఎంఏవై అర్బన్ కింద 58,578 ఇళ్లు పిఎంఏవై గ్రామీణం కింద 17,197 ఇళ్లు నిర్మించినట్లు అధికారులు సిఎంకు వివరించారు.

లక్ష ఇళ్లు డిసెంబరు నాటికి పూర్తవుతాయని లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులకు సిఎంకు వివరించారు. 2026 నాటికి మరో 7.60 లక్షల ఇళ్లనిర్మాణం పూర్తిచేయాలని సిఎం ఆదేశించారు. డ్రోన్ల ద్వారా ఇళ్ల నిర్మాణ నాణ్యత >>2

# అసెంబ్లీ సమావేశాలు 11 నుంచి

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర 16వ శాసనసభ రెండో సమావేశాలు, శాసనమండలి 46వ సమావేశాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వాటి వివరాలను అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ వెల్లడించారు. రెండు సభలు కూడా ఆ రోజున ఉదయం 10 గంటలకు సమావేశమవుతాయని పేర్కొన్నారు.



భక్తులకు త్వరిత దర్శనం సాకారమవుతుందా?

తాగునీటి సమస్యకు ఏదీ పరిష్కారం?

విఐపి బ్రేక్ దర్శనాలు కుదిస్తారా! కొనసాగిస్తారా?

నేడు కొలువుదీరనున్న టిటిడి కొత్త బోర్డు

# సంస్కరణలు ఇంకా ఎప్పుడు?

**పి.పద్మనాభమ్/తిరుమల:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పాలన వ్యవహారాలు పర్యవేక్షణతో బాటు కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కొలువుదీరుతున్న 54వ ధర్మకర్తలమండలి ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఈ సవాళ్లను బుధవారం తిరుమలలో ప్రమాణస్వీకారం చేయనున్న ధర్మకర్తలమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడుతో బాటు కొందరు పాత, కొత్త సభ్యులు ఎలా ఎదుర్కొనున్నారనేది భక్తుల్లో ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా రోజువారీగా లక్షమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుంటున్నా....85వేలమందికి మహాలఘులోనే శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. సామాన్యభక్తులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఎంతో దూరం నుండి కొండకు వస్తున్నా సంతృప్తికరంగా వారికి స్వామివారి దర్శనం వీలైనంత తక్కువ సమయంలో చేయించాలనేది కొలువుదీరుతున్న బోర్డు ఆకాంక్ష. మరీ ఈ నూతన విధానం అమలుకావడానికి ఆటంకాలను అధిగమించేలా బోర్డు కార్యాచరణ రూపొందించుకోవాలి. ఇందుకు రోజువారీగా జారీ అవుతున్న విఐపి బ్రేక్ దర్శనాలను కుదించడంగానీ, లేకుంటే ఈ దర్శనాలను ఆన్‌లైన్ చేయడంగానీ చేస్తే సామాన్యభక్తులకు కొంత ఊరటకలిగించినట్లవుతుందనేది పలువురు అభిప్రాయం.

ఇప్పటికే తిరుమలలో ప్రైవేట్ పిఆర్‌ఒల పేరుతో అనధికారికంగా చలామణి అవుతున్న వారి ఆగడాలకు చరమగీతం పెడతారా? లేక అనధికార పిఆర్‌ఒలను కొనసాగిస్తారా అనేది కూడా ఇప్పుడు బోర్డు ముందు పెద్ద సవాల్. ప్రతి హిందు భక్తుడు ఒక్కసారైనా లేక వీలైతే మరొకసారి ఆపదమొక్కుల వాడు...అనాధరక్షకుడు, ఇష్టదైవం ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని తనివితీరా వీక్షించాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. అయితే ఇదీ ఇప్పటి పరిస్థితుల్లో సామాన్యభక్తులకు సాధ్యం కాదనేది వినిపించే ఆవేదన. సాధారణ రోజుల్లోనేగాక వారాంతం, ప్రత్యేక పర్వది >>2



మంగళవారం మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

### మాజీమంత్రి కాకాని

# హౌస్ అరెస్టు

**నెల్లూరు రూరల్ (నెల్లూరు), నవంబరు 5, ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రైతులతో కలిసి కనుపూరు కాలువ పనులను పరిశీలించేందుకు వెళుతున్న కాకాని గోవర్దన్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహ నిర్భంధం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు కాకాని గోవర్ధన్ రెడ్డికి వాగ్వాదం నెలకొంది. పెద్ద సంఖ్యలో వైసిపి కార్యకర్తలు ఆయన అభిమానులు ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన నివాసం వద్ద కాసేపు ఉద్రికత నెలకొంది. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం కోసం వెళుతున్న తనని అడ్డుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని పోలీసులు ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా అవినీతిని అడ్డుకునేందుకు వెళుతున్న నన్ను ఆపడం సరైన పద్ధతి కాదని పోలీసులకు తెలిపారు.

మంగళవారం ఆయన డైకస్ రోడ్డులోని ఆయన నివాసంలో కాకాని గోవర్ధన్ రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్వేపల్లి శాసన సభ్యులు చంద్రమోహన్ రెడ్డి అవినీతిని బట్ట బయలు చేస్తాననితెలిసే పోలీసులు నన్ను అడ్డుకున్నారని అన్నారు. గతంలో సర్వే >>2



మంగళవారం న్యూఢిల్లీలో బౌద్ధ శిఖరాగ్ర సమావేశానికి హాజరైన రాష్ట్రపతి ముర్ము

# ఇంటర్ కళాశాల ఏర్పాటు

>>వివరించారు. వచ్చే ఏడాది 2లక్షల వరకు అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. జూనియర్ కాలేజీల్లో పనివేళలు పెంచడంతోపాటు విద్యార్థుల హాజరుపై సమీక్ష, ప్రొగ్రెస్ కార్డులను అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామ రాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**'పకడ్బందీగా మెగా డీఎస్సీకి ఏర్పాట్లు చేయండి'**

రాష్ట్రంలో టెట్ 2024విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మెగా డిఎస్సీని పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖలమంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ ఎడు ్యకేషన్‌పై మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ మెగా డిఎస్సీ నిర్వహణ విధివిధానాలపై సమావేశంలో చర్చించి సాధ్యమైనంత ఎక్కువమంది అభ్యరు ్థలకు అవకాశం కల్పించాలన్నదే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఈనెల 11వ తేదిన నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఇవా ్వలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ఇందులో భాగంగా అటెండెన్ మెరుగు దలు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాదికల్లా మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పాస్‌పర ్సంటేజి మెరుగుదలపై దృష్టి సారించాలన్నారు. అందుకు అవసరమైతే వెనుక బడిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు నిర్వహిం చాలన్నారు. సమావేశంలో రాష్ట్ర పాఠశాల విద్యకార్యదర్శి కోన శశిధర్ ,స్కూల్ ఎడు ్యకేషన్ డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద ్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష సే ్టట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# స్వాధీనం హక్కు రాష్ట్రాలకు లేదు..

>> ఉండాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలి అని ధర్మాసనం పేర్కొంది. తాజాగా ఈ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ దీనిపై తీర్పు వెలువరించింది. అలాగే కోల్‌కతాలో పార్కు నిర్మాణం కోసమంటూ స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఓ వ్యక్తి ఆస్తిని స్వాధీనం చేసుకున్న కేసులోనూ సుప్రీం తీర్పునిస్తూ చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ నష్టపరిహారం చెల్లించినా సరైన పద్ధతులు మాత్రం పాటించలేదు. వ్యక్తుల ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించినప్పటికీ రాజ్యాంగం తగిన రక్షణ కల్పించింది.

నిర్బంధ స్వాధీనాలు, హడావుడి నిర్ణయాలు, న్యాయబద్ధంగా లేని పరిహారాల కారణంగా పౌరులు నష్టపోవడానికి చట్టం అనుమతించబోదు అని ధర్మాసనం తెలిపింది. ఆస్తి స్వాధీనం విషయాన్ని ముందుగా తెలియజేయడం, తగినంత సమయం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీక రించడం, వాటిని పరిష్కరించడం, పునరావాసం కల్పించడం, ప్రజాప్రయోజనం కోసమేనని వివరించడం వంటివన్నీ ప్రభుత్వాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

# ఇంకా ఎప్పుడు?

>>నాల్లో తిరుమలేశుని దర్శనం కోసం అశేషసంఖ్యలో భక్తులు వస్తుంటారు. 50వేలమంది భక్తులు దాటితే ఆలయం వెలుపల కిలోమీటర్లు క్యూలైన్లు వ్యాపిస్తాయి. గంటలతరబడి నిరీక్షిస్తూ వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లోనికి చేరేకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీన్ని మరింత తక్కువ సమయంలో సులభంగా ఆలయంలోనికి చేరుకునే విధానం అమలుచేయాల్సిన అవసరం ఉంది. ఇక భక్తుల సంఖ్యకు తగ్గట్లు వసతి కల్పన గగనంగా మారింది. 40వేలమంది భక్తులకు తిరుమలలో వసతి సౌకర్యం ఉంది. ఆ సంఖ్యదాటితే సామాన్యభక్తులు పడిగాపులు తప్పడంలేదు.

**శాశ్వతతాగునీటి సమస్య పరిష్కారం చూడాలి:**

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం ప్రతిరోజూ తిరుమలకు లక్షమంది భక్తులు వస్తున్నారు. ప్రతిరోజూ 32లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుంది. తిరుమలలోని గోగర్భండ్యామ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార. పసుపుధార ప్రాజెక్టులు 13,495గ్యాలన్ల నీటి సామర్థ్యం కలిగివున్నాయి. శేషాచలంకొండల్లోని తిరుమల ప్రాధాన్యత దృష్ట్యా శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి "బాలాజీ రిజర్వాయర్" చేపట్టాల్సిన అవసరం ఉందని 2018లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోని టిటిడి పాలకమండలి చర్చించి సుమారు 350కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తిరుపతి కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను నిర్మిస్తే తిరుమల తాగునీటి అవసరాలకు నీటి కొరత తలెత్తదనేది భావించారు. 2018లో కొంతవరకు పనులు మొదలయ్యాయి. 2019లో ప్రభుత్వం మారడంతో ఈ రిజర్వాయర్ పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయి. 2021,2022లోనూ ఈ రిజర్వాయర్ చేపట్టాల్సిన అవసరాన్ని టిటిడి పాలకమండలి గుర్తించింది. అయితే పనులు మాత్రం చేపట్టలేదు. ప్రస్తుతం 54వ టిటిడి బోర్డు తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవచూపాల్సివుందని భక్తులు కోరుతున్నారు. ఇక శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు విరాళంగా ఇచ్చిన ఆస్తులతోబాటు టిటిడి పరిధిలో ఉన్న ఆస్తుల రక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యం చర్యలుతీసుకోవాలి. ఇందులో భాగంగా దేవునికి చెందిన ఆస్తులు అన్యాక్రాంతమైన స్థలాల్లో భవనాలు నిర్మించుకున్న వాటిని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాటిపై ప్రత్యేక నివేదిక తయారుచేయడంతో ఈ స్థలాలను కలిగివున్న యజమానులకు ఊరట కలిగించే విషయం పున: పరిశీలించాల్సి ఉంది. హిందూ ధార్మికతను ప్రపంచవ్యాప్తం చేయడానికి, టిటిడి నిర్వహిస్తున్న విద్య, వైద్యరంగాలపై కూడా నూతన బోర్డు సానుకూలంగా నిర్ణయాలు తీసుకుని మంచి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. తిరుమల ఆలయ పవిత్రతను మరింత ఇనుమడింపజేయడానికి బిఆర్‌నాయుడు సారథ్యంలోని బోర్డు ఎలాంటి నిర్ణయాలు తీసుకోనుందనేది చూడాల్సిందే.

# 'పట్టం'ఎవరికో?

>> సమయం పట్టే అవకాశం ఉంది.

**డిక్స్‌విల్లే చాన్‌లో తొలిఫలితం..**

న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్లే నాచ్‌లో తొలి ఫలితం వచ్చేసింది. అక్కడ మొత్తం ఆరుగురు ఓటర్లు ఉండగా డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌కు మూడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు మూడు ఓట్లు వచ్చాయి. 2020లో మాత్రం డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ వైపు డిక్స్‌విల్లే నాచ్ ఓటర్లు మొగ్గుచూపారు. ఆ ఎన్నికల్లో ఆయనే విజయం సాధించడం విశేషం. డిక్స్‌విల్లే నాచ్ అమెరికా, కెనడా సరిహద్దులో ఉన్న ప్రదేశం. ఇక్కడ ప్రస్తుతం ఆరుగురు ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఎలక్షన్ డే మొదలైన తర్వాత వీరంతా స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద జాతీయ గీతాన్ని ఆలపించాక ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందరూ ఓటేసిన 15 నిమిషాల తర్వాత ఫలితాలు ప్రకటించారు. 1960 నుంచి అర్ధరాత్రి ఓటు హక్కు వినియోగించుకునే సంప్రదాయం ఇక్కడ కొనసాగుతోంది. దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దేశంలోనే తొలి ఫలితం ఇచ్చే ప్రదేశంగా డిక్స్‌విల్లే నాచ్ పేరుగాంచింది. దేశవ్యాప్తంగా నవంబర్ 5న పోలింగ్ మొదలవగా ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ సమయాలు వేర్వేరుగా ఉన్నాయి. ఉదయం ఆరు గంటలకు కనెక్టికట్, ఇండియానా, కెంటకీ, మైన్, న్యూహ్యాంప్‌షైర్, న్యూజెర్సీ, న్యూయార్క్, వర్జీనియా మొదలవగా, ఆరున్నర గంటలకు ఒహాయా, నార్త్‌కరోలినా, వెస్ట్ వర్జీనియా, వెర్మాంట్‌లలో, ఏడుగంటలకు అలబామా, డెలవేర్, వాషింగ్టన్ డీసీ, ఫ్లోరిడా, జార్జియా, ఇల్లినోయీ, కాన్సస్, మేరీల్యాండ్, మసాచుసెట్స్, మిషిగన్, మిస్సోరి, పెన్సిల్వేనియా, రోడ్ ఐల్యాండ్, సౌతకరోలినా, టెన్నెసీ, 8 గంటలకు ఆరిజోనా, అయోవా, లూసియానా, మిన్నెసోటా, సౌత్ డకోటా, నార్త్ డకోటా, ఒక్లహోమా, టెక్సాస్, విస్కాన్సిన్‌లలో పోలింగ్ కొనసాగింది. ఒక్కో రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి.

# లక్ష గృహప్రవేశాలు

>> మెజర్మెంట్స్ తీసుకునేందుకు గృహ నిర్మాణ శాఖ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టిందని అధికారులు వివరించారు. ఇదే సాంకేతికతను పెద్ద లేఅవుట్లలో కూడా వినియోగించాలని సిఎం ఆదేశించారు. ఆయా శాఖల సమన్వయంతో అన్ని లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. 597 మందిని డిప్యుటేషన్ ద్వారా గృహ నిర్మాణ శాఖలోకి తీసుకునేందుకు సీఎం అంగీకారం తెలిపారు.



మంగళవారం సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ

# సిఎంను కలిసిన ఎమ్మార్పీఎస్ నేత

**విజయవాడ, నవంబరు5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సిఎం చంద్రబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం మంద కృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 32అంశాలపై చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణతో సహా వివిధ అంశాలపై గంటపాటు చర్చించామన్నారు. వాటిపై సిఎం చంద్రబాబు సానుకూలతను చూపించారన్నారు. ఎపిలో కూటమి గెలుపులో ఎమ్మార్పీఎస్ భాగస్వామ్యం ఉందని గుర్తించాలన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కలిసి నాలుగో స్తంభంగా తాము పనిచేసామన్నారు. మాదిగలకు అన్ని చోట్లా భాగస్వామ్యం కల్పించాలనేదే తమ లక్ష్యం అన్నారు. మంద కృష్ణతో పాటుగా పలువురు కీలక ఎమ్మార్పీఎస్ నేతలు చంద్రబాబును కలుసుకున్నారు.

# కాకాని హౌస్ అరెస్టు

>> పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా తాను ఉన్నప్పుడు ఈ నాడు సోమిరెడ్డిని అడ్డుకోలేదని తెలిపారు. ఆరోజు నేను సోమిరెడ్డిని అడ్డుకొని ఉంటే అల్లిపురం నుండి బయటకు వచ్చే పరిస్థితి కాదని తెలిపారు.

సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిం చారు. నవంబరు 11వ తేదీ వరకు టెండర్లు గడువు ఉన్న నామమాత్రంగానే ముందుగా పనులు ప్రారంభించి ప్రభుత్వ ధనాన్ని కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారని అన్నారు. పోలీసులు సోమిరెడ్డి అవినీతికి భద్రత కల్పిస్తున్నా రని ప్రశ్నించారు.

సోమిరెడ్డి దోపిడి ప్రజలకు తెలియజేయాలని బయలుదేరుతున్న తనను అడ్డుకోవడం కూటమి ప్రభుత్వ నైజం బయట పడిందని కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. సర్వేపల్లిలో ఎమ్మెల్యే అవినీతిపై పోరాటం కొనసాగుతుంది తప్ప పోలీసులు అడ్డుకున్న ఎవరు ఏమీ చేసినా అవినీతిని అరికట్టే వరకు వదిలిపెట్ట ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

## మద్దెల చెరువు సూరి హత్య కేసులో భాను కిరణ్‌కు బెయిల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు5:** మద్దెల చెరువు సూరి హత్య కేసులో నిందితుడు భాను కిరణ్‌కు బెయిల్ మంజూరైంది. సిఐడీ ఆమ్స్ యాక్ట్ కేసులో బెయిల్ లభించింది. అయినప్పటికీ జీవిత ఖైదు కేసులో భాను జైల్లోనే ఉండవన్నారు. సూరి హత్య కేసులో భాను కిరణ్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. భాను కిరణ్ ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో ఉన్నాడు. 12 సంవత్సరాలుగా భాను కిరణ్ జైల్లో ఉంటున్నాడు. జీవిత ఖైదు కేసులో భాను కిరణ్ సుప్రీంను ఆశ్రయించాడు. స్థానిక కోర్టులో తేల్చుకోమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జీవిత ఖైదు కేసు ఈనెల 11న విచారణకు రానుంది. 2011 జనవరి 4న భానుకిరణ్ చేతిలో మద్దెలచెరువు సూరి హత్యకు గురయ్యాడు. పరిటాల రవి హత్య కేసులో మద్దెల చెరువు సూరి ప్రధాన నిందితుడు, నగరంలోని సనత్‌నగర్ నవోదయ కాలనీలో భానుకిరణ్... సూరిని కాల్చి చంపేశాడు.

# మరింత చేయూత

>> లతో రైతుల పంటనష్టానికి గాను రూ.319 కోట్లు నెలరోజుల వ్యవధిలోనే చెల్లించినట్లు అధికారులు తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటి సూచనల ప్రకారం ఈ రబీ నుంచి పాత పద్దతిలో క్రాప్ ఇన్స్యూరెన్స్ అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 06-11-2024, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయనం,
శరదృతువు, శుక్లపక్షం,
పంచమి రా.12.41
మూల ఉ.10.59
వర్జ్యం : ఉ.9.19-11.00, 2) రా.8.54-10.33
దు.ఉ.11.37-12.23
శుభసమయం : ఉ.6.00-7.00,
సా.5.00-5.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** భూ వివాదాలు ఏర్పడినా సోదరుల సాయంతో పరిష్కరించుకొంటారు. శ్రమానంతరం కొన్ని పూర్తిచేస్తారు.

**వృషభం :** ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సంతానం నాకు కొంతవరకు అనుకూలం.

**మిథునం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అప్రయత్నంగా పనులు పూర్తి.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**కన్య :** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. చాకచక్యంగా కొన్ని మోసాల నుండి బయటపడతారు.

**తుల :** సంతానం నాకు సాంకేతిక విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**వృశ్చికం:** దీర్ఘకాలిక వ్యవహారాలు పరిష్కరించు కొంటారు. రుణాలలో ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందిస్తారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మకరం:** చేపట్టిన వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**కుంభం:** నూతన ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఉద్యోగులకు పదవులు, హోదాలు పొందుతారు.

**మీనం :** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


## THE GOVERNMENT OF BODOLAND
Results of 05/11/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:19
1st Prize Rs.100000/- 928101
2nd Prize Rs.7000/- 31716
3rd Prize Rs.3500/-
00201 02227 04136 13474 31526
36471 45748 47329 53580 63928
4th Prize Rs.200/-
1469 2027 2622 2666 3026
3292 7310 7545 9529 9805
5th Prize Rs.100/-
1560 1921 2010 2960 4499
5364 6652 6762 7338 7675
6th Prize Rs.50/-
0213 2105 3854 5696 7240 8666
0314 2114 3946 5753 7274 8667
0456 2200 4030 5795 7385 8672
0466 2282 4046 5817 7516 8674
0550 2751 4068 5877 7522 8806
0605 2872 4157 5899 7827 8911
0726 3119 4406 5954 7893 9036
0815 3287 4747 6357 7903 9092
0924 3384 4833 6415 7984 9097
1128 3433 4898 6477 8052 9262
1284 3497 4945 6569 8231 9572
1402 3513 5060 6601 8233 9714
1558 3562 5091 6683 8330 9718
1641 3727 5160 6803 8419 9857
1812 3739 5566 6830 8440 9914
1950 3740 5632 6956 8445
2055 3749 5636 7053 8549

SINGAM SERIES Dr No:19
1st Prize Rs.100000/- 329569
2nd Prize Rs.7000/- 75122
3rd Prize Rs.3500/-
10650 18543 21701 28151 29361
44257 55092 57303 65726 91709
4th Prize Rs.200/-
2114 2331 2569 2695 2959
3887 7615 8524 8721 9437
5th Prize Rs.100/-
0247 0356 0745 1112 4039
5645 6026 7310 8385 9421
6th Prize Rs.50/-
0140 1973 2916 5296 6622 8310
0349 2022 2947 5298 6700 8583
0505 2113 3178 5412 6874 8619
0619 2130 3200 5484 6930 8628
0786 2147 3262 5507 7028 8789
1024 2185 3276 5570 7138 8880
1042 2209 3320 5654 7161 9047
1095 2248 3391 6025 7175 9268
1319 2480 3892 6156 7382 9378
1373 2574 4313 6191 7523 9392
1404 2576 4367 6250 7565 9573
1411 2653 4424 6265 7570 9601
1662 2691 4510 6383 7975 9602
1665 2762 4721 6538 7985 9816
1714 2768 4725 6552 8087 9944
1741 2852 4964 6566 8247
1743 2891 5149 6575 8294

KUIL SERIES Dr No:19
1st Prize Rs.100000/- 125309
2nd Prize Rs.7000/- 26220
3rd Prize Rs.3500/-
02320 32254 45156 59818 59834
65934 71228 73237 73645 93290
4th Prize Rs.200/-
0978 2418 3801 4252 4563
4636 4938 5363 6910 7348
5th Prize Rs.100/-
0105 0504 0599 1604 1715
3094 4647 7639 7903 8717
6th Prize Rs.50/-
0042 2318 4264 6046 7706 8921
0190 2407 4266 6104 7744 8987
0284 2460 4358 6311 7745 9164
0290 2461 4386 6358 7800 9189
0531 2492 4459 6419 7878 9283
0570 2831 4684 6558 8102 9291
0590 3056 4714 6641 8118 9480
0660 3091 4784 6690 8198 9500
0753 3449 4990 6704 8229 9639
0891 3459 5381 6737 8398 9657
1051 3572 5605 6790 8516 9672
1263 3741 5607 6872 8521 9705
1494 3768 5622 6976 8569 9729
1517 3790 5634 7006 8640 9870
1527 3874 5655 7015 8765 9960
1697 3887 5859 7169 8845
1711 4155 5910 7541 8908

ROSA SERIES Dr No:19
1st Prize Rs.100000/- 329849
2nd Prize Rs.7000/- 99750
3rd Prize Rs.3500/-
03553 09645 12658 25815 29448
37745 43323 43590 78075 81394
4th Prize Rs.200/-
0258 0385 1961 2217 2366
4936 4965 8570 9317 9970
5th Prize Rs.100/-
1013 1274 6878 7050 8543
8742 8872 9250 9265 9339
6th Prize Rs.50/-
0167 1658 3770 5588 7248 8344
0280 1802 3781 5751 7382 8462
0442 1843 3958 5920 7396 8679
0518 1850 4237 6082 7437 8751
0525 2027 4469 6173 7438 8775
0588 2087 4582 6245 7508 8780
0593 2244 4640 6285 7544 8909
0946 2336 4658 6494 7615 9185
0965 2439 4669 6788 7628 9483
1000 2661 4673 6828 7685 9517
1009 2764 4740 6845 7794 9601
1020 2915 4928 6873 7815 9602
1023 2974 5001 6952 8088 9735
1078 3200 5036 6991 8090 9745
1089 3322 5119 7057 8202 9971
1231 3356 5159 7122 8229
1377 3631 5303 7247 8261

KUMARAN SERIES Dr No:19
1st Prize Rs.100000/- 752291
2nd Prize Rs.7000/- 79691
3rd Prize Rs.3500/-
17096 29337 30782 42734 48875
48893 60859 61682 62687 75837
4th Prize Rs.200/-
1387 1832 1869 4138 6858
7087 7653 9412 9648 9824
5th Prize Rs.100/-
2147 3324 3912 4376 4960
5455 5841 7322 7607 8397
6th Prize Rs.50/-
0107 1809 3347 5232 6868 8790
0124 1856 3353 5453 6892 8907
0306 1891 3396 5742 6979 8923
0390 1925 3498 5766 7092 8953
0410 1991 3536 5811 7121 9020
0429 2028 3782 5874 7559 9075
0571 2077 3831 5899 7588 9234
0772 2268 3890 5967 7719 9249
0989 2323 3895 6006 7911 9555
1141 2348 4078 6165 8140 9586
1151 2422 4095 6287 8142 9601
1172 2550 4134 6306 8162 9867
1228 2686 4137 6441 8267 9915
1589 2714 4767 6546 8323 9945
1605 2888 4848 6692 8331 9999
1688 2996 4945 6731 8422
1724 3266 4947 6771 8567

VISHNU SERIES Dr No:19
1st Prize Rs.100000/- 448457
2nd Prize Rs.7000/- 35350
3rd Prize Rs.3500/-
00727 04143 07827 37234 49484
55134 60577 60840 71988 75169
4th Prize Rs.200/-
1401 1457 2072 4319 4818
5208 6433 7139 7783 9991
5th Prize Rs.100/-
1890 3277 5384 5810 6297
7089 8178 8732 8979 9634
6th Prize Rs.50/-
0197 1061 3186 4643 6391 8777
0233 1133 3211 4685 6495 8944
0309 1459 3453 4686 6716 9041
0314 1615 3513 4820 6987 9069
0569 1725 3556 4942 7031 9258
0593 1756 3585 5045 7339 9351
0719 1815 3737 5074 7492 9356
0778 2204 3755 5110 7700 9371
0793 2434 3940 5302 7716 9387
0800 2569 3993 5411 7754 9587
0802 2664 4016 5420 7907 9592
0879 2830 4271 5452 8094 9710
0880 2848 4356 5511 8449 9842
0919 2914 4566 5543 8629 9879
0943 2962 4571 5981 8674 9982
0979 3102 4580 6129 8717
0986 3170 4604 6273 8743

## THE GOVERNMENT OF BODOLAND
Results of 05/11/2024
M.R.P. ₹.2/-

DEAR SERIES Dr No:19
1st Prize Rs.100000/- 184376
2nd Prize Rs.7000/- 51319
3rd Prize Rs.3500/-
13019 30600 44708 67003 70909
73647 75876 76034 85823 97373
4th Prize Rs.200/-
1266 4183 6265 6494 6755
6803 6910 7732 9239 9887
5th Prize Rs.100/-
0362 1599 2813 4063 5865
7117 8523 9002 9169 9944
6th Prize Rs.50/-
0022 2054 3237 4551 5494 7767
0199 2334 3277 4552 5522 8069
0241 2399 3598 4613 5609 8170
0326 2527 3608 4659 5723 8205
0595 2547 3644 4676 5777 8304
0709 2640 3695 4698 6094 8552
1013 2650 3835 4820 6399 8573
1254 2702 3889 4862 6456 8602
1278 2735 3914 4976 6546 8936
1322 2750 3928 5007 6602 8981
1552 2776 4060 5054 6727 9038
1555 2794 4186 5066 6807 9204
1667 2835 4234 5273 6810 9221
1746 2845 4300 5285 7219 9831
1882 3049 4307 5382 7254 9925
1939 3105 4430 5410 7709
2037 3156 4452 5429 7719

THANGAM SERIES Dr No:19
1st Prize Rs.100000/- 917161
2nd Prize Rs.7000/- 92750
3rd Prize Rs.3500/-
01226 01864 02191 09796 13384
27317 41684 47360 72741 98613
4th Prize Rs.200/-
1958 1964 1981 3246 3415
3529 4632 6268 7927 9350
5th Prize Rs.100/-
0299 2188 2629 4655 6122
7617 8037 8342 9117 9358
6th Prize Rs.50/-
0002 1440 3810 5644 7306 8844
0080 1490 3878 5728 7401 9070
0343 1574 3956 5760 7786 9089
0365 1694 3997 5770 7870 9101
0632 1702 4123 5858 7928 9206
0788 2046 4277 5886 7986 9267
0791 2359 4285 6062 7997 9308
0794 2686 4674 6168 8087 9311
0865 2868 4743 6264 8090 9423
0937 2951 4760 6403 8197 9572
0987 2960 4883 6448 8269 9635
1003 3275 5152 6569 8354 9819
1214 3304 5342 6622 8396 9833
1215 3355 5416 6646 8552 9929
1244 3453 5505 6680 8625 9942
1259 3665 5524 7071 8738
1346 3673 5558 7254 8832

ABBLE SERIES Dr No:19
1st Prize Rs.100000/- 571953
2nd Prize Rs.7000/- 14908
3rd Prize Rs.3500/-
02435 20809 28689 43283 62709
76239 85125 89077 93241 95563
4th Prize Rs.200/-
0127 0882 2841 3697 5760
6611 6839 8015 8718 9624
5th Prize Rs.100/-
0457 2360 2377 3004 3866
4972 5588 5849 7483 9407
6th Prize Rs.50/-
0003 2112 3351 6006 7176 8521
0024 2123 3539 6034 7307 8642
0173 2187 3745 6116 7342 8988
0386 2200 4238 6332 7350 9209
0885 2214 4366 6398 7397 9272
0987 2242 4405 6429 7485 9277
1152 2245 4616 6448 7573 9322
1244 2316 4712 6451 7672 9410
1303 2323 4865 6481 7725 9448
1411 2351 4957 6528 7744 9452
1649 2650 5211 6600 7938 9522
1687 2682 5530 6665 8032 9537
1782 2802 5622 6666 8074 9873
1797 2803 5658 6691 8125 9933
1849 3007 5736 7109 8166 9965
1863 3311 5989 7116 8172
1929 3321 6002 7159 8417

NALLANERAM SERIES Dr No:19
1st Prize Rs.100000/- 855655
2nd Prize Rs.7000/- 93006
3rd Prize Rs.3500/-
01551 04364 07534 32436 38579
60571 69622 71157 82910 92880
4th Prize Rs.200/-
2964 4698 5174 5359 6423
7473 7517 8065 8615 9872
5th Prize Rs.100/-
0604 0837 1882 3391 4717
5172 6430 7209 7544 9105
6th Prize Rs.50/-
0113 1751 3885 5106 6686 8781
0358 2095 3895 5134 6728 8887
0413 2097 3920 5214 6797 8916
0432 2211 3966 5303 7018 8928
0538 2410 4127 5443 7106 9017
0540 2896 4144 5526 7145 9062
0594 2949 4171 5559 7260 9079
0628 3207 4192 5916 7447 9369
0892 3336 4217 6116 7619 9376
1132 3337 4247 6174 8102 9405
1135 3389 4452 6187 8237 9561
1212 3503 4481 6300 8270 9656
1227 3543 4666 6435 8328 9904
1282 3549 4697 6436 8400 9923
1382 3566 4743 6512 8431 9957
1665 3755 4796 6603 8623
1698 3806 4904 6618 8714

SWARNALAXMI SERIES Dr No:19
1st Prize Rs.100000/- 258509
2nd Prize Rs.7000/- 72359
3rd Prize Rs.3500/-
15578 23705 31968 44552 53421
59483 69587 77492 82074 93649
4th Prize Rs.200/-
0439 0818 1310 1556 2472
3343 3475 4679 6238 9456
5th Prize Rs.100/-
1386 3102 4359 5487 6234
6475 6683 7122 8569 9768
6th Prize Rs.50/-
0042 2820 4435 6261 7366 8910
0139 2835 4588 6316 7635 9035
0166 2860 4845 6369 7667 9097
0340 2982 4890 6467 7743 9135
0875 3026 5108 6634 7788 9171
0927 3286 5169 6656 7833 9341
0946 3314 5263 6789 7926 9391
1378 3524 5273 6834 8007 9508
1398 3554 5370 6846 8023 9515
1626 3662 5444 6899 8041 9525
1868 3677 5600 6924 8097 9617
2057 3771 5625 6981 8171 9679
2087 3797 5686 7065 8183 9694
2251 4014 5834 7132 8531 9915
2400 4044 5937 7303 8645 9984
2794 4273 6077 7311 8766
2796 4300 6105 7334 8793

LION SERIES Dr No:19
1st Prize Rs.100000/- 479999
2nd Prize Rs.7000/- 42534
3rd Prize Rs.3500/-
17498 26490 31176 56909 63429
73045 84521 84666 91638 97779
4th Prize Rs.200/-
1345 2799 4158 4494 6933
7284 7507 8187 8907 8917
5th Prize Rs.100/-
3641 4064 4876 5564 5602
5690 5907 6949 7703 8839
6th Prize Rs.50/-
0153 1696 3576 4657 6603 8866
0218 1795 3676 4661 6996 8903
0269 2108 3751 4732 7094 8926
0451 2227 3756 4802 7166 9105
0556 2379 3766 4889 7298 9161
0621 2481 3850 4907 7303 9419
0845 2488 3911 5022 7330 9504
0857 2663 3939 5188 7596 9538
0877 2703 3978 5281 7695 9646
0892 2745 4008 5402 7742 9677
1230 2796 4072 5454 7745 9730
1310 3052 4188 5512 7827 9816
1388 3077 4287 5759 7858 9928
1477 3107 4377 5837 7995 9932
1541 3284 4398 6059 8242 9975
1551 3343 4482 6206 8345
1639 3492 4572 6425 8606


# మరింత పటిష్టం

>> మాట్లాడి ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. గంజాయి మత్తులో రాజకీయ ముసుగులో ఎంతో మంది నేరాలకు ఒడిగడుతున్నారని అన్నారు. టెక్నాలజీని ఉపయోగించి నేరాల కట్టడికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల విజయవాడలోమ వచ్చిన వరదల్లో కానిస్టేబుల్ నుంచి డిజిపి వరకు రంగంలోకి దిగి బాధిత ప్రజలకు సేవలుఅందించడం అభినందనీయమని అన్నారు.

**ప్రొబేషనరీ డీఎస్పీలకు మరుపు రానిది: డిజిపి తిరుమలరావు**

ప్రొబేషనరీ డీఎస్పీలకు మరుపురానిదని తిరుమలరావు తెలిపారు. పాసింగ్ అవుట్ పరేడ్ అనేది ముఖ్యమైన ఘట్టమని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని సమాజంలో అడుగిడుతున్నారని అన్నారు. కానిస్టేబుల్ నుంచి సిఐల వరకు విధులు నిర్తంచాల్సి ఉందన్నారు. దశల వారీగా నిర్వర్తించే ప్రొబేషనరీ విధుల సందర్భంగా కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు ఉన్న సాధక బాధకాలు అవగతమవుతాయని అన్నారు. చట్టాల పట్ల సమగ్ర అవగాహన కలుగుతుందన్నారు నిష్పక్షపాతంగా నిర్భయంగా రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. మానవ హక్కులనుకూడా కాపాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పని చేయడాన్ని ఎప్పుడూ మరువకూడదని అన్నారు. సైబర్ ఫోరెన్సిక్ విషయంలో కొత్త టూల్స్ కొనుగోలు చేసే ప్లానింగ్‌లో ఉన్నామని అన్నారు. పెరుగుతున్న వైట్ కాలర్ క్రైం, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, నార్కోటిక్స్‌ల కట్టడి కోసం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. మానసికంగా వేదనకు గురిచేసే సోషల్ మీడియా క్రైం నియంత్రణకు తగు చర్యలు చేపట్టబోతున్నామని అన్నారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాలలో రాణించిన ప్రతిభ కనపరిచిన ప్రొబేషనరీ డిఎస్పీలకు హోంమంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్, ఐజిపి వెంకట్రామిరెడ్డి, పోలీసు శాంతిభద్రతల ఐజిపి సి.హెచ్.శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డాక్టరు షిమోషి, ఉమ్మడి జిల్లాల ఎస్పీలు జగదీస్, వి.రత్న, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలువశ్రీనివాసులు, అస్మిత్‌రెడ్డి, శ్రావణి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, జడ్పీఛైర్మన్ గిరిజమ్మ, నగర మేయరు వసీం, అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకో పశువుల వసతి గృహం

## ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పశుసంరక్షణలో కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాకో పశువుల వసతి గృహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. పశుసంరక్షణ వాటి పోషణకు వీలుగా వీటిని ప్రారంభించనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధుల్లో ఒక్కో వసతి గృహం ఏర్పాటుకు రూ.50 లక్షలు చొప్పున ఖర్చు చేయనుంది.

జిల్లాలోని ఏ మండలంలో వసతి గృహం ఏర్పాటు చేయాలో పరిశీలించి పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రతిపాదించనున్నారు. రైతులు అత్యవసర సమయాల్లో గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పశువులను వసతి గృహాలకు అప్పగిస్తే నిర్వాహకులు వాటి పోషణ బాధ్యత తీసుకుంటారు. ఇందుకోసం స్వల్పంగా రుసుము వసూలు చేస్తారు. అదేవిధంగా సరైన సంరక్షణ లేక వీధుల్లో తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు గురయ్యే పశువులను నిర్వాహకులు వసతి గృహాలకు తీసుకెళ్లి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. వీటి ద్వారా వచ్చే పేడతో ఎరువులు వంటివి తయారు చేస్తారు. పశువులను విక్రయించేందుకు రైతులు దూర ప్రాంతాల్లోని సంతలకు వెళ్లే అవసరం లేకుండా వసతి గృహాల్లోనే క్రయ విక్రయాలకు అవకాశం కల్పించనున్నారు. దీనివల్ల వారికి రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు మధ్యవర్తుల బెడద తప్పనుందని పశుసంవర్ధకశాఖాధికారులు తెలిపారు.

## పెరిగిన అర్చకుల కనీస వేతనాలు: మంత్రి ఆనం

**విజయవాడ, నవంబరు5, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల కనీస వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ విషయాన్ని మంగళవారం విడుదలచేసిన సమాచార పత్రంలో వెల్లడించారు. రూ.50వేలు ఆదాయం దాటిన ఆలయాల్లో సనిచేసే వారి వేతనాలు పెంచుతున్నట్లు తెలిపారు. అర్చకు లకు రూ.15 వేల కనీస వేతనం ఇవ్వాలని సిఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయంతో 3,203 మంది అర్చకులకు లబ్ది చేకూరుతుం దని మంత్రి వివరించారు. వేదపండితులు, వేద విద్యార్థులకు నిరుద్యోగ భృత్తి ద్వారా నెలకు రూ.3వేల ఆర్థిక లబ్ది చేకూరుతుందన్నారు.

6-11Pg3exHMNWJQETR.qxd:6-11Pg3exHMNWJQETR.qxd 01/01/01 8:38 AM Page 1



# రాష్ట్రంలో ప్రాంతాల వారీగా మధ్యాహ్న భోజనం మెనూ

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ప్రాంతాల వారీగా మెనూ అమలుచేస్తే బాగుంటుందని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. ఆహారపు అలవాట్లను అనుసరించి మూడు ప్రాంతాలకు మూడు మెనూలను అమలు చేయొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంపై నిర్వహించిన ట్రైనింగ్ కేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోన శశిధర్ మాట్లాడుతూ ఇప్పటివరకు అమలు చేస్తున్న మెనూలో పోషకాలు ఎంత వరకు ఉంటున్నాయి. కొన్నింటిని పిల్లలు ఎందుకు ఆసక్తిగా తినడం లేదనేది తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కో జిల్లా నుంచి ఆరుగురు చొప్పున పాఠశాలల్లో వంట చేసేవారిని తీసుకొచ్చి, ప్రాంతాల వారీ వంటకాలతో మెనూ తయారు చేయించారు. వంట వారు తయారుచేసిన ఆహార పదార్థాలను కార్యదర్శి కోన శశిధర్ పరిశీలించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా లభించే కూరగాయలతో పోషకాహారం పెడితే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌లోనే కొత్త మెనూను రూపొందించాలి అని పేర్కొన్నారు.

## కృష్ణా నదీ యాజమాన్య మండలిపై ఒకే ధర్మాసనానికి ఎపి, టిజి ప్రభుత్వాల రిట్ పిటిషన్లు

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య మండలి పై ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వాలు వేర్వేరుగా దాఖలు చేసిన రెండు రిట్ పిటిషన్లనూ ఒకే ధర్మాసనం ముందుకు లిస్ట్ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్.ఓక జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహలతో కూడిన ధర్మాసనం సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. కేఆర్ఎంబీ న్యాయపరిధిపై కేంద్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం వేసిన కేసు విచారణ నుంచి గత నెల 18న జస్టిస్ సంజయ్‌కుమార్ వైదొలిగిన నేపథ్యంలో ఆ కేసు సోమవారం జస్టిస్ బి.ఆర్. గవాయి, జస్టిస్ కె.వి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుటకు విచారణకు వచ్చింది. అయితే ధర్మాసనం ఇందులోని వాదనలు వినకుండానే కేసు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. మరో వైపు కేఆర్ఎంబీ పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం శ్రీశైలం నాగార్జునసాగర్ నిర్వహణను దానికి అప్పగించేలా ఆదేశించాలంటూ ఏపీ ప్రభుత్వం జారీచేసిన మరో రిట్ పిటిషన్ సోమవారమే జస్టిస్ అభయ్ ఎస్.ఓక జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం దాఖలుచేసిన కేసు ఈ కేసులోని అంశాలు ఓవర్‌ల్యాప్ అయ్యే అవకాశమున్నట్లు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీంతో ఈ రెండు కేసులనూ ఒకే ధర్మాసనం విచారణ చేపట్టేలా లిస్ట్ చేయాలని ఈ విషయాన్ని పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని జస్టిస్ అభయ్ ఎస్.ఓక ఆదేశించారు.

తెలంగాణ కేసు గురువారం మధ్యాహ్నం జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వం లోని ధర్మాసనం ముందుకు విచారణకు రానున్న నేపథ్యంలో ఏపీ కేసు కూడా అదే ధర్మాసనం ఎదుటకు వచ్చే అవకాశముంటుందని న్యాయవాదులు పేర్కొన్నారు.

## ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసు సుప్రీం కోర్టును ఆశ్రయించిన విద్యాసాగర్

**విజయవాడ,నవంబరు5 ప్రభాతవార్తప్రతినిధి:** ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన అరెస్ట్‌ను సమర్థిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత నెల 10న ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టులో విద్యాసాగర్ సవాల్ చేసారు. విద్యాసాగర్ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ అరవింద కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ట్రయల్ కోర్టులో ఇప్పటికే బెయిల్ అప్లికేషన్ దాఖలు చేసినట్లు సుప్రీం కోర్టుకు విద్యాసాగర్ తరపు న్యాయవాదులు చెప్పారు. బెయిల్ అప్లికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని విద్యాసాగర్ న్యాయవాదులు విజ్ఞప్తి చేసారు. మూడు వారాల్లో బెయిల్ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని లోయర్ కోర్టుకు ధర్మాసనం మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రతివాదులకు సుప్రీంకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# తిరుమల సమాచారం

## 9న తిరుమలేశునికి పుష్పయాగం

### ఆర్జితసేవలు రద్దు

**తిరుమల,నవంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లకు పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఇందుకు 8వతేదీ శుక్రవారం అంకురార్పణ జరుగుతుంది.

సువాసనలు వెద జల్లే 17రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో ఉత్సవర్లకు వేదమంత్రాలతో పుష్పార్చన చేస్తారు. ఏడుకొండలస్వామికి ఈ ఏడాది జరిగిన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో అర్చకుల వల్లగానీ, పరిచారకులు, భక్తుల వల్ల ఏదేని జరిగిన దోషాల నివారణకు పుష్పయాగం నిర్వహించడం సంప్రదాయం. 9వతేదీ ఉదయం సంపంగిప్రాకారంలోని కల్యాణమండపంలో ఉత్సవ మూర్తులకు విశేష



స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 5గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాభరణాలతో అలంకరించి పుష్పయాగం చేస్తారు. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జితసేవలు రద్దయ్యాయి.



## నేడు కొలువుదీరుతున్న టిటిడి బోర్డు


**తిరుమల,నవంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం 54వ నూతన ధర్మకర్తలమండలి బుధవారం ఉదయం కొలువు దీరుతోంది. 29మంది సభ్యులున్న ఈ బోర్డులో బుధవారం ఛైర్మన్ బిఆర్ నాయుడుతోబాటు 15మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. వీరంతా ఇప్పటికే కుటుంబసభ్యులతో మంగళవారం రాత్రికి తిరుమలకు చేరుకోవడంతో పద్మావతి విశ్రాంతి భవనం ప్రాంతం పూర్తిగా నూతన బోర్డుసభ్యులతో సందడిగా మారింది. సాయంత్రం తిరుమలకు చేరుకున్న నూతన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు గాయత్రి అతిథిగృహం వద్ద డిప్యూటీ ఇఒ భాస్కర్, విజిఒ సురేంద్ర పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అభిమానులు గుమ్మడికాయ దీష్టి తీశారు. నేటి ఉదయం 7.30గంటలకు ఛైర్మన్‌గా ఆలయంలో బిఆర్‌నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు వసతి, దర్శనం మరింత సులభతరం చేసేలా సంస్కరణలు చేయడానికి సుముఖత చూపుతున్నారు.

# మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు హైకోర్టులో చుక్కెదురు

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఐదేళ్ల క్రితం జరిగిన ఒక వ్యక్తి హత్య కేసులో తుని రూరల్ పోలీసులు రాజాపై కేసు నమోదు చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించగా ఎదురుదెబ్బతగిలింది. తుని నియోజకవర్గం తొండంగి మండల పాత్రికేయరంగంలో పనిచేస్తున్న కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు 15 న రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని ఇంటికి వెళ్లున్నారు. అక్కడి లక్ష్మీదేవి చెరువుగట్టుపై కొందరు దుండగలు



అడ్డగించి కత్తులతో నరికి చంపారు. హత్యకు దాడిశెట్టి రాజా సూత్రధారి అనేది మృతుని కుటుంబీకుల ఆరోపణగా ఉంది. వారి ఫిర్యాదుతో తుని రూరల్ పోలీసుల కేసు నమోదు చేశారు. ఈ కేసులో దాడిశెట్టి సహా ఆరుగురిని నిందితులుగా చేర్చారు. రాజా మంత్రి అయ్యాక దర్యాప్తు ముందుకు సాగలేదు. 2023 లో ఛార్జిషీటులో ఆయన పేరు తప్పించారు. నింది తులను శిక్షించాలంటూ సత్యనారాయణ సోదరుడు, న్యాయవాది కాతా గోపాలకృష్ణ పోరాడారు. రాజాపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎన్‌హెచ్‌ఆర్‌సీతోపాటు హైకోర్టును ఆశ్రయించారు. తుని నియోజకవర్గంలోకి యువగళం పాదయాత్ర వచ్చి నప్పుడు నారా లోకేశ్‌ను కలిసి న్యాయం చేయాలని విన్నవించారు. కూటమి ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తామని లోకేశ్ అప్పట్లో భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో దాడిశెట్టి రాజాపై పోలీసులు కేసు నమోదు చేశారు.



భారత తొలి మంగళయాన్ ప్రయోగం

## మార్స్ మిషన్ ప్రయోగానికి 11 యేళ్లు పూర్తి

**శ్రీహరికోట (తడ), నవంబరు 5 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మార్స్ ఆర్బిటర్ మిషన్ (ఎంఓఎం) ప్రయోగించి 11 ఏళ్లు పూర్తయినట్లు ఇస్రో గుర్తు చేసింది. 2013లో శ్రీహరికోట నుంచి పిఎస్ఎల్‌వి ఎక్స్‌ఎల్ సి25 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. అప్పట్లో అతి తక్కువ ఖర్చుతో మార్స్‌ని ప్రయోగించిన దేశంగా ఇండియా ప్రశంసలు అందుకుంది. తొలి ఆసియా దేశంగాను, ప్రపంచంలోనే నాలుగవ దేశంగాను మార్స్‌ను ప్రయోగించిన సంస్థగా ఇస్రో నిలిచిపోయింది. ఈ సందర్భాన్ని రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోట లోని శాస్త్రవేత్తలు, అధికారులు కూడా గుర్తు చేసుకున్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**విజయవాడ,నవంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు వేకువ జామునే పుట్టలల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం కార్తీక శుద్ధచతుర్ది కావడంతో భక్తి శ్రద్ధలతో నాగుల చవితిని జరుపుకున్నారు. అనేక ప్రాంతాల్లోని శ్రీనాగాలయాల్లోను, శివాలయాల ప్రాంగణాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు బారులు తీరి శ్రీస్వామి పాలను పోసారు. అనేక చోట్ల నాగదేవతాలయాల్లోను పూజలు చేసారు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లోను భక్తులు పూజలు చేసారుపలువురు భక్తులు పిల్లలకు పుట్టల వద్ద చేవులు కుట్టించారు. కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి దేవస్థానంలో నాగుల చవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. తెల్లవారు జామున నుంచే ఇక్కడ పుట్టలో భక్తులు పాలుపోయడం ఆరంభమైంది. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, కాకినాడ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీనాగరాజు పుట్టలో భక్తులు పాలుపోసారు. గుడ్లు, తదితరాలు నైవేద్యంగా సమర్పించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు, కాకినాడ, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, నెల్లూరు, కడప, చిత్తూరు తదితర జిల్లాలో ప్రసిద్ధ నాగాలయాల్లో చవితి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పుట్టల వద్ద భక్తులు బాణా సంచాను కాల్చారు. విజయవాడ నగరంలో ప్రత్యేకంగా కొన్ని ఆలయాల్లో నాగచతుర్ది వేడుకలు నిర్వహించారు.

## నాగులచవితి పర్వదినాన పెద్దశేషునిపై మలయప్ప

**తిరుమల,నవంబరు 5 ప్రభాతవార్తప్రతినిధి:** నాగుల చవితి పర్వదినాన మంగళవారం రాత్రి ఏడుకొండల శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఏడుతలల పెద్దశేషుని వాహనంగా చేసుకుని ఊరేగారు. దీపావళి పర్వదిన ఆస్థానం వేడుకగా జరుపుకున్న నాల్గవరోజు నాగులచవితి పర్వదినం రావడం, పెద్దశేషునిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగడం ప్రత్యేకత. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామి వారిని విశేష ఆభరణాలంకృతుడ్ని చేసి మాఢ వీధుల్లో ఊరేగించారు. చల్లటిగాలులు వింజామరలా వీస్తుండగా మలయప్ప భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, ఆలయ



అర్చకులు పాల్గొన్నారు.



## శ్రీవారిసేవలో సినీనటి అనన్య

**తిరుమల,నవంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు సినీనటి అనన్య తెలిపారు. మంగళవారం శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అధికారులు స్వామివారి వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ ఏర్పాటు

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈమే రకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీలో ఇండస్ట్రీస్ కమిషనర్ మెంబర్‌కన్వీనర్‌గా ఫైనాన్స్, రెవెన్యూ, ఇరిగేషన్ , ఇండస్ట్రీస్, ఇతర బాధ్యత గల డిపార్ట్మెంట్‌ల స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సెక్రెటరీలను సభ్యులుగా నియమించారు. ఏపీలో పెట్టుబడులు ఇతరం శాలపై సీఎం చంద్రబాబు వరుస సమీక్షల్లో భాగంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం, గ్రీన్ ఎనర్జీ, పోర్టులు, పరిశ్రమలు, ఆటోమొబైల్, టూరిజం, ఐటి, ఎఐ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి పెట్టి సీఎం చంద్రబాబు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక సంస్థలు, ఐటి సంస్థల ప్రతినిధులతో చర్చించారు. మంగళవారం సైతం ఆయన పలువురు పారిశ్రామిక వేత్తలతో ఆయన సంప్రదింపులు చరిపారు. రాష్ట్రంలో పెట్టుబ డులను ఆకర్షించే పనిలో పడిపోయింది. కేంద్రం సైతం పెట్టుబడుల పరంగా వివిధ సంస్థలు ఏపీకి వచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనలో పలు దిగ్గజ సంస్థలు ఆయా సంస్థలు ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు ఏపీలో ఉన్న మౌలికసదుపాయాలపై వివరించారు. ఇప్పుడు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీని నియమించింది ప్రభుత్వం మరోవైపు సీఎం చంద్రబాబు వివిధ శాఖలపై పాలసీల రూపకల్పనపై వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పెట్టు బడులు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రాన్ని ఒక నిర్దిష్ట ప్రణాళికతో అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్న లక్ష్యంతో సీఎం అడుగులు వేస్తున్నారు.



## దీపం-2కు భారీ స్పందన

### 1682646 బుకింగ్, నేటివరకు 646350 సిలిండర్లు డెలివరీ చేసిన ప్రభుత్వం

### ఇప్పటివరకు రూ.16.97కోట్ల సబ్సిడీ లబ్దిదారుల ఖాతాల్లో జమ

**విజయవాడ నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దీపం-2 పథకం కింద మహిళల జీవితాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం చేపట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి భారీ స్పందన లభిస్తోందని పౌరసరఫరాశాఖాధికారులు వెల్లడించారు. గత నెల్లో దీపావళి కానుకగా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తం 1682646 సిలిండర్లు బుకింగ్ చేసుకోగా ఇప్పటి వరకు 646350 సిలిండర్లు డెలివరీ చేయడం జరిగింది. ఇప్పటివరకు సిలిండర్స్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు రూ.38.07 కోట్ల సబ్సిడి అందించాల్సి ఉండగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.16.97 కోట్ల సబ్సిడీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. 4.11.2024 తేదీన ఒక్కరోజు దీపం-2 పథకం కింద రూ.64980 గ్యాస్ సిలిండర్లు బుక్ కాగా 17313 సిలిండర్లు డెలివరీ చేశారు. 3.11.2024 తేదీన ఒక్కరోజే 629037 సిలిండర్లు డెలివరీ చేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల నిమిత్తం ఏర్పాటు చేసిన 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇప్పటివరకు 3660 కాల్స్ రాగా వాటికి పరిష్కారం చూపడం జరిగింది.

## దేశంలోనే అత్యుత్తమ క్రీడావిధానాన్ని రూపొందించాం: మంత్రి రాంప్రసాద్

**సచివాలయం,నవంబరు 5,ప్రభాతవార్త :** దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని రూపొందించామని క్రీడా సంఘాల తోడ్పాటుతో ఇలాంటి మరిన్ని క్రీడా పోటీలు నిర్వహణ జరగడం పట్ల మంత్రి రాంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇండోర్ స్టేడియాలు నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని అమరావతిలో దేశంలోని అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేస్తున్నారని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న వడ్లమూడి మోహనకృష్ణ మెమోరియల్ ఏపి స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-13 క్రీడా పోటీల్లో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని తెలిపారు. మోహనకృష్ణ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. నిర్వాహకులు మంత్రిని,



మంత్రి రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న బ్యాడ్మింటన్ నిర్వాహకులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాయుడుని ఘనంగా సన్మానించారు .క్రీడాకారులకు కూటమి ప్రభుత్వ హాయాంలో అన్నివిధాల తోడ్పాటు అందిస్తా మని తెలిపారు. అనంతరం విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాయుడు, మంత్రి రాంప్రసాద్ బాడ్మింటన్ ఆడారు.

## పొలసలో పోషక పదార్థాలపై పరిశోధనలకు పేటెంట్ పొందిన ప్రొఫెసర్



పేటెంట్ పత్రాన్ని చూపుతున్న ప్రొఫెసర్ పి.వి.కృష్ణ

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు 5,ప్రభాతవార్త:** వర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పి.వి.కృష్ణ గోదావరిలో లభించే పొలస చేపల్లో ఉండే పోషక పదార్థాలపై చేసిన పరిశోధనలకు గాను పేటెంట్ హక్కులను పొందారు. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాయం నుంచి అధికారిక ఆమోద ముద్ర వేస్తూ ధృవపత్రం అందింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు ప్రొఫెసర్ పివి కృష్ణకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పేటెంట్ హక్కు గ్రహీత ప్రొఫెసర్ పి.వి.కృష్ణ మాట్లాడుతూ పులస చేపల్లో ప్రోటీన్లు, సాచ్యురేటెడ్, అన్‌సాచ్యురేటెడ్ ఆమ్లాల్లో అతి ముఖ్యమైన డోకోసహెక్సయినోయిక్ ఆమ్లాల మీద పరిశోధనలు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన గత 30ఏళ్ళుగా వర్సిటీలో పరిశోధనలు కొనసాగిస్తూ 130దేశ విదేశీ జర్నల్స్‌లో ప్రచురించారు. 120సెమినార్లు, వర్క్‌షాప్‌ల్లో పాల్గొన్నారు. ఈయన పర్యవేక్షణలో 33మంది విద్యార్థులకు పిహెచ్‌డిలు ప్రదానం చేయడం జరిగింది. వీటిలో ఎక్కువగా అక్వాకల్చర్, ఫిషరీ సైన్స్ మీద పరిశోధనలున్నాయి. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వేంకటేశ్వర్లు, జియాలజీ విభాగా ధిపతి ఆచార్య పిజి రత్నాకర్, అధ్యాపకులు పివికృష్ణకు అభినందనలు తెలిపారు.



## టిడిఆర్ బాండ్ల కుంభకోణంపై తక్షణం విచారణ చేపట్టాలి

### మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేసిన టిడిపి నాయకులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబర్ 5, ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని మంత్రి నారాయణకు కాకినాడ నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లా పర్యటన సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన మున్సిపల్ శాఖ మంత్రి, కాకినాడ జిల్లాల ఇంచార్జ్ పొంగురు నారాయణకు తెలుగుదేశం పార్టీ నాయకులు గత పాలకులు చేసిన అరాచకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మల్లిపూడి వీరు తుమ్మల రమేష్ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల రూపంలో కాకినాడ కార్పొరే షన్ నిధులను సుమారు 500 కోట్ల రూపాయలు దోచుకున్నాడని, సురేష్ నగర్ నందు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన భూమిపై టీడీఆర్ బాండ్లు మంజూరు చేసి కోట్ల రూపాయలు దోచుకున్నాడని, అదేవిధంగా దుమ్ము లపేట ప్రాంతం నందు ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమిపై సుమారు 251 కోట్ల రూపాయల టి.డి.ఆర్ బాండ్లు మంజూరు చేయించి కాకినాడ నగర ప్రజల కష్టార్జితాన్ని ద్వారం పూడి దోచుకు న్నాడని అంతేకాకుండా ఇళ్ల స్థలాల భూసేకరణ మరియు ఫిల్లింగ్ పేరుతో ప్రభుత్వ సొమ్ములను కాజేశాడని, స్మార్ట్‌సిటీ నిధులు కార్పొరే షన్ నిధులను ఇష్టానుసార రీతిలో దుర్వినియోగం చేసి దోచుకున్నారని వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి దోషులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గదుల సాయిబాబా, ఒమ్మి బాలాజీ, దండుప్రోలు నాగబాబు, పంతాడి రాజు, మల్లాడి గంగాధరం, ఆన్సర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అమరావతి లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్లిప్ బోగీల నిలిపివేత

### కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బోగీల పెంపు

**గుంతకల్లు రైల్వే, నవంబరు 5,ప్రభాత వార్త:** తెలుగు రాష్ట్రాల నుంచి వాస్కోడిగామా, హుబ్లీల మధ్య తిరిగే అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు జతచేసే/ స్లిప్ బోగీలను బుధవారం నుంచి నిలిపివేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాచిగూడ నుంచి వాస్కోడిగామాకు వెళ్లే రైలు నంబర్ 17603/ 18047 అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు జతచేసే అదనపు/స్లిప్ బోగీలను బుధవారం నుంచి నిలిపివేస్తుండగా, వాస్కోడిగామా నుంచికాచిగూడకు వెళ్లే నంబర్ 18048/ 17604 నంబర్ లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు లకు ఈ నెల 8వ తేదీ నుంచి నిలిపివేస్తున్నా మన్నారు. అలాగే కాచిగూడ నుంచి హుబ్లీ వెళ్లే రైలు నంబర్ 17226/ 17604లింక్ ఎక్స్‌ప్రెస్‌కు జతచేసే అదనపు స్లిప్ బోగీలను ఈ నెల 9వ తేదీ నుంచి నిలిపివేస్తున్నామన్నారు.

**కాచిగూడ-యలహంక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బోగీల పెంపు:** ప్రయాణికుల అవసరాలను/ రద్దీని దృష్టిలో ఉంచుకుని కాచిగూడ- యలహంక- కాచిగూడల మధ్య తిరిగేనంబర్ 17603/04 ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు అదనంగా బోగీలను పెంచామన్నారు. ఈ రైలు సర్వీసులకు ఇకపై 23బోగీలతో నడుపుతున్నట్లు తెలిపారు. కాచిగూడ నుంచి యలహంక వెళ్లే నంబర్ 17603ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 7వ తేదీ నుంచి, యలహంక నుంచి కాచిగూడ వెళ్లే నంబర్ 17604 ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి బోగీలను పెంచుతున్నట్లు తెలిపారు.

వార్త

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

-రామకృష్ణ పరమహంస

# ప్రమాదాలను ఆపలేని చట్టాలు!

ఒకరు కాదు, ఇద్దరు కాదు పదులు, వందలే కాదు, వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు అసువులు బాస్తున్నారు. ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. పాలకులు ఎంతగా చెప్తున్నా ఎన్నిసమీక్షలు, సమావేశాలు జరుపుతున్నా చట్టాల మీద చట్టాలు తెస్తున్నా ప్రమాదాలు పెరుగుతున్నాయే కానీ తగ్గడం లేదు. రోడ్డెక్కిన మనిషి సురక్షితంగా ఇంటికి తిరిగి వస్తాడనే భరోసా లేదు. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సిన రహదారులు, వికలాంగమో, వీరస్వర్గమో అన్నట్లుగా దాపురిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. నిన్న సోమవారం ఉత్తరాఖండ్ లో జరిగిన ఒక బస్సు ప్రమాదంలో ఏకంగా ముప్పై ఆరుమంది మరణించారు. గర్వాల్ నుండి కుమావుకు వెళ్తున్న బస్సు మార్చుల వద్ద పక్కనే ఉన్న రెండువందల అడుగుల లోతు లోయలో పడిపోయింది. సంఘటనా స్థలం లోనే ఇరవై మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో పదహారు మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ కన్ను మూశారు. మరో అరడజన్ మందికిపైగా పరిస్థితి విష మంగా ఉన్నట్లు వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రితోపాటు ప్రధాన ప్రధానమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలపై న్యాయ విచారణకు ఆదేశించినట్లు ఆ రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రమాదాలు భారీగానే జరుగుతున్నాయి. కేంద్ర,రోడ్డు రహదారుల మంత్రిత్వశాఖ మొన్న ఆ మధ్య విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో దేశవ్యాప్తంగా నాలుగు లక్షల అరవై ఒక్కవేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే లక్షాఅరవై ఎనిమిదివేల మంది ప్రాణాలు కోల్పోయారు. మరో నాలుగు లక్షల నలభైమూడువేల మంది క్షతగాత్రులయ్యారు. అంతకుముందు యేడాది 2021తో పోలిస్తే 2022లో ప్రమాదాలు దాదాపు పన్నెండు శాతానికిపైగా పెరగగా మరణాలు తొమ్మిదిన్నర శాతం ఎగబాకాయి. క్షతగాత్రుల సంఖ్య పదిహేను శాతం అధికమైంది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే రోజూ దేశంలో పన్నెండువందలకు పైగా రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటే వాటిలో ప్రతిరోజూ నాలుగువందల అరవైరెండు మంది ప్రాణాలు వదులుతున్నారు. ముప్పైమూడు శాతం రహదారి ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్న విషయం ఆందోళన కలిగించే అంశం. వాస్తవంగా దేశవ్యాప్తంగా ఉన్న రోడ్లలో జాతీయ రహదారుల వాటా దాదాపు రెండు శాతంవరకే ఉంటే ముప్పైమూడు శాతం ప్రమాదాలు ఆ రోడ్లపైనే జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి వాటిని సవరించే ప్రక్రియ ప్రతి యేడాది చేస్తూనే ఉంటారు. జాతీయ రహదారులపై ఐదువేల ఎనిమిది వందలకుపైగా ఈ బ్లాక్‌స్పాట్లు ఉన్నట్లు గుర్తించి వాటిలో మూడువేల తొమ్మిదివందల డెబ్బైకిపైగా ఆ బ్లాక్‌స్పాట్లను సరిచేశామని కేంద్రం గత యేడాది డిసెంబరులో లోక్‌సభ లో ప్రకటించింది. జాతీయ రహదారుల మరమ్మతులు నిర్వహణతో పాటు ఈ బ్లాక్‌స్పాట్లను సరిదిద్దేందుకు 2018–2023 మధ్య దాదాపు పదిహేను వేల ఏడువం దల కోట్లకుపైగా ఖర్చుచేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చింది. అన్నివేల కోట్లు రోడ్ల మరమ్మత్తుకు, బ్లాక్‌స్పాట్లకు ఖర్చుచేస్తే ప్రమాదాలు తగ్గాలి. కానీ 2018లో జాతీయ రహదారుల మీద ఒక లక్షా నలభైనాలుగు వేల ప్రమాదాలు జరిగితే 2022నాటికి అవి లక్షా యాభైరెండు వేలకు పెరిగాయి. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారిలో అరవైశాతంపైగా ముప్పైఐదు యేళ్లలోపు వయస్సున్న వారే. ఇక ప్రమాదాలకు గురవుతున్న వాటిలో మూడోవంతు ద్విచక్రవాహనాలే. ప్రధానంగా హెల్మెట్లు ధరించకపోవడం వల్ల మరణించే వారే ఎక్కువ మంది ఉంటున్నారు. అలాగే ఆటో రిక్షాల కారణంగా కూడా సంభవిస్తున్న ప్రమాదాల్లో పాతికశాతం పైగా ప్రాణాలుకోల్పోతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలకు సంబంధించి యేటా పదిహేను వేల మందికి పైగా మరణిస్తుండగా, అరవైవేల మందికి పైగా గాయపడుతున్నారు.గత దశాబ్దంలో తెలుగు రాష్ట్రాల్లో లక్ష మందికిపైగా మరణిస్తుండగా అంతకు నాలుగు రెట్లకు పైగా క్షతగాత్రులవుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఐదేళ్లలో రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. పెరుగుతున్న ఈ ప్రమాదాల్లో బలైపోతున్న అమాయకుల విషయం పాలకులకు తెలియంది కాదు. వేలాది మందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగడం లేదేమోన నిపిస్తున్నది. సమీక్షలకు, సమావేశాలకు కొరత లేదు. అధ్యయన కమిటీలు, నివేదికలు పరిశీలించి నిర్దిష్టమైన చర్యలకు ప్రతిపాదన చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఇలాఎన్నో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగా కొన్ని ప్రోత్సాహకాలు కూడా ప్రకటించింది. వాస్తవంగా 2024 నాటికి రోడ్డు ప్రమాదాల మరణాలను సగానికి తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నా అది సాధ్యంకాదనే వాస్తవాన్ని గ్రహించి లక్ష్యాన్ని 2030 నాటికి పొడిగించింది. అయినా అప్పటికీ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితులు కన్పించడం లేదు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఈ ప్రమాదాల నివారణకు పటిష్టమైన నిర్దిష్టమైన విధానాలతో అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకుమనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



ఎమర్సన్

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్న చిన్న పనుల వల్లనే.



గిబ్బర్

# ప్రజావాక్కు



### ఉచిత సిలిండర్‌తో కెవైసీ తిప్పలు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో దీపం 2.0కింద ఉచిత సిలిండర్ పథకానికి సిలిండర్ రాయితీ పొందాలంటే ఈ కేవైసీ అనే నిబంధన అన్నిసంస్థల డీలర్లు పెట్టడంతో పెద్దఎత్తున గ్యాస్ డీలర్ల వద్దకు వెళుతుండడంతో చాలా రద్దీ తలెత్తుతోంది. దీంతో వయసు పై బడిన వాళ్లు లైనులో నిలబడ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి. గతంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో ఈ కేవైసీ తీసుకోవాలనే ప్రతిపాదన వచ్చింది. తర్వాత దాన్ని అమలు చేయలేదు. ఇప్పటికైనా ఆవిధానం అమలయ్యేలా చూడాలి లేదా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో అయినా ఈ కేవైసీ తీసుకునే విధంగా ప్రభుత్వం సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయాలి.

-దాసం వెంకటరెడ్డి,ఊరదాళ్లపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా

### పదవుల్లో కురువృద్ధులు

ఒక వయసు వచ్చాకఎలాంటి పదవుల్లో కూడదని రాజకీయ పార్టీలకుచెందిన నాయకులు నియమం పెట్టుకోవాలి. దాన్ని తు.చ తప్పకుండాపాటించాలి.అంతేకానిప్రజలు తన నాయకత్వాన్ని బలపరుస్తున్నారు.ఆదరిస్తున్నారు. ఓట్లేసి గెలిపిస్తున్నారు. చరిష్మా కరిష్మా అంటూ ఎంత వయసు మారిన వారయినాసభల్లో ప్రసంగించడం, ప్రచారం చేయడం ఎన్నికల్లో పోటీ చేయడం, పదవులను పట్టుకుని వేలాడ్డం చేయకూడదు.యువత కోసం వృద్ధనేతలే అధికార పదవులను వదులుకోవాలి.హుందాగా రాజకీయాలనుంచి తప్పుకోవాలి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### బోర్డులను ఏర్పాటు చేయాలి

కానరాని సహ చట్టం బోర్డులు సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి సుమారు ఇరవై ఏళ్లఅయినా రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు సమాచార హక్కు చట్టంకి చెందిన బోర్డులు లేవు. కొన్ని కార్యాలయాల ముందు మాత్రమే వున్నాయి. ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి,అప్పిలెట్ అధికారి వారి హోదాతో వుండే బోర్డులు లేవు. తద్వారా సమాచార హక్కు చట్టం నీరు గారిపోతుంది.తక్షణమే అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు సమాచారహక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి.

-కామిడి సతీశ్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### తిలా పాపం,తలా పిడికెడు!

వలంటీర్ల వలనే ఓడిపోయామని తాజాగా వైకాపా రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి అంటున్నారు.పార్టీ కార్యకర్తలు సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి ఒంటెద్దు పోకడల వలనే ఓడిపోయామని వాపోతున్నారు. కొంతమంది నేతలు ఈవిఎంలవలనే ఓటమి అంటున్నారు. నిజానికిపార్టీ ఓటమికి అందరూ బాధ్యులే! జగన్ మోహన్‌రెడ్డి పూర్తిగా తన సామాజిక వర్గానికే పెద్దపీటవేసి ఇతర సామాజికవర్గాల నేతలను డమ్మీలు చేశారు. అలాగే కులంకార్డుతో గెలుపొందిన నేతలు తమ తమ కులాలకు న్యాయం చేయకపోగా రేపనేది లేదన్నట్లు అడ్డంగా దోచుకున్నారు. వైకాపా పార్లమెంట్ సభ్యులు రాష్ట్రానికి కావల్సిన నిధులు,పరిశ్రమల వంటిసమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తిన పాపాన పోలేదు. మెడలు వంచి విభజన హామీలు అమలు అయ్యేలా కేంద్రం నుంచి సాధిస్తామని చెప్పి కేసుల నుంచి విముక్తి కోసం సాగిల పడ్డారు. అసలు ఓటమికి ఇదే బలమైన కారణం. కోడికత్తి,గులకరాయి డ్రామాలు వికటించి ఘోర పరాజయానికి మరో కారణం అయ్యాయి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### అందరూ విజేతలు కాలేరు

రాజకీయ నాయకులు ఎన్నికల్లో క్రీడాకారులు ఆటల్లో గెలుపొందాలని చాలా కష్టపడతారు. అయినా కష్టపడిన వారందరు గెలుపొందలేదు. పోటీపడిన ఇద్దరిలో ఒకరు గెలుస్తారు. మరొకరు ఓడతారు. గెలిచిన వారు పొంగిపోతారు. ఓడిన వారు కుంగిపోతారు. సహజంగా జరిగేది ఇదే. అయితే పోటీలో ఓడినా, చెదరని చిరునవ్వుతో ప్రశాంతంగా ఉండే వారిని స్థితప్రజ్ఞులు అంటారు. ఇలాంటి వారికి ఎన్ని ఓటములు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరు. గెలుపుపై నమ్మకంతో ఉంటారు. ఇలాంటి వారు ఏరంగంలోనైనా అరుదుగా ఉంటారు.

-రాశి, హైదరాబాద్

### బస్సుల్లో వికలాంగులకు సీట్లు!

పల్లె నుండి పట్నం వరకు ఉన్న వికలాంగులైన ప్రయాణికులకు బస్సు లలో వారికి కేటాయించిన సీట్లను వారికి తప్పకుండా వర్తింపజేయాలి.బస్సు లలో వికలాంగులు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు.మహిళాలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలోనే నిర్ణయించి అమలు చేస్తుంది. అదే విధంగా ప్రభుత్వం వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# పవన్ వ్యాఖ్యలు శ్రుతి మించాయా!

**ఈ స్థితిలో రాజకీయ లక్ష్యాలు,కోణాల సంగతి ఎలా వున్నప్పటికీ ప్రజలు మాత్రం పవన్ ఆవేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి సమాధానం లభిస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ఆ పార్టీ నాయకులు తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీపడి తమ పార్టీలలో చేర్చుకోవడంపై ఆయా పార్టీల కార్యకర్తలు ఆశ్చర్యపోతున్నారు. జగన్మోహన్‌రెడ్డి సమీప బంధువులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవాల్సినఆగత్యం ఏమిటని ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలు నేడు జనసేన పార్టీలో కీలకంగా మారుతుండడం కూటమి కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.**



అన్నవరపు బ్రహ్మయ్య
సీనియర్ పాత్రికేయులు

నేను హోమ్ మంత్రినైతే రాష్ట్రంలో పరిస్థితులు ఈ విధంగా వుండేవి కావు, అవసరమైతే నేనే హోమ్ మంత్రినవుతాను'అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. సహచర మంత్రి పనితీరుపై మరో మంత్రి వ్యాఖ్యానం చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమమని చెప్పవచ్చు. పవన్ మాట్లాడిన తీరు చూస్తుంటే తాను కూడా కూటమి ప్రభుత్వపాలనలో భాగస్వామ్యుడనే అంశాన్ని మరచిపోయినట్టుగా వుంది. ప్రతిపక్షనాయకుడు ప్రభుత్వాన్ని విమర్శించినట్టుగా విమర్శించడంలో ఆయన ఆవేశంలో విచక్షణ కోల్పోయి శ్రుతిమించి మాట్లాడారా? లేక తెరవెనుక లక్ష్యం వేరేగా వున్నదా? అనే అనుమానం కలుగుతోంది. నాణానికి బొమ్మ బొరుసు వున్నట్టుగానే పవన్ వ్యాఖ్యలను రెండు కోణాలలో చూడాల్సి వుంది. మొదటి కోణం విషయానికి వస్తే ఉప ముఖ్యమంత్రి పవన్ తన సహజ సిద్ధమైన ఆవేశంతో మాట్లాడారనిపిస్తోంది. సహజంగా హోమ్ మినిష్టరు పోలీసు విభాగానికి బాధ్యత వహిస్తున్నప్పటికీ లా అండ్ ఆర్డర్ నిర్ణయం మాత్రం ముఖ్యమంత్రి చేతిలో వుంటుంది. పవన్ కళ్యాణ్ మాట్లాడిన అంశాలలో అధిక భాగం లా అండ్ ఆర్డరుకు సంబంధించినవే. ఈ స్థితిలో ఆయన బహిరంగంగా హోమ్ మంత్రి శ్రీమతి అనిత పేరు ప్రస్తావించినప్పటికీ పరోక్షంగా ముఖ్యమంత్రిని లేదా ప్రభుత్వ పాలనాతీరును విమర్శించినట్లు అవుతుంది. అంతేకాకుండా ప్రత్యేక సందర్భాలలో ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నప్పటికీ పాలనాపరమైన నిర్ణయాలన్నీ కేబినెట్ నిర్ణయం మేరకే అమలు జరుగుతాయి. రాజకీయపరంగా నమోదైన కొన్ని రకాల కేసులను ఉపసంహరించుకోవడం లేదా రద్దుచేయడం వంటి అంశాలు కేబినెట్ నిర్ణయం మేరకే జరుగుతాయి. అందువల్ల కేబినెట్ మంత్రిగా ప్రభుత్వ వైఫల్యాలకు ఆయన కూడా బాధ్యత వహించాల్సి వుంటుంది. ఈఅంశాలు ఉప ముఖ్యమంత్రి స్థాయిలో వున్న పవన్ కళ్యాణ్‌కు తెలియవని అనుకోలేం. అందువల్ల తాను కేబినెట్లో అందరిలో ఒకని మాదిరిగా కాకుండా తన వ్యక్తిగత, తన పార్టీ జనసేన ప్రత్యేకతను చాటుకోవాలని భావిస్తున్నారా? బిజెపితోకూడిన రాజకీయ లక్ష్యం ఏమైనా వున్నదా? అనే అనుమానం కలుగుతోంది. “నేను హోమ్ మంత్రినైతే రాష్ట్రంలో పరిస్థితులు ఈ విధంగా వుండేవి కావు. అవసరమైతే నేనే హోమ్ మంత్రినవుతాను, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మాదిరిగా వ్యవహరిస్తాను' అని అనడంలో బిజెపి ప్రభావం వుందనే భావన ప్రజలలో కలుగుతోంది. ఒకే దెబ్బకురెండు పిట్టలు అన్నట్టుగా ఒకేసారి వ్యక్తిగతంగా తన పార్టీ జనసేన ప్రతిష్టను, బిజెపినేత ఆదిత్యనాథ్ పేరు ప్రస్తావించడం ద్వారా అటు భారతీయ జనతాపార్టీ గొప్పతనాన్ని చాటి చెప్పినట్లయింది. ఇదేసమయంలో “దేశానికి తొలి హోమ్ మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి తొలి ప్రధాన మంత్రి అయినట్లయితే భారతదేశం మరోవిధంగా



వుండేది“ అని బిజెపి, ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్) అభిమానులు తరచూ వ్యాఖ్యానిస్తుంటారు. ఇదేతరహాలో “నేను హోమ్ మంత్రినైతే రాష్ట్రంలో పరిస్థితులు ఈ విధంగా వుండేవి. కావు” అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడంలో వెనుక వున్నది ఎవరో అందరికీ అర్థం అవుతోంది. రెండో కోణం విషయానికి వస్తే ముఖ్యమంత్రిని చంపుతానని బెదిరించినవారిపై చర్యకు భయమెందుకు? పార్టీ కార్యాలయాలపై దాడులు చేసినవారిపై చర్యలు మీనమేషాలు లెక్కించడం ఎందుకు? అనే అభిప్రాయం పవన్ కళ్యాణ్లోనే కాదు సాధారణ ప్రజలలో ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడిన కూటమి పార్టీల కార్యకర్తలందరిలో వుంది. అటు తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు సామాజిక వర్గానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు (మంత్రులు సైతం), ఇటు పవన్ కళ్యాణ్‌కు సామాజిక వర్గానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు(మంత్రులు సైతం) చేసిన వ్యాఖ్యాలు, దుర్భాషలను కార్యకర్తలు మరచిపోలేకపోతున్నారు. వైరి పక్షాలకు చెందిన నాయకులు రాజకీయంగా విమర్శలు చేసుకోవడం సహజమే, కానీ వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు నాటి ప్రతిపక్ష నేతల భార్యలు, పిల్లల వ్యక్తిత్వహరణ చేస్తూ నీచంగా మాట్లాడారు. ఆనాడు తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన అనేకమంది కార్యకర్తలకు కూడా క్షేత్రస్థాయిలో నరకాన్ని చూపించారు. ఈ కారణంగానే ప్రజలు కసితో ఎక్కడ ఎక్కడి నుంచో వచ్చి ఓటింగ్లో పాల్గొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడారు. ఈ స్థితిలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే తాము పడ్డ కష్టాలకు సమాధానం లభిస్తుందని కార్యకర్తలు భావించారు. కానీ ఆచరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవసరానికి మించి పెద్దరికాన్ని ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం ప్రజలలో వ్యక్తం అవుతోంది. ఇదే అంశాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రస్తావించారు. 'జగన్ అనుమతిస్తే చంద్రబాబును, లోకేష్‌ను గంటలో లేపేస్తా, పిల్లల పోలిక ప్రస్తావిస్తూ నేతల భార్యల వ్యక్తిత్వాన్ని హననం చేసిన నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు? పసిపిల్లలపై ఘోరాతి ఘోరంగా హత్యాచారాలకు పాల్పడుతున్న నేరస్తులను పట్టుకోవడంలో కులం ఏమిటి? అంటూ ప్రశ్నించడాన్ని సాధారణ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. ఇప్పటి వరకు అరెస్టు అయిన వైసిపి నాయకులలో అత్యధికులు బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే ఉన్నారు. అధికార అహంతో పిల్లల పోలికలను ప్రస్తావిస్తూ నీచాతినీచంగా ఉన్న అగ్రకులాలకు చెందిన నేతలను పోలీసులు కనీసం తాకలేకపోతున్నారు. ఈ స్థితిలో రాజకీయ లక్ష్యాలు,కోణాల సంగతి ఎలా వున్నప్పటికీ ప్రజలు మాత్రం పవన్ ఆవేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి సమాధానం లభిస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ఆ పార్టీ నాయకులు తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీపడి తమ పార్టీలలో చేర్చుకోవడంపై ఆయా పార్టీల కార్యకర్తలు ఆశ్చర్యపోతున్నారు. జగన్మోహన్‌రెడ్డి సమీప బంధువులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవాల్సినఆగత్యం ఏమిటని ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలు నేడు జనసేన పార్టీలో కీలకంగా మారుతుండడం కూటమి కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ●

# ప్రమాదంలో మానవ మనుగడ

**పుల్లెంల గణేష్**

జీవ పరిణామ పరివర్తన సిద్ధాంతం ఆధారంగా కొన్ని వేల లక్షల సంవత్సరాల క్రితం ప్రకృతిలో ఉన్న పంచభూతాలమధ్య జరిగిన సంఘర్షణలో భాగంగా భూగ్రహంపై ఎన్నో వేలలక్షల జాతుల జీవాలు పురుడు పోసుకున్నాయి. అయితే నేడు మానవుడు సాధించిన నాగరికత ప్రగతిలో భాగంగా ఒక భూగ్రహం మాత్రమే వివిధ జీవరాశులకు మనుగడ సాగించటానికి అనుకూలమైన ప్రాంతం కాగా, భూగ్రహంపై ఉన్న వేలాదిలక్షలాది జీవాల్లో బుద్ధిగల జీవి మానవ జాతి మాత్రమేనని జగమెరిగిన సత్యం. అయితే ఆనాటి ప్రాచీనకాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు అన్ని జీవరాశుల మనుగడలో భాగంగా మానవుడు కూడా మనుగడ సాగించటానికి పోరాటం చేస్తూనేఉన్నాడు. నాటి ప్రాచీన కాలంలో మానవుడు మేధస్సు మెరుగుపడక ఒకరిని ఒకరు చంపుకొని క్రూరమైన జీవరాశులతో పాటు తేడా లేకుండా జీవిస్తే, నేడు ఇంత ఆధునిక సమాజంలో ఉండి కూడా క్రూరమైన జంతువుల వలె మానవుడు ప్రవర్తిస్తూ జీవిస్తున్నాడని లోతుగా ఆలోచిస్తే నిరూపణ కాబడుతుంది. అన్ని జీవరాశుల వలె మానవుడు మనుగడలో ఉండగలుగుతున్నాడు. ఇక రోజురోజుకు మానవుడు సాధించిన ప్రగతి నాగరికతలో భాగంగా మెరుగైన జీవన విధానాన్ని సాగించటం కోసం మానవ సాంస్కృతిక విప్లవంలో భాగంగా మానవుడు వర్ణం, మతం, కులం, ప్రాంతీయ, భాషాపర తారతమ్యాలను పెంచి పోషించుకుంటున్నాడు. వీటిలో భాగంగానే మానవుడు మరింత గొప్పగా జీవించటానికి భయభ్రాంతులతో కూడిన మెరుగైన జీవన విధానం ఉండటం కోసం దైవత్వాన్ని సృష్టించుకుని తనకు తానుగా స్వీయ క్రమశిక్షణ విధానాన్ని పాటించుకొని మానవుడు చేసే తప్పొప్పుల్లో భాగంగా దైవత్వాన్ని సృష్టించుకున్నాడు. ప్రాచీన కాలంలో మానవ మనుగడని కాపాడటం కోసమే దైవత్వాన్ని సృష్టించుకున్న మానవుడు నేడు అదే దైవత్వం పేరుతో సాటి మానవుడి పైనే స్వేచ్ఛసమానత్వ సోదరభావ మానవత్వ విలువ లేకుండా తోటి మానవుడిని బుద్ధిలేని జీవి వలె క్రూరంగా చంపుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక సమాజం వరకు మానవుడు తోటి మానవుడితో సంబంధాలు పెట్టుకొని వర్ణం జాతి మతం కులం భాష వివిధ భేదాలతో వివిధ దేశాలుగా ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను కాపాడుకోవటం కోసంఎంతో అత్యాధునికమైన రక్షణ ఆయుధాలను మానవుడు తయారుచేసుకున్నాడు. ప్రకృతి ధర్మంలో భాగంగా ఒక జీవి బ్రతకాలంటే మరొక జీవిపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడక తప్పదు.అందులో భాగంగానే అవసరానికి మించి ఒక జీవిని చంపి మరొక జీవి జీవించాల్సిన పరిస్థితి సహజంగా ఉండినప్పటికీ, నేడు ఆ సహజ సూత్రాలను మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం తోటి మానవుడిని చంపే అనాగరికంలోకి నెట్టివేయబడ్డాడు. ఇదిఆనాటి నుండి నేటివరకు మానవుడు సాధించినఅత్యంత గొప్పదైన అభివృద్ధి అని చెప్పుకోవటం మానవ సమాజానికే సిగ్గుచేటు. ఆధునిక సమాజంలో జీవిస్తూ కూడా తెలియకుండానే ప్రాకృతిక వ్యవస్థను అమలుపరుస్తున్నాం. ప్రాకృతిక వ్యవస్థ అంటే ఎంతోమంది రాజనీతిజ్ఞుల అభిప్రాయం ప్రకారం రాజ్యం రాజకీయ జీవితం ఏర్పడకముందు మానవుడు కొనసాగించిన జీవన విధానమే “ప్రాకృతిక వ్యవస్థ” ఈ ప్రాకృతిక వ్యవస్థలో మనిషి మనిషికి మధ్య స్వేచ్ఛ సమానత్వ సోదరభావం వివిధ మానవత విలువలు లేవు. నేడు మానవుడు సాధించిన ప్రగతిలో భాగంగా మా దేశమే గొప్పగా అభివృద్ధి చెందాలని, మా దేశీయులు మాత్రమే అత్యంత ఉన్నత స్థానంలో ఉండాలని, మా మత దేవుడు మాత్రమే ప్రథమ స్థానంలో ఉండాలన్న నెపంతో వివిధ దేశాల మధ్య ప్రత్యక్షంగా పరోక్షంగా నేడు యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య పరోక్షంగా 'కోల్డ్‌వార్' జరుగుతూనే ఉన్నది. కారణాలు ఏమైనప్పటికీ మానవుడు సృష్టించుకున్న కులం మతం ప్రాంతం వర్ణం, భాష, దైవత్వం వివిధ తారతమ్యాల మూలంగా ఒకవిధంగా మానవ మనుగడనే ప్రమాదంలోకి నెట్టివేయబడిందని స్పష్టంగా నిరూపణ కాబడుతున్నది.మానవ మనుగడకే ముప్పుతెస్తున్న మారణహోమం చేస్తున్న దుర్భేద్యమైన ఆయుధాలు లేని మానవ సమాజాన్ని చూడగలమా అనే ప్రశ్నవేసుకుంటేసాధ్యమయ్యే పనేనా అని మరో ప్రశ్న రాక మానదు. మొదటి ప్రపంచ యుద్ధ తదనంతరం ఏర్పడిన నానాజాతి విఫలం అవ్వటం మూలంగానే రెండవ ప్రపంచ యుద్ధం జరిగి ఐక్యరాజ్య సమితి ఏర్పాటైంది. దాదాపుగా ఏడాది పైగా రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం, నేడు తాజాగా ముస్లిం క్రిస్టియన్ దేశాల మధ్య జరుగుతున్న బాంబుల యుద్ధం మూలంగా ఐక్యరాజ్య సమితి విఫలమై మూడవ ప్రపంచ యుద్ధమే జరిగితే నేడు ప్రపంచ దేశాలకు ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మూలంగా అణుబాంబులతో యుద్ధాలు జరిగితే ఈ భూమిపై ఒక్క మానవ మనుగడకే కాదు సమస్త జీవరాశులకే మానవుడు ముప్పు తెచ్చినవాడు అవుతాడు. ఒక మానవ సమాజంతప్ప మిగతా జీవరాశులన్నీకూడా వాటికి ఎలాంటి రక్షణ ఆయుధాలు లేకుండా ఆయా జీవరాసులు బతకటం కోసమే మరోజీవిపై ఆధారపడుతూ సజాతిగల జీవరాశులన్నీ కూడా బుద్ధిలేని జీవరాశులైనప్పటికీ ఐకమత్యంగా జీవించగలుగుతున్నాయి. కాని ఈ అనంత విశ్వంలో ఒక్క మానవ సమాజం మాత్రమే బుద్ధిగల జీవజాతి అయినప్పటికీ మానవులుగా తమకు తాము సృష్టించుకున్న మతం కులం వర్ణంప్రాంతం భాషదైవత్వం, మరెన్నో తారతమ్యాల మూలంగా మానవ సమాజమంతా సజాతీయంగా ఐకమత్యంగా జీవించలేకపోతున్నాం. మానవుడు అత్యాశను స్వార్థబుద్ధిని పక్కకు పెట్టి మానవ సమాజమంతా ఒక్కటేనని బ్రతకటానికిఇలాంటి తారతమ్యాలు అవసరంలేదు. ●

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

**రామ కిష్టయ్య సంగన భట్ల**

అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థికలాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వ కోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీవల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేకపోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది. ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం,తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈసమస్యను అరికట్టేందుకు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమలు నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించిపోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు,వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూ సమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లనునరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరవు వంటి ప్రతికూల మార్పులు చోటు. చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరవులు, అగ్ని



ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించకపోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయుకాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యంవల్ల నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విషపదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్యసమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్ట డానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుస రిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి.ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం సొంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం,అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవన శైలిని సవరించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలుచేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయుకాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి కృషిచేయాలి. పర్యా వరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించగలుగుతాం. ●

## అందరం కష్టపడదాం.. ఒంగోలులో మార్పు తీసుకువద్దాం

**- ఆత్మీయ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల**

**ఒంగోలు, ప్రభాతవార్త**



గత ఐదేళ్లు ఎలా గడిచాయో అనవసరం, మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒంగోలులో మార్పు కనిపించాలి, అందుకు అందరం కష్టపడదాం, నానుండి మీకు పూర్తి సహకారం అందిస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు స్పష్టం చేశారు. ఒంగోలు నగర పపాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో ఒంగోలులోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొని వారికి దిశా నిర్దేశం చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు 70 సచివాలయాలు ఉన్నాయి, ప్రజలు మీ వద్దకు వచ్చినప్పుడు వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. మీ వద్దనే సమస్య పరిష్కారం కావాలి తప్పితే ప్రజలు నా వద్దకు రాకూడదని స్పష్టం చేశారు. అందరం కలిసి మనస్ఫూర్తిగా పనిచేస్తే మంచి మార్పు వస్తుందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఈ మార్పు చూసి ఆశ్చర్యపోయే విధంగా ఉండాలన్నారు. ప్రతి సచివాలయం నుండి పూర్తి స్థాయిలో నేను రిపోర్టు తీసుకుంటాను, కనుక జాగ్రత్తగా పని చేయాలని ఆదేశించారు. పది సచివాలయాల పర్యవేక్షణకు ఒకరిని





మానిటరింగ్ చేసేలా నియమించనున్నట్లు తెలిపారు. మీకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని దామచర్ల సున్నితంగా హెచ్చరించారు. ఒంగోలు నగర పాలక సంస్థలో మంచి అధికారుల టీమ్ ఉందని, అందరం కష్టపడి వ్యవస్థను బాగు చేద్దామని దామచర్ల సూచించారు. తాను కూడా త్వరలో డివిజన్లు పర్యటించనున్నట్లు తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మనది ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగులు చక్కగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉద్బోదించారు. ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఎవరైనా తప్పు చేస్తే క్షమించేది లేదని సున్నితంగా హెచ్చరించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగిన ఆత్మయ సమావేశంలో కమీషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఫీజులు చెల్లించేలా తీర్మానం చేయాలి - ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**




రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెండింగ్‌లో వున్న ఫీజుల విడుదల తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో లాయర్‌పేట సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్ పెండింగ్‌లో వున్న మెస్ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంపు, ఎస్‌టి హాస్టల్స్‌లో అక్షయ పాత్ర ద్వారా భోజన సరఫరా నిర్ణయం ఉపసంహరించుకోవడం, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ భవన నిర్మాణం కోసం నిధుల కేటాయింపు అంశాలను మంత్రివర్గ సమావేశంలో చర్చించి తీర్మానం చేయాలని, విద్యార్థులు ప్రయోజనాలను విస్మరిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

## వినతిపత్రాల అందజేత

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**

డిమాండ్‌ల పరిష్కారానికై 104 సిబ్బంది జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సి వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. 104 సేవలను ప్రభుత్వమే పిహెచ్‌సి ద్వారా నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లోకి డ్రైవర్, డిఇఒకు జిఓ నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరవిందో యాజమాన్యం వసూలు చేసిన పిఎఫ్ సొమ్ము వెనక్కి తెప్పించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్‌లకు శ్లాబ్ అమలు చేయాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని, భీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.శ్రీనివాసరావు, కె.రవివర్మ, డిఇఓలు, డ్రైవర్‌లు, సిఐటియు కాలం సుబ్బారావు పాల్గొన్నారు.

## 4వ రోజు కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలు

**వేటపాలెం, నవంబర్ 5, ప్రభాతవార్త**




వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో 1972 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్యశాల శిథిలావస్థలో ఉంది. శిథిలమైన కట్టడాలను పునర్నిర్మాణం చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నాల్గో రోజుకు చేరాయి. రాంబాబు మంగళవారం నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో వైద్యశాల ప్రస్తావన రాకపోవడం పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. స్థానిక గ్రామ స్థాయి నాయకులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్య అయిన వైద్యశాల దుస్థితి పట్ల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పట్టి పట్టనట్లు వ్యవహరించడం శోఛనీయం అన్నారు. గతంలో ఎమ్మెల్యే నేరుగా వైద్యశాలను సందర్శించి ఇక్కడి స్థితిగతులను తెలుసుకుని కూడా ఇచ్చిన హామీలను మరిచారని అన్నారు. సరైన స్పందన లేనప్పుడు రిలే నిరాహార దీక్షలు మరో(ఉధృతం) రూపం దాల్చడానికి కూడా వెనకాడబోమని ఆయన స్పష్టం చేశారు.

## ఎరువులు ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు

**కొండపి, నవంబర్ 5, ప్రభాతవార్త**



రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఎవరైనా ఎరువులను ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం నాడు కొండపి మండలంలోని ఎరువుల, పురుగు మందుల షాపులను మండల వ్యవ సాయాధికారి విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుతంరబీ 2024-25 సీజన్‌కు సంబంధించి ఎరువులు విక్రయిస్తున్న షాప్ డీలర్లు తప్పనిసరిగా ధరల పట్టిక నందు, స్టాక్ ఎంట్రీ పుస్తకం నందు వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని తెలియజేశారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఎవరైనా ఎరువులను ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీకాంత్ ఉన్నారు.

## రుసుం అహ్మద్‌ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బాబురావు

**సీఎస్‌పురం, నవంబర్ 5, ప్రభాతవార్త**



సీఎస్‌పురం మండలంలోని కొవిలంపాడు గ్రామానికి చెందిన రుసుం అహ్మద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కొవిలంపాడులోని వారి నివాస గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కేవి ప్రకాష్‌రావు, సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారది, డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, నున్నా వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**

## నాగులచవితి పూజలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా

**సంతనూతలపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**





నాగులచవితిని పురస్కరించుకుని ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న నాగేంద్ర స్వామి పుట్ట వద్ద మంగళవారం నాడు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు- లక్ష్మీ పద్మావతి దంపతులు పూజలు నిర్వహించారు. నాగేంద్ర స్వామికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు ఆవు పాలు పోసి తమ మొక్కుబడిని తీర్చుకున్నారు.

# కూటమి ప్రభుత్వ పాలన ఘోరంగా విఫలమైంది





**ఒంగోలు, ప్రభాతవార్త**

- రాష్ట్రం రవాణకాష్టలా మారింది
- ఏపీలో లా అండర్ విఫలమైంది.
- ఇసుక మాఫియా జరుగుతుందని సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు
- మాజీ మంత్రి, ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన ఘోరంగా విఫలమైందని రావణ కాష్టలా మారిందని సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మమ్మల్ని తిడుతున్నారని చెప్తున్నారని ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం దారుణంగా ఉందని, బయటకు వెళ్లే మమ్మల్ని తిడుతున్నారని, పవన్ కళ్యాణ్ ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఏపీలో లాండ్ అండ్ ఆర్డర్ విఫలమైందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పట్టించుకోవడం లేదని, ఏదైనా చేస్తామంటే కుదరదని ఆయన పేర్కొన్నారు. మీ ఇష్టానుసారంగా మర్డర్‌లు, మానభం గాలు, కూల్చివేతలు చేసే హక్కు మీకు ఎవరిచ్చారని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. ఏపీలో ఇసుక మాఫియా జరుగుతుందని సాక్షాత్తు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్లమెంటు సభ్యులతో పాటు 12 ఎమ్మెల్యే స్థానాలను గెలిపించే బాధ్యత తనపై జగన్‌మోహన్‌రెడ్డి పెట్టారని, రానున్న ఎన్నికల్లో తన వంతు కృషి చేసి అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కేబినెట్ టోటల్‌గా ఫెయిల్ అయిందని, శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని, విధి నిర్వహణలో హోం మంత్రి ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. మహిళలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయిందని, వారిపై అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని అన్నారు. వీటన్నింటిపై చంద్రబాబుదే నైతిక బాధ్యత అని అన్నారు. మరో వైపు పోలీసు వ్యవస్థను రెడ్ బుక్ రాజ్యాంగంగా అమలు చేయడానికి మాత్రమే వాడుకుంటున్నారంటూ, ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆ అరెస్టులను, ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు రెండింటిని కలుపుతూ పవన్ కళ్యాణ్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 50 మంది ట్రైనింగ్ డీఎస్పీలు, 35 మంది ఏఎస్పీలు, సీఐలకు పోస్టింగ్‌లు లేకుండా ఉన్నారని, వారి సేవలను వినియోగించుకోవచ్చుకదా అని ఆయన పేర్కొన్నారు. వైసీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్షకట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా, నిరంకుశంగా వ్యవహరిస్తుందని, ప్రశ్నిస్తే అరెస్టులు చేసి కేసులు పెడుతుందని, సోషల్ మీడియాకు భయపడే ప్రభుత్వం ఈ పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తూ మనపై చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొడుతూ సోషల్ మీడియాకు అండగా నిలవాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ వెన్నంటి ఉండి వారి కష్టసుఖాల్లో తాము పాలుపంచుకుంటామని ఆయన పేర్కొన్నారు. ( కార్యకర్తలు సమన్వయంతో పాటించి జిల్లాలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలన్నారు. ఈవీఎంల విధానాన్ని రీజనల్ కోఆర్డినేటర్‌గా తాను వ్యతిరేకిస్తున్నానని, పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. వైసీపీకి కేవలం 11 సీట్లు తెచ్చుకునేలా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేయలేదని, రెండు మూడు తప్పులు ఏ ప్రభుత్వంలోనైనా జరుగుతాయని, అంతే గాని ఇంత ఘోరంగా ఓడిపోవడానికి కారణం ఈవీఎంలేనని పలు సందర్భాల్లో తేటతెల్లం అవుతుందని అన్నారు. ఇటీవల హర్యానాలో కూడా ఇదే జరిగిందని ఆయన పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఈవీఎంల గురించి ఎందుకు ప్రస్తావించలేదని అంటే ఒక విలేకరు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. మన దగ్గర సరైన సాక్షాధారాలు లేనప్పుడు మనం నిందించడం సరికాదని తెలిపారని పేర్కొన్నారు. ఒంగోలు పార్లమెంటు పరిశీలకుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పరిపాలన బలహీనంగా ఉంటే క్రిమినల్స్ అప్‌డేట్ అవుతారని, క్రిమినల్స్ కంటే పోలీసు వ్యవస్థ బలహీనపడిందని మంత్రులే అంగీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రెడ్ బుక్ పేరుతో రెచ్చగొట్టే క్రిమినల్స్‌ను తయారు చేస్తున్నారని ఆరోపించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హోం మంత్రి పదవి తీసుకుంటే తప్ప రాష్ట్రంలో లాఅండ్ ఆర్డర్ కంట్రోల్ కాదని అంగీకరించాలని అన్నారు. ఏవీఎం ప్రొడక్షన్స్ వారి మాయా బజారుకు వచ్చినట్లు ఈవీఎం ప్రొడక్షన్ వారి కూటమి ప్రభుత్వం వచ్చిందని ఆయన ఎద్దేవ చేశారు.



ప్రభుత్వం చేస్తున్న తప్పులు సోషల్ మీడియాలో ఎత్తిచూపితే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. స్కూల్‌కు వెళ్లిన చిన్న పిల్లలు తిరిగి వచ్చే పరిస్థితి నేడు లేదన్నారు. తల్లిదండ్రులు అభద్రతభావంతో బ్రతుకుతున్నారని ఆయన ఆరోపించారు. వీది వీదికి బెల్టు షాపులు పెడుతున్నారని, వీటి వలనే క్రైమ్ రేటుపెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కూల్‌డ్రింక్ దొరికినంత ఈజీగా మద్యం దొరుకుతుందన్నారు. బెల్టు షాపులపై పోరాటం చేసే రోజు త్వరలోనే వస్తుందన్నారు. ప్రతిపక్షం పోరాటం వైసీపీకి కొత్త కాదని తెలిపారు. డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గలతో పాటు ఎంపీ స్థానాన్ని రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పట్నించో ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏ సమస్య వచ్చినా జిల్లా నాయకత్వం మీ వెన్నంటే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సరైన సమాచారం అందాలంటే సోషల్ మీడియా ఉంది. వారు గొంతునొక్కే ప్రయత్నం జరుగుతుందని, కాబట్టి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్తున్న అంశం ప్రజల కోసం వాస్తవాలు వెల్లడించే సోషల్ మీడియా కార్యకర్తలను మనం కాపాడుకుంటే వారే మన గొంతుకకు నిలుస్తారని అన్నారు. ఈ శక్తిని మనం కాపాడుకోవాలని, మన కోసం నిలబడే వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనకు ఉందని చెప్పారు. మనం నిజం పక్షాన ఉన్నాము కాబట్టి మనకు మద్దతిచ్చే వారికి మన సహాయం అవసరమైనప్పుడు వెంటనే స్పందించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం లోపాలు ఎత్తి చూపుతూ, కుట్ర రాజకీయాలు ఎత్తి చూపుతూ నిలబడే వారికి మేమున్నాం, మీకు అనే ధైర్యం భరోసా మనం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మన స్వేచ్ఛను హరించే ప్రయత్నాన్ని ఎదుర్కొన్నామని, దేనికైనా మేమున్నాం, మన పార్టీ ఉందని చెప్పాలని, అనేక చోట్ల తప్పుడు కేసులు పెట్టి వేదింపులకు గురి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎవరికి ఎలాంటి సాయం కావాల్సి వచ్చిన వెంటనే వారితో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని బూచేపల్లి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, సుధాకరరావు, కనిగిరి ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ, మాజీ చైర్మన్‌లు కాకుమాను రాజశేఖర్, కనకారావు మాదిగ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కుప్పం ప్రసాద్, చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కే.ఆదెన్న, వైసీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, కొట్ల రామారావు, వైసీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీలో కార్యాలయంలో ప్రారంభమైన జిల్లా సమీక్ష:**

ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైపీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు కమిటీని కూడా త్వరలో నియమించనున్నట్లు తెలిపారు.

# ప్రజల అర్జీలు సహేతుకంగా పరిష్కారం అయ్యేలా పర్యవేక్షించాలి

**- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**






**ఒంగోలు, ప్రభాతవార్త**

తమ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు సహేతుకంగా పరిష్కారం అయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత డివిజన్ సబ్ కలెక్టర్, ఆర్డీఓ లదే అని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో స్థానిక ప్రకాశం జిల్లాలోని గ్రీవెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఆయా డివిజన్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని దిశానిర్ధేశం చేశారు. మీ కోసం అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆడిట్ కూడా జరుగుతున్నట్లు చెప్పారు. రెవెన్యూ సమస్యలపై వస్తున్న అర్జీలు తగ్గుముఖం పట్టాయని, వచ్చిన ప్రతి అర్జీని సహేతుకంగా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. మీకోసం అర్జీలను పరిష్కరిస్తున్న తీరును రాష్ట్ర స్థాయి నుంచి ప్రభుత్వం కూడా పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ దృష్ట్యా క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరును ఆయా డివిజన్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి రోజు ఒక గంట పాటు మీ కోసం అర్జీలపై దృష్టి సారించాలని దిశానిర్ధేశం చేశారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార గడువు చివరి తేదీ వరకు వేచి చూడకుండా సాధ్యమైనంత వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉన్నందున నీటి వనరులు కబ్జాకు గురి కాకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.చిన్న ఓబులేషు, డీఎస్ఓ పద్మశ్రీ, ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న,తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు చూపాలి

**- రాష్ట్ర డైరెక్టర్‌కు కాలేషా వినతి**

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**

రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవిప్రకాష్ రెడ్డిని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా మర్యాదపూర్వకంగా కలిశారు. డిగ్రీ చదివిన దివ్యాంగులు ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతిలో ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు రమణయ్య,సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

## అధిక ఫీజు వసూళ్లు

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**

పదవ తరగతి పరీక్ష ఫీజు రూ.120లు అయితే కొన్ని ప్రైవేట్ స్కూల్స్ రూ.2000దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. మెటీరియల్, క్వశ్చన్ బ్యాంక్, టెస్టులు పేరుతో అదనంగా వసూలు అని తెలుస్తోంది. పరీక్ష ఫీజు గడువు తేదీ ఈ నెల 11 కావడంతో అధిక ఫీజులపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు భావించాలి. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కొరడా ఝులిపించాలని ఆశిద్దాం.

## రైతులు పంట భీమా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



**గిద్దలూరు రూరల్, నవంబర్ 5 ,ప్రభాతవార్త**

రైతులు సాగు చేసిన పంటలకు భీమా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని గిద్దలూరు మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కొమ్మునూరు, తాళ్ళపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని రైతులు 2024-25 రబీ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద స్వతహాగా వారే పంటభీమాకి రైతువాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప మొదలైన పంటలకు పంటభీమా వర్తిస్తుందని తెలిపారు. పంటభీమా చేయదలచిన వారు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, పంట ధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్, ఫోన్‌నెంబరు మొదలైనవి తీసుకొని దగ్గర్లోని మీసేవా, సిఎస్‌సి సెంటర్‌లలో పంటభీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతులు సాగు చేసిన కందిపంటను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం కందిపంట కల్లె నుండి పూత దశలో ఉందని తెలిపారు. ఈ దశలో మారుకమచ్చల పురుగు వచ్చే అవకాశం ఉందని కావున మొదట వేపనూనె 500మి.లీ ఎకరాకు క్లోరిపైరిపాస్ 400మీ.లతో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ప్రతి పంటను పరిశీలించి పంటలో వచ్చే చీడపీడలు మరియు వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కొమ్మునూరు సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు డి బాలాజీ నాయక్, విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు నబీయునస్, మస్తాన్ వలి, వెటర్నరీ సహాయకులు స్వర్ణ, మోహన్, రైతులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం



**రాచర్ల, నవంబర్ 5 ,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్ల నూతన అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారులకు దాత బత్తిని వినోద్ కుమార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో పూజకు సంబంధించి 15కేజీల నూనెను కూడా ఆయన విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని సంకల్పం తనకు కలగడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అయ్యప్ప మాలదారులు తమ దీక్షను దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని మలదారులకు భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని అన్నారు. మాలదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన బత్తిని కోటయ్య, సుబ్బమ్మ దంపతులకు వినోద్ కుమార్ రమాదేవీ దంపతులకు వారి కుటుంబ సభ్యులు అచల, హన్సిక, హర్షిత్ నాయుడు తదితరులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించండి



**రాచర్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలోబోధించాలని మండల విద్యాశాఖ అధికారులు వి గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని కాల్వపల్లి ఎంపిపి పాఠశాలను ఆయనమంగళవారం సందర్శించారు .పాఠశాలలోని విద్యార్థుల వివరాలు తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విద్య అర్థమయ్యేరీతిలో బోధించాలని మెనూ ప్రకారం భోజనం అందించాలని మౌలిక వసతులు సరిగ్గా కల్పించాలని రికార్డులు పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మార్కాపురం వెళ్ళి నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటి డిఈఓ బి శామ్యూల్ జాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల -1 విద్యాశాఖాధికారి ఏ శివకోటేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

## వీరభద్రపురం,బోయలపల్లెల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**యు ద్రగొండపాలెం,నవంబర్ 5,ప్రభాతవార్త**

యు ద్రగొండపాలెం మండలంలోని వీరభద్రపురం, బోయలపల్లె గ్రామలలో రైతు సేవకేంద్రం వద్ద మంగళవారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ రైతు సోదరులు ఎరువులు మరియు పురుగు మందులు వాడకుండా ప్రకృతిసాహజ సిద్ధమైన వ్యవసాయం చేయడం వల్ల ఖర్చులు తగ్గి మంచి దిగుబడి పొందవచ్చునని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కెవిశేషారెడ్డి,ఏఈఓలు ఎల్ మాల్యద్రిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయను కలిసిన
### యు ద్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**యు ద్రగొండపాలెం,నవంబర్ 5,ప్రభాతవార్త**

ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియను మంగళవారం యు ద్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయన యర్రగొండపాలెం నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌కు వివరించడం జరిగిందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు.

## సిమెంట్ రోడ్లు త్వరగా పూర్తి చేయండి



**మద్దిపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండుగలో మంజూరైన సిమెంట్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ ఇంజనీర్ రమేష్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలం లోని ఇంజనీరింగ్ కార్యదర్శులతో సమావేశమై మండలంలోని అన్ని సిమెంట్ రోడ్లను పూర్తి చేయాలని ఆయన నిర్దేశించారు. సిమెంట్ రోడ్ నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత నివ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**చిన్నగంజాం, నవంబర్ 5, ప్రభాతవార్త**

లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నగంజాం- ఉప్పుగుండూరు జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మండల ఎస్సై శీలం రమేష్ వివరాల ప్రకారం నాగులుప్పలపాడుకు చెందిన మరిశ్ర నరసింహారావు(49) తన బైక్ మీద కారంచేడు లోని తన బంధువులు ఇంటికి వెళ్తున్న క్రమంలో చిన్నగంజాం టోల్‌ప్లాజా వద్ద ఏపీ 39 యుడబ్ల్యు 0558 నెంబరు గల లారీ అధిక వేగంతో బైకిని ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందారని ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శీలం రమేష్ తెలిపారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు




**గిద్దలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ముకేష్ హోటల్ నందు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకట రమణ అను వ్యక్తిని అరెస్టు చేసినట్లు గిద్దలూరు సిఐ సురేష్ మంగళవారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తమకు సమాచారమందడంతో తమ సిబ్బందితో కలిసి దాడి జరిపి వెంకటరమణ అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 29మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సిఐ సురేష్ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సిఐ వెంట కానిస్టేబుళ్ళు వాహబ్, రసూల్ తదితర సిబ్బంది ఉన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



**రాచర్ల, నవంబర్ 5 ,ప్రభాతవార్త**

ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల సిఐటియు నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం వారు వైద్యాధికారి కమలాదేవీకి అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం సహృదయంతో పరిష్కరించాలని కోరారు. రిటైర్మెంట్ వయసు 60 నుండి 62కు పెంచే జీవో ఇంతవరకు విడుదల చేయలేదని బెనిఫిట్స్ కూడాఅందలేదని అన్నారు.ఆశావర్కర్లుఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## బిజేపి పట్టణ అధ్యక్షులు జన్మదిన వేడుకలో పాల్గొన్న బిజేపి నాయకులు



**గిద్దలూరు రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్ కుమారుడు వెంకట సాయి కార్తికేయ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించగా బిజేపి నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను కట్ చేయించి అపిశెట్టి వెంకట సాయి కార్తికేయను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా ఉపాధ్యాక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డా|| జేవి నారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలి, షఫీ, యువనాయకులు కె కృష్ణ, జిల్లా ఓబిసి ప్రధాన కార్యదర్శి బాదుల్లా, ఓబిసి కార్యవర్గ సభ్యులు వీరచక్రము, పట్టణ ప్రధాన కార్యదర్శి మునగనరి రామకృష్ణ, సీనియర్ నాయకులు రమేష్, మరియు మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



**రాచర్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుడిమెట్ట కొత్తపల్లి, ఆకవీడు గ్రామాల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా దాదాపు 33అక్రమ మద్యం బాటిళ్ళు లభ్యమయ్యాయి. గుడిమెట్ట కొత్తపల్లికు చెందిన కాశయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తుండడతో దాడులు చేసి 25మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నామని ఆకవీడు గ్రామంలో రత్నమ్మ అను మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో ఆమె నుండి 8 బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం తయారు చేసినా, మద్యం విక్రయించినా, పేకాట, మట్కా జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినా పోలీస్ వారికి తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

## అధికారులకు పూర్తి సమాచారం అందించండి
### – టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి



**మార్కాపురం, నవంబర్ 5, ప్రభాతవార్త**

పశుగణన సేకరణ కోసం అధికారులు వచ్చినప్పుడు పశుపోషకులు పూర్తి సమాచారాన్ని అందించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డి తెలిపారు. మండలంలోని దరిమడుగు గ్రామంలో మంగళవారం పశు గణన స్టిక్కర్లు గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గజ్జలకొండ పశువైద్యాధికారి వి.అశోక్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎన్యుమరేటర్ అనిత పాల్గొని ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు, పందులు, కుక్కల గురించి 21వ అచల భారత సేకరణ జరుగుతుందని వివరించారు. ఇంటింటికి పశువైద్యాధికారులు సందర్శించి వివరాలు అడుగుతారని క్లుప్తంగా అధికారులకు వివరాలను అందించి సేకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జునరెడ్డి, గంగరాజు, ఎర్రయ్య, శివ, ఆంజనేయులు, నాగార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తామని
## హామీ ఇచ్చిన దొడ్డ వెంకట సుబ్బారెడ్డి



**వెలిగండ్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు సందర్శించి వారి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పెళ్లి రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాలలో ఎమ్మెల్యే దంపతుల పెళ్లి రోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారిణి శ్రీరామ్ సుశీల పాఠశాలలో కంప్యూటర్ అవసరం ఉందని దొడ్డ వెంకట సుబ్బారెడ్డిని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించి కంప్యూటర్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారిణి ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది విద్యార్థులు దొడ్డ వెంకట సుబ్బారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, కొండు విజయ భాస్కర్‌రెడ్డి, చెంచిరెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, బొబ్బ తిరుపతిరెడ్డి, తొగట సుబ్రహ్మణ్యం, ముక్కు శివన్నారాయణరెడ్డి, పందు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్కపల్లెలో బెల్ట్ షాపుపై పోలీసుల దాడి



**బేస్తవారిపేట, నవంబర్ 5 ,ప్రభాతవార్త**

మండలంలోని అక్కపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపుపై ఎస్సై రవీంద్ర రెడ్డి మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అపరాల పంటలు సాగు చేయాలి



**తాళ్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**

ఆహార భద్రత, ప్రస్తుత మార్కెట్ విధానాన్ని బట్టి రైతులు అపరాలు పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని నాగంబొట్లపాలెం, సోమవరప్పాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు పంటకు బదులుగా పెసర, మినుము, కంది, శనగ వంటి అపరాల పంటలను సాగు చేయాలన్నారు. అన్ని పంటలలో విత్తన శుద్ధి, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందాలన్నారు. అలాగే భూ సార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేసి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సాగు ఇన్‌ఛార్జీ పి.నరసింహులు, వీఏఏ వెంకట సుమ, ఐసీఆర్‌పీలు కోటి, అనంతలక్ష్మి, వాణి, కోటి రత్నం, రమేష్, రైతులు పాల్గొన్నారు.

## నాగుల చవితి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు



**యు ద్రగొండపాలెం,నవంబర్ 5,ప్రభాతవార్త**

నాగుల చవితి సంర్భంగా భక్తులు పొద్దునే స్నానలు చేసి గుడికి వెళ్తారు.మరి కొంత మంది పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతలను దర్శించుకుని పుట్టలో పాలుపోస్తారు. సర్ప దేవతలకు పండ్లు,పువ్వులు,కుంకుమ సమర్పిస్తారు.ధూప, దీప నైవేధాయలు సమర్పిస్తారు.మహిళలు తమ కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని కోరుకుంటూపుట్ట చుట్టూ రక్షాసుత్రం కడతారు.య ద్రగొండపాలెం పట్టణంలోని శివాలయంలో భక్తులతో కిటికిటలాడిది.కొలుకుల రోడ్డులో ఉన్న నాగులపుట్ట వద్ద మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనారు.

## స్కిల్ సెన్సస్ సర్వేపై శిక్షణ



**హనుమంతునిపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

స్కిల్ సన్సెస్ సర్వేపై సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 15 నుంచి 59 సంవత్సరాల మధ్య గల వ్యక్తుల విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తులను సేకరించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని అందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు కావాల్సిన అర్హత కలిగిన మానవవనరులను అందించడమే ఈ సర్వే ఉద్దేశమని చెప్పారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉల్లాస్‌పై వాలంటీర్లకు శిక్షణ



**హనుమంతునిపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఏపీఎం పి.రజనికుమారి అధ్యక్షతన మంగళవారం ఉల్లాస్‌పై వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వయోజనులకు విద్యపై వాలంటీర్లు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందులో వారికి ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వాలంటీర్ వ్యవస్థ ఎలా పని చేయాలి అనే దానిపై వివరించారు. నవంబర్ 6 నుంచి వచ్చే ఏడాది మార్చి 15 వరకు వయోజనులకు వాలంటీర్లంతా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. దీనికి ఏ విధమైన పారితోషికం ఉండదని పూర్తి ఉచితంగానే వయోజనులకు విద్య నేర్పాలని సూచించారు. మండల పరిధిలోని 3 గ్రామ పంచాయతీల నుంచి 437 మంది వయోజనులను గుర్తించామన్నారు. వారితో ప్రతి 10 మందికి ఒక వాలంటీర్ చొప్పున 43 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మీరు మీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లలో వయోజనులకు విద్యాభ్యాసం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రమణయ్య, సీసీలు, వాలంటీరీ టీచర్లు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేతలను సన్మానించిన పోశం మధుసూదన్‌రెడ్డి



**తాళ్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒంగోలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్‌లతో సమీక్ష సమావేశానికి మొదటి సారిగా హాజరయ్యారు. సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, అధ్యక్షులు జి.శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సొసైటీ డైరక్టర్ గువ్వల వెంకట శ్రీనివాసులురెడ్డి, జిల్లా పార్లమెంట్ యూత్ ప్రధాన కార్యదర్శి జక్కల రామకృష్ణ, నాయకులు కటకంశెట్టి శ్రీనివాసరావు, పి.దేవదానం, మోరబోయిన తిరుపతయ్య, సంజీవ్, వై.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే తప్పులు సరిదిద్దేందుకే గ్రామ సభలు
### – ఎంపీపీ శ్రీనివాసరావు




**తాళ్లూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేలోని తప్పులను సరిదిద్దేందుకే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మాధవరం సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భూముల కొలతల్లో హెచ్చు తగ్గులు, సర్వే నెంబర్లలో మార్పులు, పేర్ల మార్పు, మొదలగు సమస్యలన్నీ పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభలో వివిధ సమస్యలపై మొత్తం 65 అర్జీలు వచ్చినట్లు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ రేణుక, ఇన్‌ఛార్జ్ మండల సర్వేయర్ బి.మల్లిఖార్జున, వీఆర్వో వెంకట రమణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పొగాకు పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**మద్దిపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

మండలంలోని రైతులు పంట సాగు విషయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలను పాటించి అధిక దిగుబడులను సాధించేందుకు ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారి రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం నాడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలో పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అయిన మినుము, శనగ పంటలు సాగు చేయు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కే.రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం రబీ సీజన్లో పొగాకు సాగు విస్తీర్ణం ఎక్కువ ఎకరాల్లో వేయుటకు రైతులు సిద్ధంగా ఉన్నారని, రైతులు ముఖ్యంగా పొగాకు కొనుగోలు సమయంలో ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ పంటలు అయిన శనగ, మినుము పంటలు సాగు చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డవరం గ్రామ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ స్పందన, గడియపూడి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శిరీష, పొగాకు సాగు చేసే రైతులు పాల్గొన్నారు.

## 35 మందికి ఉచిత వైద్య పరీక్షలు
### – జ్వరపీడితులకు డెంగ్యూ, మలేరియా పరీక్షలు



**కొనకనమిట్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**

మండలంలోని రేగుమానిపల్లె గ్రామ సచివాలయంలో మెడికల్ మొబైల్ యూనిట్‌లో భాగంగా మంగళవారం కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 35మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి ఎస్పీ బాలయ్య జ్వరపీడితులు నలుగురిని పరీక్షించారు. వారికి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించారు.వైద్యాధికారి బాలయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ సూచనలు చేశారు. 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కే.కీర్తన, ఏఎన్ఎం వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లెళ్ళపాడు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**వెలిగండ్ల, నవంబర్ 5, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని జిల్లెళ్ళపాడు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వివిధ పంటలలో చేయాల్సిన జాగ్రత్తలు వివరించారు. కందిలో వెర్రి తెగులు వైరస్ వల్ల సోకుతుందని, దీని నివారణకు మందులు లేనందున దీని వ్యాప్తి కారణమైన నల్లిని నివారించుటకు వేపనూనె 2 మి.లీ / లీటరు నీటికి కలిపి 15 రోజులకు ఒక సారి పిచికారి చేయాలని, 30 నుంచి 40 రోజుల వయసు వరకు 3 గ్రాముల చొప్పున నీటిలో కరిగే గంధకం పిచికారి చేయాలన్నారు. అలాగే వరిని ఆశించు ఉల్లికోడు నివారణకు నాటిన 10 నుంచి 15 రోజులకు ఎకరాకు కార్బొఫ్యూరాన్ 3 జి 10 కిలోల చొప్పున, ఫ్లూబెండిఎమైడ్ 48 సెకన్, 0.1 మి.లీ లేక బెల్ట్ ఎక్స్పర్ట్ 0.25 మి.లీ/ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



# పొగాకుకి బదులుగా చిరుధాన్యాలు సాగు చేయాలి

**దొనకొండ,నవంబర్ 5,ప్రభాతవార్త**



రైతు సోదరులకు పొగాకు పంటకి ప్రత్యామా న్నయంగా చిరు ధాన్యాలైన వరిగ,రాగి,కొర్ర పంటలని సాగు చెయాల్యలని దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సహాయకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మంగళవారం ఇండ్లచెరువు రైతు సేవా కేంద్ర పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకి పలు సూచనలు ,సలహాలు అందించారు. చిరుధాన్యాలైతే పెట్టుబడి ఖర్చు తక్కువని కూలీల ఖర్చు కూడా ఎక్కువగా ఉండదని ,పశువులకి మేత సమస్య కూడా తీరిపోతుందని అన్నారు.రబీ కాలంలో సాగు చేస్తున్న పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. వాతావరణ మార్పుల వల్ల దిగుబడి తగ్గినట్లయితే పంటల బీమా పథకం వర్తిసు_ందని తెలిపారు. సాగులో వేప సంబంధ ఉత్పత్తులైన వేపనూన్,వేప పిట్టుని వాడినట్లయితే పురుగులు రాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కందిలో ఎర్రి తెగులు రాకుండా ఇపు ్రడే మందులు పిచికారి చేయాలని కోరారు. పత్తిలో గులాబీ రంగు పురుగు రాకుండా లింగార్షక బుట్టలు పెట్టాలని మిరపలో తెలదోమ ,తామ పురుగులు రాకుండా పసుపు నీలం రంగు జిగురు అట్టలు ఎకరకి 20 చొప్పున పెట్టాలని సూచించారు.ఖరీఫ్ పంట కాలంలో నమోదు చేయించుకున్న రైతులకి రశీదులని ఎడిఎ అందజేశారు. అనంతరం సాగులో ఉన్న ఆముదం,ప్రత్తి ,కంది,మిరప,మరియు పొగాకు పంటలని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట వెంకటేశ్వర్లు ,గ్రామ వ్యవసాయ సహాయకులు విన్నీ బాబు ,రైతులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన

**దొనకొండ,నవంబర్ 5,ప్రభాతవార్త**



దొనకొండలో మంగళవారం రైల్వేస్టేషన్ ప్రాంగణము నందు మంగళవారం సాయంత్రం త్రిపురాంతకం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ అస్సాన్ మరియు ఎస్సై కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటో నడిపేటు వంటి డ్రైవర్లకు సూచనలు ఇస్తూ మీరు ఓవర్‌లోడ్ ఎక్కించుకోవద్ద దాని వలన ప్రమాదాలకు గురి చేసి వారి యొక్క ప్రాణాలకి ముప్ప ్ర తేవద్దని తెలియపరిచారు. నిన్న జరిగిన సంఘటనలో ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మరణించడం జరిగింది. త్రిపురాంకం దగ్గర రెండు బైకులు ఢీ కొని ప్రమాదంలో కలి బొగ్గు పాలయ్యారు. ఇలాంటి ప్రమాదాలు జరగక్కడు మీరు తగు సూచనలతో మేము ఇచ్చిన సూచనలతో మీరు వాహనాలు నడపాలని తెలియపరిచారు. అపరిచితులు ఎవరైనా మీ దృష్టికి వస్తే రాత్రిపూట వాహనం నడిపే వాళ్లు మా స్టేషన్ తెలియపరిచి మాకు మీరు వారి యొక్క సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు. అలాగే డ్రైవర్లంతా యూనిఫామ్ వేసుకొని బండి కాగితాలు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పక మీ వద్ద ఉంచుకోవాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె.విజయకుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో కుప్పకూలి వ్యక్తి మృతి

**అద్దంకి రూరల్, నవంబరు 5, ప్రభాతవార్త**



సమోసాలు తిని నీరుతాగిన వ్యక్తికి ఆకస్మికంగా గుండెనొప్పితో కుప్పకూలి వాంతి చేసుకుని అక్కడి కక్కడే క్షణాల్లో కన్నుమూసిన ఘటన సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం కూడలిలో మంగళవారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన గర్నెపూడి వీరయ్య కుమారుడు చిన్నలాజరు తన వ్యక్తిగత పనిపై పుట్టవారిపాలెం కూడలికి వచ్చి అక్కడ పూటుగా మద్యం సేవించి ఆతరువాత మద్యం షాపుకు సమీపంలో ఉన్న సమోసాల షాపు వద్దకు వచ్చి కొన్ని సమోసాలు తిని నీరు తాగుతుండగా అతనికి ఆకస్మికంగా గుండె నొప్పిరావడంతో కుప్పకూలి పడిపోయాడు. వెనువెంటనే అప్పటివరకు తిన్న సమోసాలు వాంతి చేసుకుని పడిపోగా అక్కడ ఉన్నవారు అతన్ని పైకిలేపేందుకు ప్రయత్నించే లోపే క్షణాల్లో కన్ను మూశాడు.విషయం తెలుసుకున్న సంతమాగులూరు ఎస్సై పట్టాభిరామయ్య మృతుని వద్ద లభించిన ఆధారాలతో అతనిది కొనకంచి వారిపాలెంక చెందిన చిన్న లాజరుగా గుర్తించి మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాపట్ల జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అద్దంకి రూరల్, నవంబరు 5 ,ప్రభాతవార్త**



బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంద శాఖా మంత్రి కొల్లు పార్ధసారది అధ్యక్షతన మంగళవారం జగిన జిల్లా సమగ్రాభివృద్ధికై బాపట్లలో సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని జిల్లా అభివృద్ధికి పలు సూచనలు చేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య,బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అద్దంకి రూరల్ ,నవంబరు 5, ప్రభాతవార్త**



రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించార.బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రాంలో టీడీపీనేత దూళ్ళిపాళ్ల వీరాంజనేయులు ఇటీవల మృతి చెందగా మంత్రి రవికుమార్ స్థానిక నాయకులతో కలసి మంగళవారం వారి ఇంటికి వెళ్లి వీరంజనేయులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంభ సభ్యులను పరామర్శించారు. సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఘంటా రంగారావు ఇటీవల మృతి చెందగా స్థానిక నాయకులతో కలసి వారి ఇంటికి వెళ్లి రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మిన్నెకల్లు గ్రామంలో ముప్పాళ్ల అరుణ విద్యుత్ షాకుతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంభ సభ్యులను పరామర్శించారు.

# 8 మంది పేకాటరాయుళ్ళు అరెస్టు

**కంభం రూరల్, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని పెద్దనల్లకాలువ గ్రామంలో పేకాటశిబిరంపై దాడిచేసి 8మంది పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై బి నరసింహారావు మంగళవారం తెలిపారు. పేకాటాడుతున్నట్లు తమకు సమాచారమందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని దాడిలో పేకాటాడుతున్న 8 మంది వ్యక్తులనుండి రూ.5,540లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బి నరసింహారావు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా పేకాటాడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారమందించాలని సమాచారమందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా సమీక్షా మండలిలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**గిద్దలూరు, నవంబర్ 5 ,ప్రభాతవార్త**



ఒంగోలులోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో ప్రకాశం జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలోలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి చర్చించారు. సమీక్షామండలిలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితోపాటు సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పి ఎఆర్ దామోధర్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, 20సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, జిల్లా ఛైర్మన్ బూచెపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచెపల్లి శివప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఉప్పుమాగులూరు, సోమవరప్పాడులలో పొలం పిలుస్తోంది

**బల్లికురవ, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తిని సీపీఐ వారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరకు అమ్ముకోవడానికి ఈ పంటలలో నమోద్దైన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కుమారి తెలియజేశారు. సీపీఐ వారు క్వింటాలకు రూ.7521 కొనుగోలు చేస్తారన్నారు. తేమ శాతం 8శాతం కంటే తక్కువ ఉండాలని చెప్పారు. పొగాకు సాగు తగ్గించి మొక్క జొన్న, అపరాలు సాగు చేయాలని చెప్పారు. పత్తి మొదటి తీతలో గులాబి పురుగు ప్రభావం లేదని రెండో సారి తీతకు వచ్చే అవకాశం ఎక్కువ కావున రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం ద్వారా రబీలో సాగు చేసే పంటలకు రైతులు ప్రీమియం కట్టి పంటల భీమా పరిధిలోనికి తీసుకురావాలన్నారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి జరిగే పశుగణనకు రైతులు సహకరించాలని పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు హనుమానాయక్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## వీరాంజనేయులు కుటుంబ సభ్యులకు మంత్రి రవికుమార్ పరామర్శ

**బల్లికురవ, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాంజనేయులు అనారోగ్యంతో ఆదివారం మరణించారు. సమాచారం అందుకున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం రాత్రి కొత్తపాలెంలోని ఆయన నివాస గృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడవద్దని పార్టీ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని కుమారుడు నాగార్జున భార్య లక్ష్మీకి భరోసా ఇచ్చారు. ఆయన వెంట క్లష్టర్ ఇన్‌ఛార్జ్ మల్లివీడి గోవిందరావు తెలుగు రైతు అధ్యక్షుడు దద్దాల అంజయ్య, పార్టీ నేతలు పావులూరి ఏడుకొండలు, భైరపునేని అజయ్‌కుమార్, చల్లగుండ్ల రాంబాబు, కందుల సాంబయ్య, యాగంటి సింగరయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కందుకూరి పేతురు, కత్తి బుల్లి అంజయ్య, కత్తి అశోక్, పందిరి సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

# కోలలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**మార్టూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



మార్టూరు మండలంలోని కోలలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి వీరగంధం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో వరి వివిధ దశలలో ఉందని తెలిపారు. వరిలో ప్రస్తుతం ఉల్లికోడు ఉదృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. వరి ఆలస్యంగా నాట్లు వేసినచోట ఉదృతి ఎక్కువగా గమణించడం జరిగిందని తెలిపారు. లేత దశలో ఉన్న వరికి ఉల్లికోడు గమణించినట్లయితే కార్బోఫ్యూరన్ 3 జీ గుళికలు ఎకరానికి 10 కేజీలు లేదా ఫ్రైప్రోనిల్ 0.6 గుళికలు 4 నుండి 5 కేజీలు ఎకరానికి వాడుకోవాలన్నారు. అదే దుబ్బు కట్టే దశలో గుర్తించినట్లయితే క్లోరోఫైరిపాస్ 20 ఈసీ 400 ఎంఎల్ ఎకరానికి లేదా ఫ్రైప్రోనిల్ 5 శాతం ఎస్‌సీ 400 ఎంఎల్ లేదా లాంబ్డా సీహలో త్రిన్ 5 శాతం ఎస్‌సీ 200 ఎంఎల్ ఎకరానికి వాడుకొని సమర్ధవంతంగా నివారించుకోవచ్చని తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారి మాధవి మాట్లాడుతూ ప్రస్తుతం సంకేను లేకిమ్పు కార్యక్రమం జరుగుతుందని రైతులందరూ సహకరించాలని కోరారు.

## క్రమశిక్షణ కలిగి ఉండాలి

### - ఎస్సై సుదర్శన్‌యాదవ్

**అర్థవీడు, నవంబర్ 5, ప్రభాతవార్త**



విద్యార్థులు చిన్న తనం నుంచే క్రమశిక్షణ కలిగి ఉండాలని అర్థవీడు ఎస్సై సుదర్శన్ యాదవ్ పేర్కొన్నారు. అర్థవీడు మండలంలోని స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు అర్థవీడు మండల ఎస్సై సుదర్శన్ యాదవ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ఎంత ముఖ్యమో, విద్యార్థుల మధ్య స్నేహభావం కూడా అంతే అవసరమన్నారు. ప్రతి విద్యార్థి స్నేహపూర్వక వాతావరణంలో విద్య కొనసాగాల్సి ఉంటుందన్నారు. సత్ప్రవర్తనతో ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. భవిష్యత్తులో ఉన్నతమైన చదువులపై అలానే ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. ఎటువంటి మోసాలు జరుగుతున్నాయి, వాటి భారి నుండి ఎలా బయటపడాలి అనే విషయాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ రైటర్ సుబ్బారావు, అర్థవీడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బండి బలరాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత

### - వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఎస్సై సుదర్శన్ యాదవ్

**అర్థవీడు, నవంబర్ 5, ప్రభాతవార్త**




అర్థవీడు మండలం కాకర్ల గ్రామంలోని డ్యాం సమీపంలో అక్రమ మద్యం కలిగిన గన్నెపల్లె గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేయటమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సై సుదర్శన్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# నల్లగుంట్ల, కొర్రపోలులో పొలం పిలుస్తోంది

**పెద్దదోర్నాల, నవంబర్ 5, ప్రభాతవార్త**



దోర్నాల మండలంలోని నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన మినుము, మిరప, జొన్న పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేయడం జరిగింది. అలాగే పీఎంఎఫ్‌బీవై పథకం కింద శనగ, మినుము, జొన్న, మొక్కజొన్న, వరి, మిరప పంటలకు పంటల భీమా పథకం రబీ 2024 కింద రైతులు ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. ప్రీమియం చెల్లించడానికి డిసెంబర్ 15కు ఆఖరి తేదీ అయినందున రైతులందరూ తప్పనిసరిగా ఈ పథకం ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చైతన్యకుమార్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మలతో భేటీ అయిన ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



విజయవాడ సెక్రటరియేట్‌లోని మినిస్టర్స్ చాంబర్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గంలోని పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్ళారు. నియోజకవర్గంలో సాగునీరు లేక రైతాంగం వర్షాలపైనే ఆధారపడుతూ ఇబ్బందులు పడుతున్నారని వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయిన వెంటనే నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు వెలుగొండ జలాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కంభం చెరువును అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, చెరువుల పూడికతీతలకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. గిద్దలూరు పట్టణంలోని ప్రధాన సమస్య అయిన సగిలేరు వాగు పూడికతీత, మరమ్మతులు, నియోజకవర్గంలో శాశ్వత త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని ఆయన విన్నవించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వెంట వైపాలెం ఇన్చార్జి గూడూరి ఎరిక్సన్ బాబు ఉన్నారు.

# ఘనంగా నాగుల చవితి పూజలు

**సింగరాయకొండ,నవంబర్ 5,ప్రభాతవార్త**



మండలంలోని పలు ప్రాముఖ్యత కలిగిన శివాలయాలలో మంగళవారం నాగుల చవితి పర్వదినం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రధానంగా పాకల అమరలింగేశ్వరస్వామి ఆలయం ,పాత సింగరాయకొండ గ్రామం అయ్యప్పస్వామి దేవాలయం, నరసింహనగర్‌లోని కాశీ విశ్వనాథస్వామి ఆలయాలలో కాశీ విశ్వనాధునికి అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఆలయ ప్రాంగణంలోని పుట్టకు పూజలు నిర్వహించేందుకు మహిళలు అధిక సంఖ్యలో పొటెత్తారు. ఈ సందర్భంగా పుట్టకు పూజలు చేసి పాలు పోశారు. అనంతరం కాశీ విశ్వనాధుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

# ఘనంగా నాగులచవితి పర్వదిన వేడుకలు

**బల్లికురవ, నవంబర్ 5, ప్రభాతవార్త**



నాగుల చవితి పర్వదినం వేడుకలు మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్తీకశుద్ధ చతుర్థినాడు- దీపావళి వెళ్ళిన నాలుగో రోజు వస్తుంది. పుట్టిన బిడ్డలు బ్రతకక పోతేను, పిల్లలు కలగకపోతేను, నాగ ప్రతిష్ఠ చేసి పూజించటం సాంప్రదాయం. అలా నాగమహిమతో పుట్టిన సంతానానికి, నాగలక్ష్మీ, నాగేశ్వరరావు, నాగయ్య తదితర పేర్లు పెట్టుకుంటారు. మన పురాణాలలో నాగుల చవితి గురించి ఎన్నో గాధలు ఉన్నాయి. దేశమంతట పలు దేవాలయాల్లో మెలికలతో ఉన్న నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభావంతో ఆరాదిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని నమ్మకం. అదే విధంగా ఈ మానవ శరీరమనే పుట్టక తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. వాటినే నవరంధ్రాలు అంటూ ఉంటారు. మానవ శరీరంలో నాడులతో నిండిఉన్న వెన్నెముకను వెనుబాము అని అంటారు. అందులో కుండలిని శక్తి మూలధార చక్రంలో పాము ఆకారంలో ఉంటుందని యోగశాస్త్రం చెబుతోంది. ఇది మానవ శరీరంలో నిదురిస్తున్నట్లు నటిస్తూ కామ, క్రోద, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే విషాల్ని కక్కుతూ, మానవునిలో సత్వగుణ సంపత్తిని హరించి వేస్తూ ఉంటుందని అందుకు నాగుల చవితి రోజున ప్రత్యక్షంగా విషసర్పపుట్టలను ఆరాదించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతత్వం పొంది, అందరి హృదయాలలో నివసించే శ్రీ మహావిష్ణువు'కు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసేదే ఈ నాగుపాము పుట్టలో పాలు పోయుటలో గల అంతర్యమని చెప్తారు. బ్రాహ్మీ ముహూర్త సమయంలోనే తలస్నానం చేసి పుట్టదగ్గరికి వెళ్లి నాగరాజును పూజించి పాలు పోసి చలిమిడి, చిమ్మిలి, అరటిపళ్ళు, తాటి బుర్ర గుంజు, తేగలు ఫలహారాలుగా నివేదన చేస్తారు. ఆ పుట్ట మట్టిని పుట్టబంగారం అని, దానిని కొద్దిగా తీసుకొని చెవి దగ్గర పెట్టుకుంటారు. ముఖ్యంగా చెవి బాధలు ఉన్న వారికి ఈ పుట్టబంగారం పెడితే చెవి బాధ తగ్గుతుందంటారు. ఆ సందర్భంగా పుట్ట వద్ద దీపావళి నాడు మిగిలిన మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాసులు మొదలైనవి చిన్న పిల్లలు ఎంతో సంతోషంగా కూడా కాలుస్తారు. నాగులచవితి పాటలు కూడా మన తెలుగువారిలో ఎంతో ప్రసిద్ధం. నన్నేలు నాగన్న, నాకులమునేలు, నాకన్న వారలు నా ఇంటి వారలు ఆప్తమిత్రులనందరిని ఏలు పడగ తొక్కిన పగవాడను కోకు, నడుము తొక్కిన నావాడనుకొనుము, తోక తొక్కిన తొలుగుచూ పొమ్ము, ఇదిగో, నూకనిచ్చెదను మూకనిమ్ము. పిల్లల మూకను నాకిమ్ము, అని పుట్టలో పాలు చేస్తూ, నూక వేసి వేడుకుంటారు. అలాగే పుట్టలోని నాగేంద్రస్వామి లేచి రావయ్యా, గుమ్మపాలు త్రాగి వెళ్ళిపోవయ్యా, చిలిమిడి వడపప్పు తెచ్చినావయ్యా, వెయ్యి దండాలయ్య, నీకు కోటి దండాలయ్యా, పుట్టలోని నాగేంద్రస్వామి, అంటూ భక్తులు స్తుతిస్తూ నాగేంద్ర స్వామికి నీరాజనాలు అర్పిస్తారు.

# ఘనంగా నాగులచవితి వేడుకలు

**చిన్నగంజాం, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలో నాగులచవితి సందర్భంగా భక్తులు, మహిళలు పలు దేవాలయాల నందు గల పుట్టల నందు పాలు పోసి విశేష పూజలు నిర్వహించారు. నాగుల చవితిని పురష్కరించుకుని కొత్తపాలెం శ్రీ బాలకోటేశ్వరలయం, చిన్నగంజాం నందు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి,శ్రీ లక్ష్మి తిరుపతమ్మ ఆలయం వద్ద నున్న పుట్టల వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పుట్టలో పాలుపోసి ఘనంగా పూజలు చేశారు.సంప్రదాయం ప్రకారం చవితి ఉత్సవాలు చేసుకునేందుకు జనం ఆసక్తి కనపరిచారు. తెల్లవారుజాము నుంచే ప్రజలు పుట్టల దగ్గర బారులు తీరారు.

## వైభవంగా శ్రీ నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల షష్ఠమ వార్షికోత్సవ వేడుకలు





**సంతనూతలపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో మంగళవారం నాడు శ్రీ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నాగుల చవితిలో భాగంగా వైభవంగా షష్టమ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. మండల కేంద్రమైన సంతనూతలపాడులో ఈ నాగుల చవితి వేడుకలు ఒక పండగ వాతావరణంలో జరిగాయి. ఆలయ అర్చకులు ఆదిమూలం శ్రీ సాయి శర్మ బృందం ఆధ్వర్యంలో స్వామి వార్లకు సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యాహ వచనం, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, నాగదేవత, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రముఖ వాస్తు సిద్ధాంతి అయినాల నాగేశ్వర చారి ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు సన్నమూరి సుబ్బనాచారి, ఎం.రాజేష్‌గుప్తా, టి.శరత్‌బాబు, బి.శ్రీనివాసరావు, విజే ప్రభాకర్‌రావు, కొండమ్మ తదితరులు ప్రముఖ వాస్తు సిద్ధాంతి ఏ.నాగేశ్వరాచారి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ దంపతులను తదితరులను సత్కరించి మెమోంటోలు అందజేశారు. మహిళలు భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని నాగుల చవితిలో భాగంగా పుట్టలో పాలు పోసి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ దంపతులు పుట్టలో పాలు పోసి శివునికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా 54 మంది దంపతులు హోమ పూజలో కూర్చున్నారు. ఈ వేడుకల్లో భాగంగా భారీ ఎత్తున వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సంతనూతలపాడు మండల టీడీపీ అద్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలను దేవాలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సన్నమూరి సుబ్బనాచారి, ఎం.రాజేష్ గుప్తా, బి.శ్రీనివాసరావు, టి.శరత్‌బాబు, వి.జ్వాలా ప్రభాకరరావు, కొండమ్మ తదితరులు పర్యవేక్షించారు.



## ఘనంగా కార్తీక మాస నాగుల చవితి వేడుకలు

**సంతనూతలపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో మంగళవారం నాడు ఘనంగా కార్తీక మాస నాగుల చవితి వేడుకలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో శివాలయంలో గల పుట్టలో పాలు పోసి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ తదితరుల బృందం ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, ఆలయ అర్చకులు ఎస్.బుజ్జి బాబు శర్మలు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న బిఎస్ నారాయణ రెడ్డి

**గిద్దలూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



గత 30సంవత్సరాల నుండి స్వచ్ఛంధంగా సేవ చేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణ రెడ్డి అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని గాంధీనగర్ అనంతరాయ గ్రంధాలయం నందు తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు డా॥ యువి రత్నం ఆదివారం రాత్రి దక్షిణ భారత దేశంలో స్వచంధంగా సేవ చేసే కళాకారులు మరియు సామాజిక కార్యకర్తలను అందరినీ అవార్డులతో సత్కరించారు. ఇందులో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణ రెడ్డిని అబ్దుల్ కలాం పేరుమీద లైఫ్‌టైం అచీవ్‌మెంట్‌తో సోమవారం ప్రశంసా పత్రం, మెమెంటోతో శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు మాట్లాడుతూ అనాధ శవాలకు అంత్య క్రియలు పేద పిల్లల విద్యకు ప్రజల యొక్క ఆర్థిక సహాయంతో తోడ్పాటునందించడం, ప్రకృతి బాగుకోసం చెట్లు నాటడం, తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న బిఎస్ నారాయణ రెడ్డి పలువురికి ఆదర్శప్రాయులుగా నిలిచారని అన్నారు. ప్రతిఒక్కరు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అనంతరం బిఎస్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ తమకు అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంటన అవార్డు ప్రదానం చేయడం ఆనందదాయకంగా ఉందని ముమ్ముందు రెట్టింపు ఉత్సాహంతో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తాననిఅన్నారు.ఈ సందర్భంగా సంస్థవ్యవస్థాపకులు డా॥ యువి రత్నంకుకృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుండి ఉపాధి పనుల కోసం గ్రామ సభలు

**చిన్నగంజాం,నవంబర్ 5, ప్రభాతవార్త**

మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నేటి నుండి 8 నవంబర్ వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, మండల ఏపీవో లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వివరాలు తెలియజేస్తూ.. ఆయా గ్రామాల పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు అధ్యక్షతన నిర్వహించే ఈ గ్రామ సభలో 2025-26 సంవత్సరానికి గాను ఉపాధి పనుల ప్రణాళిక తయారీపై చర్చించి చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులను గుర్తిస్తారని తెలిపారు. అవసరమైన పనులను గుర్తించి, గ్రామ పంచాయతీ ద్వారా పంపితే, అట్టి పనుల నిర్వహణ కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించేలా గ్రామస్తులను చైతన్యం చేయాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు.

## కారుమూరి, చెవిరెడ్డి, బూచేపల్లిని సన్మానించిన దద్దాల

**కనిగిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో భాగంగా మంగళవారం ఒంగోలు వైసీపీ కార్యాలయానికి వచ్చిన ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ రహిత కనిగిరిగా తీర్చిదిద్దాలి : ఛైర్మన్ గఫార్

**కనిగిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**



డెంగ్యూ రహిత సమాజంగా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యమని కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనిగిరి పట్టణంలోని శివనగర్ కాలనీ, సాయి నగర్ ప్రాంతంలో మున్సిపల్ ఛైర్మన్, ఆరోగ్య సిబ్బందితో కలిసి క్షేత్రస్తాయిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యమిస్తూ పని చేయాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ లాంటి వ్యాధులు నుండి విముక్తి పొంది ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఛైర్మన్ తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సక్రమంగా పని చేయడం వలనే పట్టణంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ఉన్నాయని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు దూళిపాళ్ళ మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్దలతో నాగులచవితి

**కనిగిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**



కనిగిరి శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం నందు నాగులచవితి సందర్భంగా భక్తులు తెల్లవారుజామున నాగేంద్ర స్వామివారికి కార్తీక దీపం వెలిగించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి నాగభూషణ పంచామృత రుద్రాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఆనంతరం ఆలయ పూజారి మణికంఠ స్వామి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, ఈర్ల గురవయ్య, ఏసీ చెంచులు, మండల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ

**కనిగిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**



కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి- డాక్టర్ కవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం తెలుగుదేశం పార్టీ మహిళా శక్తి విభాగం మహిళలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



ప్రభుత్వ ఆసుపత్రిలోనే అన్ని వార్డులో ఉంటున్న రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దంపతులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మహిళా శక్తి నాయకులు దొరసాని పార్వతి, తులసి, ధనలక్ష్మీ, వాజిదా, అమ్ములు, మున్ని, లక్ష్మీ, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి కొత్తూరులో భారీగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు

**కనిగిరి, నవంబర్ 5, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని కొత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులు భారీగా జరిగాయి. కొత్తూరులోని ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వ నమోదులను చేయించుకుంటున్నారు. 300కు పైగా సభ్యత్వ నమోదు జరిగాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలందరూ హర్షిస్తున్నారని స్థానిక ప్రజలు, నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అచల రవి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, పిల్లి కిరణ్, కందుల వెంకటరెడ్డి, రాము, నాగేశ్వరరెడ్డి, నరాల నర్సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో రాయితీపై శనగ విత్తనాలు

**టంగుటూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



టంగుటూరు మండలంలోని అనంతవరం, వెలగపూడి గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత అధ్యక్షత వహించి మాట్లాడారు. 25శాతం రాయితీ మీద శనగ విత్తనాలు ఇస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేయించుకుని రాయితీ పోను మిగిలిన డబ్బులు చెల్లించి విత్తనాలను పొందాలన్నారు. కేఏకే-2 పూర్తి ధర క్వింటాకు రూ.12100 రాయితీ రూ.3025 పోను రూ.9075 రైతు చెల్లించాలన్నారు. రైతుల వేసిన పంటలను పరిశీలించారు. తగు సూచనలు, సలహాలు అందజేశారు. పంటల్లో వచ్చే తెగుళ్ళ పట్ల తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పశుసంవర్ధకశాఖ అధికారి నాయోమి ఆయా శాఖలోని పథకాల గురించి వివరించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవికుమార్ మాట్లాడుతూ ఆక్వా సాగు రైతుల కొరకు పాలేరు పూడిక తీయుట కొరకు ప్రపోజల్ ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పూడిక తీత పనులు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతవరం సర్పంచ్ శ్రీనివాసరాజు, ఉప సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు కోటేశ్వరరావు, వెలగపూడి గ్రామ మాజీ సర్పంచ్ కోటపాటి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు లింగారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఎన్ శ్రీనివాసరావు, మత్స్యశాఖ సహాయకులు సోమేశ్వరరావు, గోవర్ధన్, నాగేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## స్కిల్ సెన్సస్‌పై శిక్షణ

**నాగులుప్పలపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండలంలోని సచివాలయం సిబ్బందికి స్కిల్ సెన్సస్‌పై శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణలో నాగులుప్పలపాడు మండల కార్యాలయం పరిపాలన అధికారి దక్షిణామూర్తి, సచివాలయం సిబ్బంది, మండల స్కిల్ సెన్సస్ కోఆర్డినేటర్ హిమాంబి, ట్రైనర్స్, రాజశేఖర్ పాల్గొన్నారు.



## పొతకమూరు, తూర్పువీరాయపాలెంలో పొలం పిలుస్తోంది

**దర్శి, నవంబర్ 5, ప్రభాతవార్త**



దర్శి మండలం పొతకమూరు, తూర్పువీరాయపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నందు సబ్సిడీలో అందిస్తున్న శనగ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పంటు సాగు చేసిన రైతులందరూ ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతుల పంట పొలాలను పరిశీలించి తగు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రబీ పంట కాలంలో ప్రత్యామ్నాయ శనగ, ఇతర పంటలను సాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మనోహర్, రైతులు పాల్గొన్నారు.

## 42మద్యం బాటిళ్లు స్వాధీనం - ఎస్సై వై.నాగరాజు

**ముండ్లమూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని బొప్పూడివారి పాలెం గ్రామంలో మంగళవారం అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న నిర్వాహకుడిపై దాడి చేసి 42 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై వై.నాగరాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పూడివారిపాలెంలో వల్లపునేని కృష్ణమూర్తి అనే అతను బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్ముతుండగా మంగళవారం అతని వద్ద నుండి మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది ఉన్నారు.

## ఓటు నమోదుకు స్పెషల్ క్యాంపెయినింగ్

**దర్శి, నవంబర్ 5, ప్రభాతవార్త**

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈనెల 9, 10,23,24, తేదీల్లో నూతన ఓటుకు నమోదు చేసుకోవాలని దర్శి తహశీల్దార్ మంగళవారంఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, వారికి దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరు ఓరుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఏవైనా డబల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లకు సంబంధించి ఫారం-7 దాఖలు పరచాలని తెలిపారు. స్పెషల్ క్యాంపెయినింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

## భక్తి శ్రద్దలతో నాగులచవితి

**కురిచేడు, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాడు నాగులచవితి పండుగ అత్యంత భక్తిశ్రద్దలతో జరిగింది. మండల కేంద్రమైన కురిచేడు శ్రీజ్ఞానప్రశూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర ఆలయంలో గల నాగ శిలల వద్ద మహిళ భక్తులు ఉదయం నుంచి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు వేసి నానబాలు, చలివిడి పుట్టలపై ఉంచి భక్తిని చాటుకున్నారు. మండలంలోని దేకనకొండ గ్రామ పరిధిలో గల సింగరకొండ వద్ద గల సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నమశివాయపురం, ఆవులమంద, కల్లూరు, బోధనంపాడు ,వీరాయపాలెం, పెద్దవరం తదితర గ్రామాల్లో సైతం ఆ గ్రామాల్లో గల పుట్టల వద్దకు వెళ్లి మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సంతానం లేని మహిళలు ఎక్కువగా పూజల్లో పాల్గొని సంతానప్రాప్తి కలగాలని మొక్కులు మొక్కుకున్నారు.

## ప్రకృతి వ్యవసాయ పొలాలు పరిశీలన

**మద్దిపాడు, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలం రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డివి రాయుడు మండలంలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయం పొలాలను పరిశీలన చేయడం జరిగింది. దొడ్డవరం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయం రైతు అయిన రామాంజనేయులు వేసిన వక్కతోటలో అంతర పంటలైన అరటి, మునగ, సపోటా, జామ, మామిడి, సీతాఫలం, కాఫీ, కొబ్బరి, కూరగాయ మొక్కలైన పొట్లకాయ, బీర, కాకర, సొర దోస, టమోటా, మిరప, ఏగ్రేడ్ మోడల్‌ను సందర్శించి వారి అనుభవాలను తెలుసుకోవడం జరిగింది. అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా అమలు చేస్తున్న పద్ధతులను, ఆదాయ వ్యవయాలను అడిగి తెలుసుకున్నారు. ఇలా మోడల్స్ వేయడం వలన తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, అంతే కాకుండా మన ఆరోగ్యంతో పాటు నేల ఆరోగ్యం కాపాడిన వాళ్ళం అవుతామని ఒక పంట గిట్టుబాటు ధర లేకపోయినా మరో పంట ద్వారా గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉందన్నారు. వాటితో పాటు అధిక లాభం పొందాలంటే రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీపీ శ్రీకాంత్, మెంటర్, రామాంజనేయులు, ఆర్గానిక్ నేచురల్ ఫార్మింగ్ సునీల్, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పరిధిలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలి

**కొండపి, నవంబర్ 5, ప్రభాతవార్త**




ప్రతి ఆశా వారికి కేటాయించిన గ్రామ పరిధిలో ఇంటింటికి వెళ్లి జ్వరం కేసులు సర్వే చేయాలని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ పి.అనూషా తెలిపారు. మంగళవారం నాడు కొండపి మండలంలోని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు, హెల్త్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ ప్రతి ఆశా ఇంటింటికి వెళ్లి సర్వే చేసి వారికి సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. జ్వరం ఉన్న కేసులు గుర్తించి వారికి ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వారు రక్తపూతలు సేకరించి పరీక్షలు పీహెచ్‌సీలో గాని, సీహెచ్‌సీలో గాని చూపించాలని జ్వరం ఉన్న వారు వెంటనే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్స్ దగ్గర చూపించుకోవాలని తెలియజేయాలన్నారు. జిల్లా సబ్ యూనిట్ అధికారి భాస్కర్‌బాబు మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చు వ్యాధులు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పెట్లూరు హెల్త్ సూపర్‌వైజర్ కే.లక్ష్మీ నరసింహం, అన్నపూర్ణమ్మ, పి.అనిల్‌కుమార్, హెల్త్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఆశాలు పాల్గొన్నారు.

## గోను రసూల్‌రెడ్డి అకాల మరణం బాధాకరం

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**సీఎస్‌పురం, నవంబర్ 5, ప్రభాతవార్త**



కొవిలంపాడు గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోను రసూల్‌రెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు మంగళవారం కొవిలంపాడులో రసూల్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు విద్యా సంస్థల ఛైర్మన్ కేవి ప్రకాష్‌రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారది, సర్పంచ్ షేక్ బుజ్జి, నారాయణస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత రహదారులకు శంకుస్థాపన చేసిన టీడీపీ శ్రేణులు

**పామూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



పామూరు పంచాయతీ పరిధిలోని ఇరువురు రోడ్డు నుండి మసీదు వరకు, మల్లాలమ్మ గుడి ప్రాంతాల్లో అంతర్గత రహదారులకు మంగళవారం నాడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యువనేతలు యారవ శ్రీనివాసులు, పందిటి హరీష్ మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, గౌసా తదితరులు రోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామ సీమలుఅభివృద్ధి చెందుతాయన్నారు. పట్టణానికి పట్టుకొమ్మలైన పల్లెసీమల అభివృద్ధి రహదారులతోనే జరుగుతుందన్నారు. సరైన దారులు లేక పామూరులోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న కష్టాలను నివారించేందుకు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరువ చూపించడం, అందుకు అవసరమైన నిధులు కేటాయించడం అనందించదగ్గ విషయమన్నారు. పంచాయతీ నిదులతో అంతర్గత రహదారులను పూర్తి చేయడమే కాక పామూరు మండలంలో మట్టి రహిత రహదారులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నామన్నారు. పట్టణ అధ్యక్షులు ఖాజా రహంతుల్లా, మస్తాన్, సోమిశెట్టి శ్రీనివాసులు, అస్లాం, రసూల్, దేవరపు మల్యాద్రి, కావేరి రసూల్, మొబినా మౌలాలి, పాలపర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు అందజేసిన నుసుం ఖాజా రఫీ

**పామూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు నుసుం ఖాజా రఫీ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన ఫ్యాడ్లు, వాటర్ బాటిళ్లను మంగళవారం నాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యువనేతలు యారవ శ్రీనివాసులు, లక్ష్మీనరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, షేక్ షంషూర్, నబీ సాహెబ్ గారి గౌసా తదితరులు ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. పామూరులోని హైస్కూల్ నందు వెయ్యి మందికి పైగా నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను టీడీపీ నేతలు అందించడం శుభపరిణామమని అన్నారు. విద్యాభివృద్ధికి ఆ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నాడునేడుతో వైసీపీ నాయకులు దోచుకుతిన్నారు తప్ప విద్యాభివృద్ధికి కృషి చేయలేదున్నారు. మస్తాన్, నాయబ్ రసూల్, గుత్తి మహేష్, సయ్యద్ ఖాదర్ భాషా, పట్టణ అధ్యక్షులు ఖాజా రహంతుల్లా, సలాం ఖాజా మొహిద్దీన్, మొబినా మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## కందిని ఆశించే చీడపిడల నుంచి పంటను సంరక్షించుకోవాలి

**పామూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో సాగవుతున్న కంది పైరు పచ్చగా ఏర్పడినందువల్ల దానిని శనగ పచ్చ పురుగు, మరక పురుగు గుడ్లను ఏర్పాటు చేసి పంటను నాశనం చేస్తున్నందున వ్యవసాయాధికారుల సూచనలతో తగు మోతాదులో మందును పిచికారి చేసుకుని పంటను సంరక్షించుకోవాలని వ్యవసాయాధికారి కే.రాధ తెలియజేశారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో కంభాలదిన్నె, రేనుమడుగు తదితర గ్రామాల్లో సాగవుతున్న కంది పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు కోళ్ళ తిరుపతయ్య, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## మధుమేహ నియంత్రణ యోగా శిక్షణ

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**



పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఈనెల 7నుండి 11వ తేదీ వరకు మధుమేహ నియంత్రణ యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 రోజుల పాటు ప్రతి ఉదయం 5.00 గంటల నుండి 7.30 గంటల దాకా రంగారాయుడు చెరువు దగ్గరలోని ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ హాలులో, సాయంత్రం 6.00 గంటల నుండి 7.30 దాకా కొత్తపట్నం రోడ్డులో మహాలక్ష్మి ఆలయం ఎదురుగా రిటైల్ మర్చంట్స్ హాలులో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు సోమా సుబ్బారావు 7780680121, దేసు వెంకయ్య 9885125053 సెల్ నంబర్‌లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ప్రజాసమస్యలపై సిపిఐ ధర్నా - గుజ్జుల ఈశ్వరయ్య వెల్లడి

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**




విద్యుత్ భారాలు ప్రజలపై మోపకుండా ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్‌లను వ్యతిరేకించి అధికారంలోకి రాగానే వ్యవసాయ విద్యుత్ మోటార్‌లకు, గృహ వినియోగానికి, వాణిజ్య విద్యుత్ అవసరాలకు స్మార్ట్ మీటర్‌ల బిగింపు వేగవంతం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున నివేశన స్థలాలు పేదలకు ఇవ్వాలని, అసంపూర్ణంగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తికి వచ్చే బడ్జెట్‌లో రూ.4.57 వేల కోట్లు కేటాయించి, ఏడాదిలోగా పూర్తి చేసి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలకు సాగునీరు, త్రాగునీరు అందించాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ డిడిఆర్‌సి మీటింగ్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అసంతృప్తి వ్యక్తం చేయడం జిల్లా వెనుకబాటుతనాన్ని ఎత్తి చూపుతోందని, నిమ్జ్, దొనకొండలో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలాలు సద్వినియోగం కాకుంటే భూములను రైతులకు వెనక్కి ఇచ్చేయాలన్నారు. రిమ్స్‌లో వైద్య వసతులు పెంచాలని, మారా్కపురం రిమ్స్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, అందె నాసరయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పెంచిన ఛార్జీల రద్దుకై కాంగ్రెస్ ధర్నా

**ఒంగోలు టౌన్, నవంబర్ 5, ప్రభాతవార్త**



కరెంట్ బిల్లులపై పెంచిన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత సిలిండర్ పథకం క్రింద ఏడాదికి ఇచ్చేది రూ.2685 కోట్లు అయితే ప్రజల నుంచి కరెంట్ బిల్లు రూపంలో రూ.6వేల కోట్లకు పైగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పెంచిన సర్దుబాటు ఛార్జీల రద్దుకై చేపట్టిన ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

## తూర్పునాయుడుపాలెం హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈఓ

**టంగుటూరు, నవంబర్ 5, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పునాయుడు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్, డిప్యూటీ డీఈఓ సామ సుబ్బారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని మెచ్చుకున్నారు. గత సంవత్సరం 10 వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గురించి అడిగి తెలుసుకున్నారు. 100 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలుసుకుని ఉపాధ్యాయులను అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు మంచి మెలుకువలు నేర్పి భాగా చదివించి ఎక్కువ మార్కులు సాధించుటకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ద కనపరచాలన్నారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. డీఈఓ వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

6-11Pg5.qxd:6-11Pg5.qxd 01/01/01 7:34 AM Page 1



# అతివాద శక్తులకు కెనడాలో ఆశ్రయం!

## ఆ దేశ తీరుపై విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ ధ్వజం



**కాన్‌బెర్రా, నవంబరు 5:** అతివాద శక్తులకు కెనడా రాజకీయాల్లో చోటు కల్పిస్తున్నారనని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మండిపడ్డారు. ఇటీవల అక్కడి హిందూ ఆలయంపై జరిగిన దాడిని ఉద్దేశిస్తూ ఈవ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడ జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెనడాపై విరుచుకుపడ్డారు.

'ఆ దేశం గురించి మూడు విషయాలు చెప్పాలనుకుంటున్నా. మొదటి.. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇతరులపై ఆరోపణలు చేసే పద్ధతిని పాటిస్తూ వస్తోంది. రెండోది.. మా విషయంలో భారత దౌత్యవేత్తలపై కెనడా నిఘా పెట్టింది. ఈ తరహా చర్య ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇక మూడోది.. ప్రస్తుతం మనమంతా చూస్తున్నది..! అందుకు ఈ విడియోనే (ఆలయంపై దాడి ఘటనకు సంబంధించిన దృశ్యాలు) సాక్ష్యం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. అతివాద శక్తులకు రాజకీయాల్లో చోటు కల్పిస్తున్నారనే విషయం అవగతం అవుతోంది' అని జైశంకర్ పేర్కొన్నారు.

విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ నెల 3న ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. ఏడో తేదీన పర్యటన పూర్తికానుంది. ఈ క్రమంలోనే ఆయన కెనడాలో జరిగిన చర్యను ఖండించారు. కాగా.. కెనడాలో హిందూ ఆలయం లక్ష్యంగా చేసుకుని ఖలిస్థానీ జెండాలతో సిక్కు వేర్పాటువాదులు వీరంగం సృష్టించారు. కర్రలతో హిందూ సభా మందిరం ప్రాంగణంలోని వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఉద్దేశపూర్వకంగా చేసిన విధ్వసంక ఘటన అంటూ కెనడాపై భారత్ మండిపడింది.

**అమెరికా ఎన్నికల్లో ఎవరు గెలిచినా..**

మరోవైపు.. అమెరికా అధ్యక్షఎన్నికలపై జైశంకర్ స్పందించారు. ఎవరు విజయం సాధించినా అగ్రరాజ్యంతో భారత్ సత్సంబంధాలు పెరుగుతూనే ఉంటాయన్నారు. 'అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌సహా గత ఐదు ప్రభుత్వాల హయాంటల ఆ దేశంతో భారత్ సత్సంబంధాలు కొనసాగించింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇరుదేశాల మధ్య స్నేహబంధం పురోగతి సాధిస్తుందని ఆశిస్తున్నా' అని అన్నారు.



### కేంద్ర మంత్రి కుమారస్వామిపై ఎఫ్ఐఆర్ నమోదు!

**బెంగళూరు, నవంబరు 5:** కేంద్ర మంత్రి, జెడిఎస్ నేత హెచ్‌డి కుమారస్వామిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎడిజిపి ఎం చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. కుమారస్వామి నిందితుడుగా ఉన్న మైనింగ్ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి తాను నేతృత్వం వహిస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. మైనింగ్ కేసులో విధులు నిర్వర్తించకుండా అడ్డుకునేందుకు తనను కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్ బెదిరించారని ఎడిజిపి చంద్రశేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎడిజిపి ఫిర్యాదు మేరకు సంజయ్ నగర్ పోలీసులు కుమారస్వామిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, 2006 నుంచి 2008 వరకు కుమారస్వామి కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయన చట్టాన్ని ఉల్లంఘించి బళ్లారి జిల్లాలోని శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్‌కి 550 ఎకరాల మైనింగ్‌లీజుకు అక్రమంగా ఆమోదించారనే ఆరోపణలుఉన్నాయి. దీనిపైవిచారణ జరుగుతోంది.

### రూ.2వేల నోట్లపై ఆర్బీఐ తాజా ప్రకటన!

**న్యూఢిల్లీ, నవంబరు 5:** దేశంలో రూ.2వేల నోట్లను 2023 మే 19న ఉపసంహరించినట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్బీఐ ప్రకటన చేసే నాటికి దేశంలో 3.56 లక్షల కోట్ల విలువైన 2 వేల రూపాయల నోట్లు చలామణిలో ఉన్నాయి. ఆర్బీఐ ప్రకటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజలు సంస్థలు, ప్రముఖులు వారి వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను బ్యాంక్‌లలో డిపాజిట్ లేదా ఎక్ఛేంజ్ చేసుకున్నారు. అక్టోబర్ 7, 2023 వరకూ అన్ని బ్యాంకు బ్రాంచ్‌ల్లో రూ.2 వేల నోట్లను డిపాజిట్ లేదా ఎక్ఛేంజ్ చేసుకునే సదుపాయంకల్పించినఆర్బీఐ ఆతర్వాత ఆర్బీఐకి చెందిన 19 కార్యాలయాల్లో, ఆర్బీఐ ఇష్యూ ఆఫీసుల్లో, పోస్టాఫీసుల్లో సైతం రూ.2 వేల నోట్లను మార్చుకునే అవకాశం కల్పించింది. దేశంలో చలామణి అయిన రూ.2 వేల నోట్లలో దాదాపు 98.04 శాతం నోట్లు ప్రజల నుంచి తిరిగి బ్యాంకులకు వచ్చి చేరినట్లుగా తెలిపింది. కేవలం తాజాగా ప్రజల వద్ద మిగిలి ఉన్న రూ.2 వేల నోట్లపై ఆర్బీఐ ప్రకటన చేయడంతో వీటిపై ఏమైనా నిర్ణయం తీసుకుంటుందా? అనే చర్చ జరుగుతోంది.

# రాజకీయ విరమణపై త్వరలో నిర్ణయం

## ఎవరైనా ఎక్కడో ఒకచోట ఆగాల్సిందే: శరద్‌పవార్



**ముంబయి, నవంబరు 5:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రముఖ రాజకీయ నాయకుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్‌పవార్ రాజకీయాల నుంచి వైదొలగడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఓ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాజ్యసభలో తమ పదవీకాలం ఇంకా ఏడాది కాలం మిగిలి ఉందని ఇది ముగిసిన అనంతరం మరో పదవిలో కొనసాగాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. కాగా ఇప్పటికే శరద్ పవార్ పాల్గొంటున్న పలు సభల్లో ఆయన వ్యతిరేకులు ఇకనైనా రాజకీయాల నుంచి రిటైర్ కావాలని ప్లకార్డులు ప్రదర్శించడంపై మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడో ఒకచోట ఆగిపోవాల్సిందే కదా అంటూ వ్యాఖ్యానించారు. నవంబరు 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపి అభ్యర్థి యుగేంద్ర పవార్ తన పెదనాన్న అజిత్ పవార్‌తో తలపడనున్నారు. దీంతో శరద్‌పవార్ తన మనవడు యుగేంద్ర తరఫున ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో అజిత్ పవార్ 25 ఏళ్లకు పైగా పనిచేశారని, ఆయన సేవలపై ఎలాంటి సందేహం లేదని అన్నారు.

అయితే ఇప్పుడు భవిష్యత్తు కోసం సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కొత్త నాయకుడు అవసరమని ఆయన అన్నారు. రాబోయే 30 ఏళ్ల పనిచేస్తే నాయకత్వాన్ని మనం తయారుచేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయిదు దశాబ్దాలకు పైగా మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ రాజకీయ నాయకుడిగా సేవలందించిన శరద్‌పవార్ భారత రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు. పార్లమెంటరీ రాజకీయాలనుంచి ఆయన తప్పుకుంటే ఆ ప్రభావం మహారాష్ట్ర రాజకీయాలపై కూడా ఉంటుంది. కాగా రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్ర సిద్ధమవుతోంది. 288మంది శాసనసభ్యులున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం బిజెపి, శివసేన, ఎన్సీపీలతోకూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్, ఎన్సీపి, శివసేనలతో కూడిన ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి ప్రయత్నిస్తోంది.

# క్షమాపణలు చెప్పాలి, లేదంటే రూ.5 కోట్లు ఇవ్వాలి

## బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు బదరింపులు!



**ముంబయి, నవంబరు 5:** మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే బాబా సిద్దిఖీ హత్య తర్వాత బాలీవుడ్ నటుడు సల్మాన్‌కాన్‌కు వరుసగా బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో నటుడిని బెదిరిస్తూ ముంబయి పోలీసులకు ఓ మెసేజ్ వచ్చింది. అందులో సల్మాన్‌కు దుండగులు రెండు ఆప్షన్స్ ఇచ్చినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ముంబయి పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్‌రూమ్‌కు చెందిన వాట్సప్ నంబర్‌కు మెసేజ్ వచ్చింది. 'నేను లారెన్స్ బిష్ణోయ్ సోదరుడిని. సల్మాన్‌ఖాన్ ప్రాణాలతో ఉండాలంటే అతడు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి. లేదంటే రూ.5 కోట్లు ఇవ్వాలి. అలా జరగనిపక్షంలో మేం అతడిని చంపేస్తాం. మా గ్యాంగ్ ఇంకా క్రియాశీలకంగానే ఉంది' అని ఆ మెసేజ్‌లో పేర్కొన్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. కాగా అక్టోబరు 30న కూడా సల్మాన్‌ఖాన్‌ను బెదిరిస్తూ మెసేజ్ వచ్చిన సంగతి తెలిసిందే. రూ.రెండు కోట్లు చెల్లించకపోతే నటుడిని చంపేస్తామని బెదిరించినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అంతకు కొన్ని రోజుల ముందు కూడా ఇదే తరహా బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలంటే ఆయన రూ.5 కోట్లు చెల్లించాలి. లేదంటే మాజీ ఎమ్మెల్యే సిద్దిఖీ కంటే దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని ఆగంతకులు మెసేజ్ పంపారు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి నటుడికి బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచిఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఈ క్రమంలోనే గత నెల సల్మాన్ స్నేహితుడు, ఎన్సీపి నేత బాబా సిద్దిఖీ ఇటీవల దారుణ హత్యకు గురవడంతో ఈ గ్యాంగ్ పేరు మళ్లీ వార్తల్లో నిలిచింది.

# నామినేషన్లు ఉపసంహరించని అసమ్మతి నేతలపై శివసేన వేటు



**ముంబయి, నవంబరు 5:** మరికొన్ని రోజుల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శివసేన పార్టీ తమ అసమ్మతి నేతలపై వేటు వేసింది. నామినేషన్‌లను ఉపసంహరించుకోకపోవడం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది.

ఈ క్రమంలో పార్టీ నుంచి టికెట్ అందని నేతలు ఆయా నియోజకవర్గాల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో వాటిని ఉపసంహరించుకోవాలని పార్టీ ఆదేశించింది. అయినప్పటికీ నేతలు వాటిని వెనక్కి తీసుకోక పోవడంతో వారిపై చర్యలు తీసుకున్నట్లు పార్టీ కార్యాలయం పేర్కొంది. వీరిలో భివాండి తూర్పు ఎమ్మెల్యే రూపేష్, విశ్వనాందేకర్, చంద్రకాంత్ ఘుగుల్, సంజయ్ అవారి, ప్రసాద్ ఠాక్రేలు ఉన్నారు. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో నవంబర్ 20న ఓటింగ్ జరగనుండగా, 23న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఎన్నికల వేళ డిజిపిలను తొలగిస్తున్న ఇసి

## దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో హఠాత్తుగా డిజిపిలకు స్థాన చలనం

## ఎస్ఎస్‌పి యాదవ్ మొదలుకుని రష్మీ శుక్లా వరకు అనేక మందిపై వేటు

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రాలకు జరిగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసు శాఖకు బాస్‌గా వుండే డిజిపిలకు ఎన్నికల సంఘం ఝలక్ ఇవ్వడం కొనసాగుతూనే వుంది. గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత ఫలితాలు వెలువడుతున్న సమయంలో నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించినందుకు అప్పటి డిజిపి అంజనీ కుమార్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిజిపి పై వేటు పడడం ఇటీవల కాలంలో దేశంలోనే అదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ సమయంలో ఎన్నికల సంఘం రవి గుప్తాను కొత్త డిజిపిగా నియమించింది.

ఇదే సమయంలో నాటి హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ సహా పలువురు పౌర, పోలీసు అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిజి స్థాయి అధికారి అయిన ఆనంద్‌ను ఎన్నికల సంఘం ఎన్నికల విధుల నుంచి దూరంగా వుంచడం దేశం లోనే ఇదే తొలిసారి. ఈ ఘటన కూడా సంచలనం రేపింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ సర్కారు కొలువు తీరాక ఆనంద్‌ను ఎసిబి డిజిపిగా నియమించారు. దీని తరువాత ఈ ఏడాది ఎపిలోజరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాటి ఎపి డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డిని ఎన్నికల సంఘం తప్పించి ఆయన స్థానంలో హరీష్ గుప్తాను నియమించడం సంచలనం రేపింది. ఇక ఉమ్మడి ఎపిహయాంలో 2009లో అప్పటి ఎపి డిజిపిగావున్న శ్యాంసుందర్ ప్రసాద్ యాదవ్(ఎస్ఎస్‌పియాదవ్)ను ఎన్నికల సంఘం ఉన్నపళంగా తప్పించి అరుణ్‌కుమార్ మొహంతి (ఎకె మొహంతి)ని డిజిపిగా నియమించింది. అయితే ఎన్నికల తరువాత తిరిగి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్‌పార్టీఎస్ఎస్‌పి యాదవ్‌ను మళ్లీ డిజిపిగా నియమించి ఎకె మొహంతిని రోడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేసింది. ఈ ఉదంతాలతో పాటు గత నెలలో జరిగిన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర డిజిపి అనురాగ్ గుప్తాను ఎన్నికల సంఘం తప్పించి అజయ్ కుమార్ సింగ్‌ను డిజిపిగా నియమించింది.

ఇక తాజాగా మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర డిజిపి రష్మీ శుక్లాను ఎన్నికల సంఘం తప్పించి నూతన డిజిపిని నియమించేందుకు సీనియర్ల జాతితాను ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించింది. ఇదే తరహాలో గతంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌సహా పలు రాష్ట్రాలలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో పోలీసు బాస్‌లకు స్థాన చలనం తప్పలేదు. వీరితో పాటు పలు రాష్ట్రాలలో జిల్లాల ఎస్‌పిలు సైతం బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఎపిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పలు జిల్లాల ఎస్‌పిలను, డిఐజిలను, ఐజిలను ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల ఫిర్యాదుల నేపథ్యంలో బదిలీ చేసింది. గత ఏడాది తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ హైదరాబాద్‌లోని సెంట్రల్ జోన్ డిసిపిగా వున్న వెంకటేశ్వర్లు సహా మరో అదనపు డిసిపిని హఠాత్తుగా బదిలీచేసింది. ఇదే సమయంలో తనిఖీ సమయంలో పట్టుబడ్డ డబ్బులను ఇచ్చివేశారనే అభియోగంతో ఒక ఇన్‌స్పెక్టర్‌ను మరో ఎస్ఐను ఎన్నికలసంఘం సస్పెండ్ చేసింది. కేవలం పోలీసు అధికారులే కాకుండా ఐఎఎస్‌లతో పాటు ఆర్‌డిఓ, జాయింట్ కలెక్టర్ల క్యాడర్ అధికారులపైనా వేటు పడింది. ఇందులో కొందరు బదిలీ కాగా మరికొందరు సస్పెండ్ అయ్యారు. ఇలాంటి ఘటనలు అనేక రాష్ట్రాలలో జరిగాయి. ఎన్నికల వేళ ఎన్నికల సంఘం సుప్రీంఅనేది మరోసారి రూఢీ అయ్యింది.



జార్ఖండ్‌లోని ఛాత్రా జిల్లాలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో సిఎం హేమంత్ సోరెన్

### ఇండియా కూటమి టపాసుల్లా పేలితే..

# మేం రాకెట్‌లా దూసుకెళ్తాం

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**రాంచీ, నవంబరు 5:** జార్ఖండ్‌లో అధికారంలో ఉన్న జెఎంఎం నేతృత్వంలోని సర్కారుపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) అధినేత హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా కూటమి టపాసులా పేలితే.. బిజెపి శక్తివంతమైన రాకెట్‌లా దూసుకెళ్తూ రాష్ట్రాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు. హతియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. సోరెన్ ప్రతిపాదకుడు మండల్ ముర్ము బిజెపిలో చేరిన విషయమై మాట్లాడుతూ జెఎంఎం మునిగిపోతున్న నావ అని తెలుసు కాబట్టే అతడు తమ పార్టీలో చేరారని అన్నారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ఎవరు సర్కారును ఏర్పాటు చేస్తారో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు.

ప్రస్తుత ప్రభుత్వం ఆదివాసీలను అణచివేస్తూ.. వారి ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తోందని దుయ్యబట్టారు. చొరబాటుదారులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని.. ఆదివాసీ జనాభా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

బిజెపికి అధికారం ఇస్తే జార్ఖండ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రాల వరుసలో నిలబెడతామని హామీ ఇచ్చారు. 2027 నాటికి అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీకి ఈ నెల 13, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా.. ఈ నెల 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# ఢిల్లీలో అదుపుతప్పిన వాయు కాలుష్యం

## అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచన!



**న్యూఢిల్లీ, నవంబరు 5:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతున్నది. రోజు రోజుకు కాలుష్యం పెరుగుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరి తీసుకోవడం ఇబ్బందికరంగా మారగా మరోవైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది. దేశ రాజధాని నగరంలో మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచి 400పైగానే నమోదైంది. ప్రస్తుతం నగరంలో సెకండ్ ఫేజ్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలులో ఉన్నది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం ఉదయం 8 గంటలకుఆనంద్ విహార్‌లో ఎక్యూఐ 457, అలీపూర్‌లో 389, వజీర్‌పూర్ 437, జహంగీర్‌పురి 440, రోహిణి 397, పంజాబీ భాగ్‌లో 403 ఎక్యూఐ రికార్డయింది. కాలుష్యం నేపథ్యంలో విజిబులిటీ సైతం తగ్గింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది.

వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియాగేట్ తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల కళ్లలో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఇంట్లోనే ఉండి యోగా, ప్రాణాయామం చేయాలని సూచిస్తున్నారు.

ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతోందని ఢిల్లీ ప్రభుత్వ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు సంబంధిత ఏజెన్సీలన్నీ చురుగ్గా పనిచేస్తున్నాయని కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో శీతాకాల కార్యాచరణ ప్రణాళిక కింద వివిధ శాఖలు, ఏజెన్సీలు చేస్తున్న పనులను మంగళవారం సమీక్షించనున్నట్లు గోపాల్‌రాయ్ పేర్కొన్నారు. ఇందులో అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు.

### యుపి మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, నవంబరు 5:** ఉత్తరప్రదేశ్‌లో వేల సంఖ్యలో ఉన్న మదర్సాలకు భారీ ఊరట లభించింది. యుపి మదర్సా ఎడ్యుకేషన్ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ చట్టాన్ని సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఉత్తర ప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ గతంలో అలహాబాద్ హైకోర్టు దానిని రద్దుచేసిన సంగతి తెలిసిందే. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని ఆ సందర్భంగా తెలిపింది. దాంతో ఆ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని తెలిపింది. ఈ తీర్పు 10 వేల మదర్సా టీచర్లు, 17 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతోందని అప్పట్లో పేర్కొంది. ప్రస్తుత తీర్పుతో 16 వేల మదర్సాల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి.



జమ్ములో ఆర్టికల్ 370 రద్దుకు మద్దతుగా శివసేన కార్యకర్తలు మంగళవారం భారీ ప్రదర్శన దృశ్యం

6-11Pg6exHMNWJQE.qxd:6-11Pg6exHMNWJQE.qxd 01/01/01 9:16 AM Page 1





నాగుల చవితి సందర్భంగా అభిషేకం నిర్వహిస్తున్న ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్

# రుద్రపాదాల వద్ద వేడుకగా నాగుల చవితి

**శ్రీకాళహస్తి,నవంబరు5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాల యంలో మంగళవారం నాగుల చవితి పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయాధికారులు ఏర్పాట్లను భక్తుల మనోభావాలకు అనుగుణంగా చేస్తున్నారు. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన సామూహిక కేదారగౌరీ వ్రతం సందర్భంగా సమీక్షలోనే నాగుల చవితి ఏర్పాట్లను సమీక్షించారు. మంగళవారం ఉదయం నుంచి సన్నిధివీధిలోని రుద్రపాదాల చెంత వెలసిన నాగశిలల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇక్కడ నాగశిలలకు షోడషాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, అంజనేయ శర్మ, పరిచాంకులు గోవింద్‌శర్మలు పూజలు నిర్వహించగా ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసారు.

# నారద పుష్కరిణిలో లక్ష దీపార్చన

## విశేషంగా పాల్గొన్న మహిళలు

**శ్రీకాళహస్తి నవంబరు 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఊరంతా సందడి అన్నట్లు దేవస్థానం ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న దుర్గమ్మ కొండ, సుబ్రమణ్యం స్వామి కొండ, భక్తకన్నప్ప కొండ, నాలుగుమాడావీధులు, అనుబంధ ఆలయాలను విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా జీవనది స్వర్ణముఖి ఒడ్డున ఇటు అటు ఏర్పాటు చేసిన అమ్మవారి దీపాల విగ్రహాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణిలో లక్ష దీపార్చనకు విశేష స్పందన వచ్చింది. కాగా లక్షార్చనకు ఎంఎల్ఏ దంపతులు పాల్గొని ఆఖండ దీపాలను వెలిగించారు. కార్తీకమాసం దక్షిణ కైలాసాన్ని ఓసారి సందర్శిస్తే బాగుంటుందని చూసిన వారు ప్రచారం చేసే రీతిలో తీర్చిదిద్దారు.



బిక్షాల గాలిగోపురానికి విద్యుత్ దీపాల శోభ

# హత్యాచారం జరిగినట్లు టెస్టుల్లోనూ నిర్ధారణ కాలేదు:ఎస్ఐ

**యర్రావారిపాలెం, నవంబరు 5 ప్రభాతవార్త :** బాలికపై హత్యాచారం జరగలేదని ఎస్ఐ డివై స్వామి తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. బాలిక పాఠశాల నుండి ఇంటికి వస్తుంటే యువకులు అడ్డగించి ప్రేమించాలని గొడవకు దిగారని అన్నారు. ఈ క్రమంలో బాలికకు గాయాలయ్యాయని తెలిపారు. మహిళా పోలీసులు, బాలిక తల్లిదండ్రుల సమక్షంలో విచారణ చేపట్టామన్నారు. బాలిక విష యంలో మీడియా, రాజకీయ నాయకులు ఇలా లేనిపోని విషయాలను ప్రచారంచేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డకు అత్యాచారం జరగకపోయినా జరిగినట్లు ప్రచారం చేసి పరువును తీయవద్దని కోరారని అన్నారు. తల్లిదండ్రులు, పోలీసులు ఎవరూ చెప్పక ముందే అత్యాచారంజరిగిందని మీడియాలో అసత్య కథనాలురాడం మంచిపద్ధతి కాదని అన్నారు.

# సివిల్ సప్లయిస్ డిటి అరెస్ట్



**పుత్తూరు, నవంబరు 5 ప్రభాతవార్త :** పుత్తూరులో పౌర సరఫరాల శాఖ గోదాము నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించి విక్రయించినట్టు అభియోగం ఎదుర్కొంటున్న సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దారు సిహెచ్. విష్ణును మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి 14 రోజుల పాటు రిమాం డ్‌కు పంపారు. దీనిపై సిఐ సురేంద్ర నాయుడు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలిపారు. ఈ కేసులో తొలి ముద్దాయి ప్రస్తుతం సూళ్లూ రుపేట ఆర్డిఒ ఆఫీస్ డిప్యూటీ తహశీల్దారు అయిన సిహెచ్. విష్ణును ఈ నెల 4వ తేదీన ఆర్డిఎం గేట్ వద్ద అరెస్ట్ చేసినట్టు తెలిపారు. విచారణలో 2022 డిసెంబరు నుంచి 2024 ఆగస్టు వరకూ పుత్తూరు మండలంలోని పౌరస రఫరాల శాఖ గోదాము డిటిగా వ్యవహరిస్తూ 5040 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా బయట వ్యక్తులకు విక్రయించి రూ. 29.70 లక్షలు సొమ్ము చేసుకు న్నట్టు అంగీకరించారని తెలిపారు.

ఈ మొత్తంలో 17 లక్షలు తన అప్పులు తీర్చినట్టు చెప్పారన్నారు. ఈ కేసుకు సంబంధించి మరి కొందరిని విచారించాల్సిన అవసరం వుందని తెలిపారు.

# వృద్ధురాలి దారుణ హత్య

## చెన్నైలో చిక్కిన నిందితులు

**నెల్లూరు క్రైం (నెల్లూరు), నవంబరు 5, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. వృద్ధురాలిని అతికిరాతకంగా చంపి ఆమె మృతదేహాన్ని సూట్ కేస్‌లో కుక్కి అదృశ్యం చేసే క్రమంలో నిందితులు చెన్నైలో మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే నెల్లూరు కుక్కలగుంట ప్రాంతానికి చెందిన రమణమ్మ అనే వృద్ధురాలు సోమవారం ఉదయం కూరగాయల కోసమంటూ బయటకు వెళ్లి మళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు వెదికిన కుటుంబ సభ్యులు జాడ తెలియకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే క్రమంలో మంగళవారం తెల్లవారు జామున చెన్నై సమీపంలోని మింజూరు రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న సుబ్రమణ్యం ఆయన కుమార్తె దివ్యలను రైల్వే పోలీసులు ప్రశ్నించగా ఈ దారుణం వెలుగుచూసింది. కుక్కలగుంట ప్రాం తానికే చెందిన సుబ్రమణ్యం వృద్ధురాలు రమ ణమ్మ నగలపై కన్నేశాడు. సోమవారం ఉదయం కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్తున్న రమ ణమ్మతో సుబ్రమణ్యం మాట కలిపి వారి ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న నగలను తీసుకున్నారు. శవాన్ని ట్రావెల్ బ్యాగులో కుక్కాడు. సోమవారం సాయంత్రం కుమార్తె దివ్యతో కలిసి ఆ సూట్ కేసుతో బయలుదేరాడు. స్థానికులకు ఊరెళ్తున్నట్లు నమ్మించాడు. నెల్లూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లి సూట్ కేస్ తో పాటూ చెన్నై రైలు ఎక్కారు. చెన్నై సమీపం లోని మింజూరు రైల్వే స్టేషన్‌లో జనాలు ఎక్కువ మంది లేకపోవడంతో అక్కడ రైలు దిగేశారు. మంగళవారం తెల్లవారు జామున సూట్ కేస్‌ను రైల్వే స్టేషన్‌లో వదిలి తిరిగి నెల్లూరుకు చేరుకో వాలని ప్రయత్నించారు. అదే క్రమంలో అక్కడే ఉన్న రైల్వే పోలీసులకు అనుమానం వచ్చి వారిని ప్రశ్నించారు. పొంతనలేని సమాధానాలు చెప్ప డంతో సూట్‌కేసును తెరిచి చూడాగా వృద్ధురాలి శవం కనిపించింది. తమ శైలిలో విచారణ చేయ డంతో అసలు నిజం పోలీసులకు చెప్పారు. విష యాన్ని చెన్నై పోలీసులు నెల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంతపేట పోలీసులు చెన్నై చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే మహిళ మృతదేహాన్ని అక్కడే ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు.



రమణమ్మ(ఫైల్)

# ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండేలా పోలీసు వ్యవస్థలో మార్పులు

## రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గం

## డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించను: డిజిపి ద్వారకా తిరుమలరావు

**అనంతపురం, నవంబరు 5 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండే విధంగా పోలీసు వ్యవస్థలో ఇంకా మార్పులు తీసుకొస్తున్నామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రశ్న లేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ఆయన వెల్లడించారు. గత ఐదేళ్లలో కొన్ని తప్పులు జరిగాయని, అప్పట్లో జరిగిన తప్పులను సరిదిద్దడంపై దృష్టిపెట్టామని తెలిపారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన ప్రొబిషన్ డిఎస్పీ పాసింగ్ పరేడ్ హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి డిజిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణే తమ విధానం అని డిజిపి స్పష్టం చేశారు. తాము రాజ్యాంగానికి కట్టుబడి పని చేస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై కామెంట్ చేయనని ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు కూడా సరిగ్గా విధులు నిర్వహించలేదని తెలిపారు. ఓ పార్టీ కార్యాలయంపై దాడి జరిగినప్పటికీ బాధ్యతగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. కేసు పెట్టకుండా భావప్రకటన స్వేచ్ఛ అంటూ నిందితులను అరెస్టు చేయలేదని చెప్పారు. ఈ ఘటనపై మూడేళ్ల తర్వాత చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించడం సరికాదని అన్నారు.

తప్పు జరిగితే 30 యేళ్ల తర్వాత అయినా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు. కేరళలో తప్పు జరిగిన 20 ఏళ్ల తర్వాత ఓ ఐపిఎస్‌కు శిక్ష విధించారని తెలిపారు. న్యా యం చేసేందుకే చట్టాలు, కోర్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఫింగర్ ప్రింట్ టెక్నాలజీ ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో వినియోగించలేదని ఏపి డిజిపి తెలిపారు. మానవ హక్కులు, మహి ళలు, చిన్నారుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని డిజిపి తెలిపారు. ఐజీ సంజయ్‌పై వచ్చిన ఆరోపణలపైనా విచారణ జరుగుతోందని ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు.



మంగళవారం మీడియాతో మాట్లడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

# శవరాజకీయాలు చేస్తోన్న వైఎస్సార్సీ

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నదాంట్లో తప్పేముంది: హోంమంత్రి అనిత

**అనంతపురం, నవంబరు 5 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలోవైఎస్ఆర్‌సిపి శవ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారంచేస్తూ కూటమి ప్రభుత్వాన్ని బదనాము చేసేందుకు యత్నిస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత ఆరోపించారు. మంగళవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ వ్యాఖ్యలలో తప్పేముందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం, పోలీస్ ఉన్నతిధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తుంటానన్నారు. పవన్‌కళ్యాణ్‌కు అన్ని విషయాలు తెలుసు కాబట్టి మాట్లాడారని ఆమె వివరణ ఇచ్చారు. డిప్యూటీ సీఎం మాట్లాడిన దానిపై కారణాలు వెతకాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ఏ కేసు విషయంలో ఆగ్రహంగా ఉన్నారో నాకు తెలుసు అన్నారు. త్వరలో ఆయనతో మాట్లాడతానని, పిఠాపురం సభలో మాట్లాడిన దానిలో ఎలాంటి రాజకీయం లేదని నాకు తెలుసు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భద్రతకే 12 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. అదే డబ్బును శాంతి భద్రతల పరిరక్షణ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు కోసం ఖర్చు చేసి ఉండొచ్చు కదా అని ఆమె ప్రశ్నించారు. వైసీపీ నాయకులు ప్రస్తుతం గ్లోబల్ ప్రచారానికి దిగుతున్నారన్నారు. తిరుపతిలో ప్రస్తుతం జరిగిన సంఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా పూర్తి కాకముందే వైసీపీ నాయకులు హంగామా చేస్తున్నారని ఆమె విమర్శించారు. అక్కడ ఏదో జరిగిపోయిందని అప్పుడే పరామర్శలు, విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. శాంతిభద్రతకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



# నలుగురు విజిలెన్స్ అధికారులు మాతృసంస్థకు

**తిరుమల,నవంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు జగన్ బొమ్మతో ఉన్న చొక్కాధరించి స్వామివారిని దర్శించుకోవడం పై విజిలెన్స్ అధికారుల వైఫల్యం కనిపించింది. దీనిపై నలుగురు ఏవిఎస్ఒలను మాతృసంస్థకు బదిలీ చేస్తూ టిటిడి సివిఎస్ఒ శ్రీధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆలయ ఏవిఎస్ఒ మనోహర్, సాయిగిరిధర్, పద్మనాభన్, శివయ్యలను సాగనంపారు. వీరి స్థానాల్లో కొత్తవాళ్ళు రానున్నారు. సాధారణంగా రాజకీయ పార్టీల జెండాలు, చిహ్నాలు, స్టిక్కర్లతో ఉన్నవారిని ఆలయంలోనికి అస్సలు పంపరు. అలాంటిది వైసిపి నేత కావడంతో టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది అనుమతించారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు

## లండన్ వేదికగా ప్రారంభమైన వరల్డ్ ట్రావెల్ మార్కెట్

## తెలంగాణ స్టాల్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యాటక యవనికపై తెలంగాణ పర్యాటకం తనదైన ప్రత్యేకతను చాటుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. లండన్ వేదికగా ప్రారంభమైన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ఇన్క్రెడిబుల్ ఇండియా స్టాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై స్వామి, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హాలండన్ టీ ఎక్స్ఛేంజ్ చైర్మన్ తో భేటి అయిన మంత్రి తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులు, హైద రాబాద్‌లో టీ ఎక్స్ఛేంజ్ ఔట్లెట్, లండన్ ఐ తరహాలో ఐకానిక్ జాయింట్ వీల్ ఏర్పాటుపై చర్చించారు. త్పెలంగాణ పర్యాటక శాఖ స్టాల్ ని ప్రారంభించిన మంత్రితో పాటు ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణామోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, డా. వంశీ కృష్ణ, డా. రాజేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సీయం రేవంత్ రెడ్డి పర్యాటక రంగపై ప్రత్యేక దృష్టి సారించడంతో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్లుతున్నట్లు తెలిపారు. తెలంగాణ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు వరల్డ్ ట్రావెల్ మార్కెట్ లో తెలంగాణ పర్యాటక రంగాన్ని సరికొత్తగా ప్రపంచానికి పరిచయం చేస్తామని తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం ఇన్క్రెడిబుల్ ఇండియా స్టాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూకే లో భారత హై కమీషనర్ విక్రమ్ దురై, కేంద్ర పర్యాటక శాఖ డీజీ ముగ్ధ సిన్హాతో కలిసి మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మెహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. లండన్ లో మూడు రోజుల పాటు జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (జూగిలీ) లో ప్రపంచ వ్యాప్తంగా 125 దేశాలు, భారత్ నుంచి 10 పైగా రాష్ట్రాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి

# సాంకేతిక కారణాలతో తెలంగాణ టెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

## 7వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** సాంకేతిక కారణాలతో టెట్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా పడింది. అభ్యర్థులు ఈ నెల 7నుంచి దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ తెలపింది. ఎవరూ ఆందోళన చెందాల్సింది లేదని వివరించింది. కాగా మంగళవారం టెట్ నోటిఫికేషన్ 2025ను విడుదల చేసింది. గతేడాది మే నెలలో తొలిసారి టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం మరోమారు నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరిలో టెట్ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

మొదట అభ్యర్థులు నవంబర్ 5 నుంచి 20వ తేదీ లోపు టెట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలిపారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దరఖాస్తుల స్వీకరణ ఆలస్యం అవుతుండడంతో వాయిదా వేశారు. ఈ మేరకు టెట్ రాసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 7 నుంచి స్వీకరిస్తారు. పాఠశాల విద్యా అధికారిక వెబ్‌సైట్‌లో మరింత సమాచారం ఉంటుందని, ఏవైనా సందేహాలుంటే అందులో చెక్ చేసుకోవాలని తెలిపారు. ఆగస్టులో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన సర్కార్ ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహిస్తామని తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పటికే మే నెలలో ఒకసారి టెట్ నిర్వహించగా మరో మారు నోటిఫికేషన్ విడుదల చేయటంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఆరు సార్లు టెట్ పరీక్షలు నిర్వహించగా జనవరిలో జరిగేది ఏడోసారి కానుంది. టెట్ పేపర్1కు డీఈడీ, పేపర్2కు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు.

స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతుం డటంతో వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్ష రాయ నున్నారు. టెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తొమ్మిది సార్లు పరీక్షలు పెట్టగా జనవరిలో పదోసారి జరగనుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండోసారి టెట్ నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం.

# సెల్‌ఫోన్ చోరీ, మిస్సింగ్ కేసుల రికవరీలో తెలంగాణకు ద్వితీయ స్థానం

## సిఇఐఆర్ పోర్టల్‌తో 557 రోజుల వ్యవధిలో 50,788 ఫోన్లు బాధితులకు అందజేత

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌ల చోరీలు, మిస్సింగ్ కేసుల విచార ణలో, బాధితులకు న్యాయం చేకూర్చ డంలో సిఐడి మరో ఘనతను అందుకుంది. ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ ద్వితీయ స్థానంలో నిలిచింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహకారంతో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన సెంట్రల్ ఇ క్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సిఈఐఆర్)ను వాడి గడచిన 557 రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా సెల్‌ఫోన్లను చోరీచేసే ముఠాల నుంచి 50,788 ఫోన్లను జప్తు చేసుకుని బాధితులకు అందచేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ శిఖా గోయల్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. సెల్‌ఫోన్ చోరీలు, మిస్సింగ్ కే సులను తీవ్రంగా పరిగణించిన కేంద్రం ఈ తరహా కేసులను వేగంగా పరిష్కరించేందుకు సిఈఐఆర్‌ను 2023 ఏప్రిల్ నెలలో ప్రారంభించడం తెలిసిందే. దీనికి సంబం ధించి రాష్ట్ర వ్యాప్తంగా 31 పోలీసు యూనిట్లలోని 780 పోలీసు స్టేషన్లకు సిఈఐఆర్ యూజర్ ఐడిలను అదే నెలలో అందజేశారు. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టే షన్లలో ఎంపిక చేసిన వారికి దీని అమలుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కాగా సిఈఐఆర్ పోర్టల్‌కు రాష్ట్ర వ్యాప్త నోడల్ అధికారిగా సిఐడి చీఫ్ శిఖా గోయల్ వ్యవహ రిస్తున్నారు. ఈ పోర్టల్ అమలు వల్ల ఇప్పటి వరకు సిఈఐఆర్ పోర్టల్ అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సెల్ ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు అం దగానే దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేబడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి రోజు 91 ఫోన్లు రికవరీ అవుతుండగా గత ఏడాది వరకు ఇది 87గా వుండేది. దేశ వ్యాప్తంగా సెల్‌ఫోన్ చోరీల రికవరీలో తెలంగాణ ద్వితీయ స్థానంలో వుందని శిఖా గోయల్ తెలిపారు. కాగా సిఈఐఆర్ పోర్టల్ రాష్ట్రంలో సమర్థవంతం గా అమలవుతుండడంలో ఎన్‌జెపి సైబర్ క్రైం ఎస్‌పి లావణ్య, సెక్యూరిటీ డిడిజి హేమంత్ రత్వే, అర్విండ్ కుమార్ తదితరులు కీలకంగా వ్యవహరించారు. ఈ సంద ర్భంగా సెల్‌ఫోన్ల రికవరీలో విశేష కృషి చేసిన సిఐడి అధికారులకు డిజిపి జితేందర్ తన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

# 2036 ఒలింపిక్స్‌కు రెడీ

## ఐఒసికి భారత్‌కు లేఖ

**న్యూఢిల్లీ, నవంబరు 5:** విశ్వక్రీడలు ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సమాయత్తమవుతోంది. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి వ్యక్తీకరణ తెలియజేస్తూ ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి అధికారికంగా లేఖను పంపిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అక్టోబర్ 1వ తేదీనే దీనిని పంపినట్లు తెలుస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని, ఈ విషయంలో వెనక్కి తగ్గమని గతంలో ప్రధాని మోడీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారతీయులు ఉత్సాహంగా ఉన్నారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్య మిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలను చేస్తాం. ఏ విషయంలోనూ వెనక్కి తగ్గం. ఇది 140 కోట్ల భారతీయుల కల. అలాగే 2029 యూత్ ఒలింపిక్స్ ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం అని ఆయన అన్నారు. మరోపక్క 2028, 2032 ఒలింపిక్స్ వేదికలు ఖరారయ్యాయి. దాంతో అందరిచూపు 2036పై పడింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ రేసులో ఉంది అని భారత ఒలింపిక్ కమిటీ గతంలో వెల్లడించింది. 2025లో ఐఒసి అధ్యక్ష ఎన్నికల తర్వాత 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే అవకాశం ఉంది. విస్తృత స్థాయిలో బిడ్డింగ్ కాకుండా ఆసక్తి ఉన్న దేశాల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఐఒసి నాయకత్వం విభాగం ఈ ఆతిథ్య హక్కులను కట్టబెట్టే ఆస్కారం ఉంది. స్పాన్సర్లు, ప్రసార హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజల ఆదరణ ఇలా ఏ రకంగా చూసుకున్నా భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం వల్ల ఐఒసికి లాభం చేకూరే అవకాశం ఉంది. అందుకే ఐఒసి కూడా భారత్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తితో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



6-11P□g7exHMNWJQE.qxd:6-11P□g7exHMNWJQE.qxd 01/01/01 9:20 AM Page 1



# ఆహారభద్రతపై ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండొద్దు. సరియైన పద్ధతిలో వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం ఇండి యన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వెంగళరావు నగర్‌లో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ నియమాలను అను సరిస్తూ బిజినెస్ చేసుకునేవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తప్పు చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదనీ, హాస్టళ్లలో పిల్లలకు మంచి భోజనం పెట్టనివారిని కూడా తప్పకుండా శిక్షిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ అంటే బిర్యానీకి, మంచి ఫుడ్‌కి ఫేమస్ అనీ, ఆ పేరును విశ్వవ్యాప్తం చేసేలా హోటల్ ఇండస్ట్రీ, స్ట్రీట్ ఫుడ్ ఇండస్ట్రీ ఉండాలన్నారు. ప్రతి హోటల్‌ను, రెస్టారెంట్‌ను, స్ట్రీట్ సైడ్ ఫుడ్ స్టాల్స్‌ను, డైట్ క్యాంటీన్లను అధికారులు తనిఖీలు చేస్తారనీ, పెరిగిన హోటళ్ల సంఖ్య, జనాభాకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచబోతున్నామన్నారు. ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలోనే స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామనీ, నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరించడంతో పాటు కొత్తగా వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో మరో మూడు ఫుడ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కొత్తగా 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ తీసుకొస్తున్నామనీ, ఇప్పటికే వాహనాల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినట్లు వెల్లడించారు. సంవత్సరానికి కనీసం 24 వేల ఫుడ్ సాంపిల్స్ టెస్ట్ చేసేలా ల్యాబులను ఆధునీకరిస్తాం. మనం హైదరాబాదీలం, భోజన ప్రియులం. మంచి భోజనం దొరుకుతుందంటే, నాలుగైదు కిలోమీటర్ల దూరమైనా వెళ్లి తింటాం. కానీ, కొంత గిరాకీ పెరగగానే, ఆ హోటల్‌లో ఫుడ్ నాణ్యత తగ్గుతోంది. అలా ఉండకూడదు, బ్రాండును కాపాడుకోవాలి. క్వాలిటీ, హైజీన్ మెయింటేయిన్ చేయాలని ఈ సందర్భంగా మంత్రి దామోదర స్పష్టం చేశారు.

# ఇంటింటి కుటుంబ సర్వే నుండి ఎస్‌జిటి టీచర్లను మినహాయించాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుంచి ఎస్‌జీటీ టీచర్లను మినహాయించాలని డిమాండ్ చేస్తూ సిఎం రేవంత్ రెడ్డికి... బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే" కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్య హక్కు చట్టం ఉల్లంఘనేనని వ్యాఖ్యానించారు. 36,559 ఎస్జీటీలను, 3,414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం చేస్తూ నవంబర్ 1వ తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఉదయం 9 గంటల నుండి మ. 1 గంటల వరకే (ఒంటి పూట) పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తున్నదన్నారు. కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుందన్నారు. ఇవి కాకుండా మరే ఇతర పనులకు వినియోగించకూడదని విద్యాహక్కు చట్టం నిర్దేశిస్తుందన్నారు. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు.. ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలి నాలి చేసుకునే వారే. అకస్మాత్తుగా ఒంటి పూట బడులు నడపడం వలన పిల్లలకే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయన్నారు. పిల్లల చదువులు కుంటుపడటంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్నారు.

# ఫుడ్‌పాయిజన్ ఘటనపై రాజకీయాలు తగవు

## మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపణలను ఖండించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై రాజకీయాలు చేయడం మానుకోవాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ సీతక్క హితవు పలికారు. ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యబారిన పడిన విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోలేదన్న మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండించారు. ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం తక్షణం స్పందించిందని మంత్రి సీతక్క తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం ప్రభుత్వం అందించిందన్నారు. తానే స్వయంగా ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఓ పీవో ఖుష్బూ గుప్తా లతో సమన్వయం చేసు కుంటూ విద్యార్థులకు ఏలాంటి అపాయం జరక్కుండా తగు చర్యలు చేపట్టినట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహరాష్ట్ర పర్యటనలో ఉన్న సీతక్క పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఇలాంటి ఘటనలు జరక్కుండా హెల్త్ మానిటరింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఘటన జరిగిన క్షణం నుంచి ఐటీడీఓ పీవో ఖుష్బూ గుప్తా దగ్గరుండి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిమ్స్ సూపరిండెంట్ సత్యనారాయణతోపాటు అక్కడి డాక్టర్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మానిటర్ చేసినట్లు మంత్రి తెలిపారు. సీఎం కార్యాలయం సైతం నిరంతరం విద్యార్థుల యోగక్షేమాలను తెలుసుకుంటూనే ఉందన్నారు. మంచిర్యాల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించి, మరింత మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌ను తరలించినట్లు తెలిపారు. విద్యార్ధినుల వైద్య ఖర్చులతో పాటు రహదారి ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే రూ.5 లక్షల మేర బిల్లులను చెల్లించినట్లు చెప్పారు. వైద్య ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో సిరిసిల్ల నుంచి సిద్దిపేట దాకా జరిగిన పలు ఫుడ్ పాయిజన్ కేసుల వివరాలను సీతక్క విడుదల చేసారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాజకీయాలు చేసి పిల్లలను, తల్లిదండ్రులను భయ బ్రాంతులకు గురి చేయవద్దని విపక్షాలకు హితవు పలికారు. విద్యార్థులు కోలుకుంటున్నారని డాక్టర్లు చెప్పడంతో నిమ్స్ సందర్శనను వాయిదా వేసుకున్నట్లు సీతక్క తెలిపారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం, తాను నిత్యం ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుం టున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

# పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. పోలీ సు శాఖను బలోపేతం చేసేందుకు, అవినీతిని నిర్మూలించి, పోలీసుల్లో జవాబుదారితనం పెంపొందించేలా చేసేందుకు సంస్కరణలు అవసరమని సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం నాడు సిఎంకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. పోలీసు శాఖలో సంస్కరణలు తేవాలన్నది సుప్రీం కోర్టు చాలాకాలం చెప్పిందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో, జిల్లాల స్థాయిలో భద్రతా కమిషన్, పోలీసు కంప్లయింట్ అథారిటీ ఏర్పాటు చేయడం ముఖ్యమైనద ని ఆయన తెలిపారు. భద్రతా కమిషన్ పోలీసు శాఖ పరితీరును సమీక్షించడంతో పాటు తగిన సూచనలు, సలహాలు, పోలీసులు చట్టపరంగా విధులు నిర్వహించే విధ ంగా తనవంతు పాత్రను పోషిస్తుంద ని ఆయన తెలిపారు.

భద్రతా కమిషన్‌ను హైకోర్టు విశ్రాంత జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పోలీసు శాఖలో ఐపిఎస్ అధికారులు మొదలుకుని అన్ని స్థాయిల అధికారులపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారిస్తుందని, ఇదే విధంగా జిల్లా స్థాయిలో వుండే కమిషన్‌కు జిల్లాల విశ్రాంత జడ్జిలు నాయ కత్వం వహిస్తారని పద్మనాభ రెడ్డి తెలిపారు. దీంతో పాటు పోలీసు కంప్లయింట్ అథారిటీని ఏర్పాటు వెంటనే చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లాల స్థాయిలో వీటిని ఏర్పాటు చేయాలని దీనివల్ల పోలీసులపై వచ్చే అన్ని రకాల ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. గతంలో హైదరాబాద్, వరంగల్‌లో పోలీసు కంప్లయింట్ అథారిటీని ఏర్పాటు చేసినా అవి వాస్తవంలో కార్యరూపం దాల్చలేదని ఆయన తెలిపారు. 2021లో హైకోర్టులో వున్న కేసు నేపథ్యంలో అప్పటి సర్కారు ఆదరబాదరగా భద్రతా కమిషన్‌ను ఏర్పాటు చేసినా అది ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదని ఆయ న వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసు శాఖ మరింత పారదర్శకంగా పనిచేసేందుకు భద్రతా కమిషన్‌ను, పోలీసు కంప్లయింట్ అథారిటీని వెంటనే ఏర్పాటు చే యడంతో పాటు వీటికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయాలని పద్మనాభ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆధ్వర్యంలో సర్వే

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్టు ఫిర్యాదులు రావడంతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారి ఆదేశాలతో అమీన్‌పూర్‌లో మంగళవారం హైడ్రా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. జేడీ సర్వే కార్యాలయ అధికారులతో పాటు హైడ్రా అధికారులు ఈసర్వేలో పాల్గొన్నారు. ఎకరాకు పైగా ఉన్న పార్కు స్థలంతో పాటు.. రహదారులను గోల్డెన్‌కీ వెంచర్ వాళ్లు కబ్జాచేశారంటూ వెంకటరమణ కాలనీ వాసుల ఫిర్యాదు చేశారు. ఇరు పక్షాల వాళ్లు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే జరిపించిన హైడ్రా మొత్తం 5 సర్వే నంబర్లలోని 150 ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని సర్వే చేసింది. ఈసర్వేఅంతా వెంకటరమణ కాలనీ, చక్రపురి కాలనీ వాసులు, గోల్డెన్ కీ వెంచర్ నిర్వాహకులతో పాటు.. పరిసర కాలనీ వాసులు, గ్రామస్థుల సమక్షంలోజరిగింది. లే ఔట్లను పరిశీలించి.. సర్వే నంబర్ల ఆధారంగా పార్కు స్థలాలతో పాటు.. రహదారులను కాపాడే పనిలో హైడ్రా నిమగ్నమైంది. సర్వే నంబర్లు, హద్దురాళ్ల ఆధారంగా భూముల సరి హద్దులను నిర్ధారించి.. ఎవరి లే ఔట్‌లోకి ఎవరు చొరబడ్డారనేది తేల్చేందుకు హైడ్రా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సర్వేలో హైడ్రా, హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పన అంతంతే

## ఘోరంగా విఫలమైన సర్కారు: మాజీమంత్రి హరీశ్‌రావు



చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (పంజగుట్ట), నవంబరు 5, ప్రభాతవార్త:** కొమరంభీమ్ జిల్లా వాంకిడి మండలం గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఫుడ్ పాజియన్ జరిగి 60 మంది అస్వస్థతకు గురైతే ఇద్దరు బాలికలను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకు వచ్చారు. చికిత్స పొందుతున్న విద్యార్థి నులను మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శిచారు. ఎనిమిదో తరగతి చదువుతున్న మహాలక్ష్మి, తొమ్మిదో తరగతి చదువు తున్న జ్యోతిని మెరు గైన చికిత్సల కోసం నిమ్స్‌కు తరలించారని తెలిసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడానికి ఇక్క డకు వచ్చానని ఆయన తెలిపారు. ధైర్యంగా ఉండాలని పిల్లల తల్లిదండ్రులకు చెప్పానని తెలిపారు.

11 నెలల కాంగ్రెస్ పాలనలో తల్లిదండ్రుల నమ్మకాన్ని పోగొట్టేలా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో పరిస్థితులు దిగజారాయని ఆయన విమర్శించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. ఇప్పటిదాకా నాకు తెలిసిన సమాచారం ప్రకారం ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36మంది విద్యార్థులు వివిధ కారణా లతో చనిపోయారని ఆయన అన్నారు. దాదా పు 600 మంది విద్యా ర్థులు ఈ ఏడు నెలల్లో ఫుడ్‌పాయిజనింగ్ బారిన పడ్డారని, పాములు, ఎలుకల కాట్ల ఘటనలు తరచుగా జరుగు తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులు మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల బిజీలో ఉన్నారని, చిన్నారులను ఎవరు పట్టించు కుంటారని ఆయన ఎద్దేవా చేశారు. 36 మంది రెసిడెన్షియల్ విద్యార్థుల మరణాలపై ప్రభుత్వంలో ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగడం లేన్నారు. రాజకీయాల జోలికి పోకుండా ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

**విద్యార్థినులకు మంత్రులు పొన్నం, సురేఖ పరామర్శ**

తీవ్రఅస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థినులను మెరుగైన చికిత్సకోసం నిమ్స్ ఆసుపత్రికి తరలిం చారు. విషయం తెలుసుకున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మంగళవారం నిమ్స్‌ను సందర్శించి విద్యార్థినులను పరామర్శించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ ప్రభు త్వం జరుపుతుందని భరోసా ఇచ్చారు.

# అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

## వాహనం స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

**ఘట్‌కేసర్, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యం పక్కదారి పడుతుంది. పేదలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రేషన్ డీలర్లతో కుమ్మక్కై బియ్యం కొనుగోలు చేసి ఇతర జిల్లాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు గత కొన్ని దశాబ్దాలుగా దుర్వినియోగం చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి బీహారీ కూలీలకు, కోళ్లఫారాలకు అధిక ధరకు రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజాగా ఘట్‌కేసర్‌లో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని బియ్యం వాహనాని ్న స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం జగ్గయ్యతండాకు చెందిన భూక్య రాజేందర్ రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ వాహనం (టిఎస్30టి1021)లో 24 బియ్యం సంచులు (50 కిలోల) 12 క్వింటాళ్లనుఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్‌అజీజ్ సహకారంతో రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇత్తర ప్రాంతాల్లో అమ్మడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వాహనం, బియ్యం స్వాధీనం సీజ్ చేశారు. ఈవ్యవహారంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించేందుకు యత్నించిన సయ్యద్ అబ్దుల్‌అజీజ్, రాజేందర్‌లను విచారించి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడ్డ అబ్దుల్‌అజీజ్ గతంలో కూడా పలుస్లారు అక్రమంగా రేషన్ బియ్యం విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పీడీఎస్ బియ్యం ఏ రేషన్ దుకాణంలో కొనుగోలు చేసి తరలిస్తున్నారో తమకు తెలియదని విచారణలో తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఇంట్లో పనికోసం పిలిచి యువతిపై ముగ్గురు యువకుల అత్యాచారయత్నం

## మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో దారుణం

**హైదరాబాద్ (పంజగుట్ట), నవంబరు 5, ప్రభాతవార్త:** ఓ మహిళపై అత్యాచారం చేయబోగా ఆమె తీవ్రంగా భయకంపితురాలై యథాతథ స్థితిలో రోడ్డుపైకి పరుగులు తీసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైటెక్‌సిటీ ప్రాంతంలో ఓ మహిళా కార్మికురాలు బస్టాప్‌లో బస్‌కోసం ఎదురు చూస్తూ నిలబడింది. ఆ సమయంలో ముగ్గురు యువకులు ఆటోలో వచ్చి పని చేయాలని, బట్టలు ఉతకాలని, డబ్బులిస్తామని చెప్పి మధురానగర్‌లోని ఇంటికి తీసుకువచ్చారు. తీరా ఇంటికి వచ్చాక ఆ ముగ్గురు యువకులు ఆమెపై అత్యాచార యత్నానికి ఒడిగట్టారు. దీంతో తీవ్ర భయకంపితురాలైన ఆ మహిళ పెద్దగా కేకలు వేస్తూ రోడ్డుపైకి పరుగులు తీసింది. చుట్టుపక్కల వారు ఆమెకు బట్టలు అందజేసి స్థానిక మధురా నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆమెనుండి ఫిర్యాదును స్వీకరిం చారు. నిందితుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారు పరారయ్యారని పోలీసులు అంటున్నారు. కేసు నమోదు చేసుకుని మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# 46 యేళ్ల నిరీక్షణ 'ప్రజావాణి'తో ఫలవంతం

## వంద రోజుల్లో అందిన పట్టాదారు పాసుపుస్తకం

## సిఎం రేవంత్‌రెడ్డికి లబ్ధిదారుడి కృతజ్ఞతలు

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 5, ప్రభాతవార్త:** పొలం పట్టాదారు పాసుపుస్తకం కోసం 46ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న రైతు కల ప్రజావాణీ ద్వారా సాకారమైంది. ప్రజావాణీలో దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లోనే తనకు పట్టాదారు పాసు పుస్తకం రావడంతో రైతు కొమ్మన బోయిన పిచ్చయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన రైతు కొమ్మన బోయిన పిచ్చయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు ధన్యవాదాలు తెలియజేసారు. నల్లగొండ జిల్లా నకరేకల్ అసెంబ్లీ నియోజకవర్గం కట్టంగూర్ మండలం, ఎర్రసాని గూడేనికి చెందిన కొమ్మన బోయిన పిచ్చయ్య ఒక ఎకరం భూమి పట్టాదారు పాసు పుస్తకం కోసం ముఖ్యమంత్రి ప్రజా వాణిలో దరఖాస్తు చేసు కున్న వంద రోజుల్లోనే భూమి పాస్ పుస్తకం చేతి కందింది. 1978లో అందిన ఒక ఎకరం భూమి పట్టా సర్వేనెంబర్ 215బై 3కి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం కోసం పిచ్చయ్య రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగు తూనే ఉన్నారు. అయితే ప్రజావాణి గురించి తెలుసుకున్న ఆయన పట్టాదారు పాసు పుస్తకం కోసం గత ఏడాది జులై నెలలో దరఖాస్తు చేసుకున్నారు. వంద రోజుల్లోనే భూమి పట్టాదారు పాసుపుస్తకం చేతికి రావడంపై పిచ్చయ్య అనందం వ్యక్తం చేసారు. తన ఇద్దరు కుమారులు నరసింహ, స్వామి యాదవ్‌లతో కల్సి ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డి, దివ్యలను s వారి చేతుల మీదుగా పట్టాదారు పాసుపుస్తకం తీసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా తన లాంటి వారికి ఎంతో భరోసా కల్గిందన్నారు.



ప్రజావాణిలో పట్టాదారు పాసుపుస్తకాన్ని లబ్ధిదారుడికి అందిస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్య.

# వ్యవసాయ మహిళా విస్తరణ అధికారులకు అండగా ఉంటాం

## రాష్ట్ర మహిళా కమిషన్ శారద భరోసా

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త :** వ్యవసాయ మహిళా విస్తరణ అధికారులకు అండగా ఉంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద భరోసా ఇచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఛైర్‌పర్సన్ శారదతో వ్యవసాయ మహిళా విస్తరణ అధికారులు భేటీ అయ్యారు. ప్రధానంగా డిజిటల్ క్రాప్ సర్వేలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి విస్తరణ అధికారులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. మహిళా విస్తరణ అధికారులకు అండగా ఉండాలంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్‌పర్సన్ వారికి న్యాయం చేస్తామన్నారు. డిజిటల్ సర్వే తదితర విధి నిర్వహణలో విస్తరణ అధికాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదిస్తానని చెప్పారు.



సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ సిద్ధాంతంతో

# పనిచేస్తోన్న మోడీ సర్కారు

## బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి బోలాసింగ్

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** కేంద్రంలో ఉన్న మోడి సర్కార్ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ సిద్ధాంతంతో పనిచేస్తుందని బులంద్ షహర్ పార్లమెంటు సభ్యులు, బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి బోలాసింగ్ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అభివృద్ధి విషయంలో ఏ రాష్ట్రంపైనా వివక్ష చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయకుండా, ప్రజలకు లబ్ధి జరగకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎప్పుడు ఏం మాట్లాడుతారో, ఆయన ఆలోచన ఏమిటో ఆయనకే తెలియదు. ఒక పార్లమెంటు అభ్యర్థిగా గెలిచిన తర్వాత, రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ప్రవర్తిస్తున్నాని అన్నారు. విదేశాలకు వెళ్లి భారతదేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తానని చెప్పిన రాహుల్ గాంధీ అమెరికాకు వెళ్లి రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటు. నెహ్రూ, ఇందిర, రాజీవ్, రాహుల్ గాంధీ వంటివారు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేసినవారే అన్నారు. సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అంబేద్కర్, ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసి, బిజెపి ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివుడు, బండారి సుభాష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# భూదాన్ భూములను పేదలకు పంపిణీ చేయాలి

## రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య. చిత్రంలో ఇ.టి.నర్సింహ తదితరులు ఉన్నారు

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 5, ప్రభాతవార్త:** అనేక పోరాటాల ద్వారా రాజ్యాంగంలో పౌరులకు ఉండటానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవ డానికి బట్టతోపాటు స్వేచ్ఛ, సమానత్వం, రక్షణ పొందే హక్కులు కల్పించబడ్డాయని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య చెప్పారు. ఇంకా దేశంలో కోట్లాది మంది ప్రజలు నివసిం చడానికి ఇల్లు లేకపోవడం అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూదాన్ భూములను పేదలకు పంచాలని, అన్యాక్రాంతమైన భూ ములను ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవాలనే డిమాం డ్‌తో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళ వారం సత్య నారా యణరెడ్డి భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలం గాణలో భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దున్నేవాడికి భూమి అనే నినాదం అనేక చట్టాలకు రూపకల్పన చేసిందని ఆయన గుర్తుచేశారు.


భూదాన్ భూములు అక్రమంగా అన్యాక్రాంతం అయ్యాయని, ప్రభుత్వ అధికారుల కనుసన్నలతో కబ్జాదా రులు తప్పుడు పత్రాలను సృష్టించి భూములను తమ వశం చేసుకున్నారని ఆరోపించారు. వాటిపైన సమగ్ర విచారణ జరిపించి పేదలకు భూములను పంపిణీ చేయాలని జస్టిస్ చంద్రయ్య డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ పేద ప్రజ లు నివసించడానికి ఇల్లు, వ్యవసాయం చేసుకోవ డానికి భూములు ఇవ్వాలనే ఉద్దేశంతోనే సర్వసేవా సంఘం ఏర్పాటు అయ్యిందని, కాని దీనికి భిన్నంగా పాలకులు ఆ లక్ష్యాలకు తూట్లు పొడు స్తూ రెవెన్యూ అధికారులతోనే కుమ్మక్కు అయ్యి పేదలకు దక్కవలసిన భూములను డబ్బులు ఉన్న వారికి కట్టబెట్టారని ఆరోపించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో విశ్రాంత డిఎంహెచ్ఒ డా. ఆవులప్ప, ఐఎఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ప్రొఫెసర్ వినా యక్‌రెడ్డి, సర్వసేవా సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.చిన్నారెడ్డి

# ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు 1,031

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 5, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 1031దరఖాస్తులు అందాయి. వీటిలో మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 580దరఖాస్తులు, పంచాయితీరాజ్ మరియూ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 172 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 81 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి సంబంధించి 2 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 196 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్యలు ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



# వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో మనిక ఓటమి

**ఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్డ్ టోర్నీలో భారత్ స్టార్ మనిక బత్రా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. జర్మనీలో జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ 26వ ర్యాంకర్ మనిక 6-11, 11-13, 6-11తో 10వ ర్యాంకర్ దక్షిణ కొరియాకు చెందిన యుబిన్ చేతిలో ఓటమిపాలైంది. 22 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనిక తన సర్వీస్‌లో 14 పాయింట్లు గెల్చుకుంది. మనికకు 4,250 డాలర్లు (3 లక్షల 57 వేల రూపాయలు) ప్రైజ్‌మనీతో పాటు, 15వ ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



# క్వార్టర్ ఫైనల్స్‌కు రిత్విక్

**ఢిల్లీ:** మోజెల్లి ఓపెన్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఎటిపి)-250 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్‌చౌదరి రాకెట్ పట్టకుండానే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో భారత్ ప్లేయర్ రిత్విక్-పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కబ్రాల్ జోడీతో తలపడాల్సి న ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ కజాక్స్-హరోల్డ్ మయోట్ జంట గాయం కారణంగా బరిలోకి దిగ లేదు. దీంతో రిత్విక్-కబ్రాల్ ద్వయానికి తొలి రౌండ్‌లో వాకోవర్ లభించింది. వాస్తవానికి ఈ టోర్నీలో భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో రిత్విక్ జతగా పోటీ పడాల్సి ఉంది. అయితే గతవారం బ్రాటిస్లావాలో జరిగిన స్లొవాక్ ఓపెన్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ఛాలెంజర్ టోర్నీ సందర్భంగా అర్జున్‌కుగాయమైంది. దాంతో అర్జునమోజెల్లి ఓపెన్ టోర్నీ నుండి వైదొలగగా, పోర్చుగల్ ప్లేయర్ కబ్రాల్‌తో కలిపి రిత్విక్ పోటీ పడుతున్నాడు. కాగా స్లొవాక్ ఓపెన్‌లో రిత్విక్ సెమీస్‌కు చేరడంతో అతన ఏటీపీ డబుల్స్ ర్యాంక్ కూడా మెరుగైంది. గత వారం 85వ ర్యాంక్‌లో నిలిచిన రిత్విక్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో 5 స్థానాలు ఎగబాకి 80వ ర్యాంకుకు చేరుకున్నాడు. రిత్విక్ భాగస్వామి అర్జున్ ఖడే 76వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, శ్రీరామ్ బాలాజీ 4 స్థానాలు పడిపోయి 65వ ర్యాంక్‌లో ఉన్నాడు. ఇక గత ఏడాది అగస్టు నుండి టాప్-10లో ఉన్నభారత్ వెటరన్‌స్టార్ రోహన్‌బోపన్న తాజార్యాంకింగ్స్‌లో 4 స్థానాఉల పడిపోయాయి. పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో భారత్ ప్లేయర్ బోపన్న-ఆస్ట్రేలియాకు చెందిన వెబ్డెన్ జోడీ రెండో రౌండ్‌లో నిష్క్రమించడంతో బోపన్న ర్యాంక్‌పై ప్రభావం చూపింది. ప్రస్తుతం బోపన్న 12వ ర్యాంక్‌లో ఉన్నాడు.

## 24, 25 తేదీలు ఖరారు

## 46 ప్లేయర్ల రిటెన్షన్ వ్యయం రూ.558 కోట్లు

# రియాద్‌లో ఐపిఎల్ మెగా వేలం



**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025కు సంబంధించిన మెగా వేలానికి అంతా సిద్ధమవుతోంది. ఇప్పటికే మొత్తం 10 ఫ్రాంచైజీలు రిటెన్షన్ ఆటగాళ్ల జాబితాలను విడుదల చేశాయి. ఈ సారి ఊహించని రీతిలో ఐదుగురు కెప్టెన్లు వేలానికి సిద్ధమవుతున్నారు. ఈ ఐపీఎల్ మెగా వేలానికి సంబంధించి వేదిక, తేది ఖరారయ్యాయి. ఈ సారి ఐపీఎల్ వేలం సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిపేందుకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నిర్ణయించింది. వేలం ఏయే తేదీల్లో జరిగేది కూడా నిర్ణయమైంది. ఈ నెల 24, 25 తేదీల్లో ఆటగాళ్ల కొనుగోలుకు ఈ మెగా వేలం జరగనుంది. అన్ని ఫ్రాంచైజీలకు ఈ మేరకు దీనికి సంబంధించిన సమాచారం అందింది. ఈ తేదీల్లో 204 స్లాట్స్ కోసం వేలం జరగనుంది. బిసిసిఐ నిబంధనల ప్రకారం అన్ని ఫ్రాంచైజీలు అక్టోబరు నెలాఖరుకు తాము రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితాలను విడుదల చేశాయి. ఒక్కో ఫ్రాంచైజీకి కేటాయించిన 120 కోట్ల మొత్తం బడ్జెట్‌లో రిటెన్షన్ జాబితా తరువాత వాటి వద్ద ఇంకా ఎంత డబ్బులు మిగిలి ఉన్నాయో అనేది తెలిపోయింది. ఈ మిగిలిన డబ్బులతోనే వేలానికి దిగనున్నాయి. దాదాపు అన్ని జట్ల వద్ద చాలా తక్కువ డబ్బు మిగిలిఉండగా, కొనాల్సి న స్లాట్స్ ఎక్కువగా ఉండటం విశేషం. శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, అర్షదీప్ సింగ్, మొహమ్మద్ సిరాజ్, మొహమ్మద్ షమీ, మిచెల్ స్టార్క్, యజ్వేంద్ర చాహల్, గ్లెన్ మాక్స్‌వెల్, ఇషాన్ కిషన్ వంటి స్టార్ ఆటగాళ్ల వేలంలోకి రానున్నారు. ఇప్పటి వరకూ ఫ్రాంచైజీలు 46 మందిని రిటైన్ చేసుకున్నాయి. ఈ 46 మంది విలువ 558.5 కోట్ల రూపాయలుగా ఉంది. ఈ సారి వేలంలోకి రావడంతో భారీ ఎంమౌంట్ ఖర్చు చేయాల్సి న పరిస్థితి ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తదితర ఫ్రాంచైజీలు ఇప్పుడు కొత్త కెప్టెన్ల కోసం వెదుకుతున్నాయి. ఫ్రాంచైజీలు నిలుపుదలలో అనేక ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ధృవ్ జురెల్, రింకూ సింగ్, మతిషా పతిరానాతో సహా కొంత మంది ఆటగాళ్లకు ఊహించని ప్రైజ్ మనీ దక్కింది. జురెల్ జీతం 20 లక్షల రూపాయల నుండి 14 కోట్ల రూపాయలకు పెరిగింది. అలాగే రింకూ ఆదాయం 55 లక్షల రూపాయల నుండి 13 కోట్ల రూపాయలకు, పతిరానా జీతం 20 లక్షల రూపాయల నుండి 13 కోట్ల రూపాయలకు, మయాంక్ యాదవ్, రజత్ పటీదార్ల జీతం 20 లక్షల రూపాయల నుండి 111 కోట్ల రూపాయలకు పెరిగింది. దాంతో రానున్న మూడేళ్లకు కొత్త జట్ల స్వరూపం మారిపోనుంది.



# పేకాటలో భారత్‌కు రజత పతకం

**ఢిల్లీ:** బ్యూనస్ ఎయిర్స్ వేదికగా జరిగిన వరల్డ్ బ్రిడ్జ్ (పేకాట) ఒలింపియాడ్‌లో భారత్‌కు రజత పతకం దక్కింది. ఇండియా సీనియర్స్ బ్రిడ్జ్ జట్టు ఈ రతజ పతకాన్ని కైవసం చేసుకుంది. అమెరికన్లతో జరిగిన ఫైనల్స్‌లో భారత్ సీనియర్స్ తృటిలో స్వర్ణ పతకానిన చేజార్చుకున్నారు. ఫైనల్స్ మ్యాచ్‌లో భారత్ జట్టు 258-165 తేడాతో అమెరికా చేతిలో టోమి పాలైంది. రెండు రోజుల పాటు జరిగిన ఈ గేమ్ హోరా హోరీగా సాగింది. మొదటి రెండు రౌండ్ల తర్వాత ఇరు జట్ల స్కోఉ దాదాపు టై అయ్యాయి. మూడో రౌండ్‌లో అమెరికన్లు పైచేయి సాధించి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నారు.

# భారత్ ఫుట్‌బాల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్

## 24 మంది ఆటగాళ్లపై నిషేధం



**ఢిలీ:** భారత్ ఫుట్‌బాల్‌లో మ్యాచ్‌ఫిక్సింగ్ సంచలనం అయింది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై 24 మంది ఆటగాళ్లపై నిషేధం విధిస్తూ భారత్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయం తీసుకుంది. మిజోరం ప్రీమియర్ లీగ్‌లో పలువురు ఆటగాళ్లు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారు. దాంతో సాన్థనిక పోలీసుల సాయంతో విచారణ చేపట్టిన మిజోరం ఫుట్‌బాల్ సమాఖ్య కఠిన నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ ఫిక్సింగ్‌తో సంబంధం ఉన్న 24 మంది ఆటగాళ్లపై మూడు క్లబ్స్‌పై నిషేధం విధించింది యాచ్ ఫిక్సింగ్‌కు సూత్రధారులుగా వ్యవహరించిన ఇద్దరిపై ఏకంగా జీవితకాలం నిషేధం విధిస్తూ ఫుట్‌బాల్ సమాఖ్య తీర్మానించింది. అలాగే 5గురు ఆటగాళ్లపై 4 సంవత్సరాలు, 19 మంది ఆటగాళ్లపై 3 సంవత్సరాలు, మరో 8 మంది ఆటగాళ్లపై ఒక సంవత్సరం పాటు నిషేధం అమల్లో ఉంటుందని ప్రకటించింది. ఈ సందర్భంగా మిజోరం ఫుట్‌బాల్ సమాఖ్య మంగళవారం ఒక ప్రకటనలో మిజోరాం ప్రీమియర్ లీగ్-11 సీజనుకు సంబంధించిన మ్యాచ్‌ల్లో ఫిక్సింగ్ జరిగినట్లు ఫుట్‌బాల్ సమాఖ్య దృష్టికి వచ్చింది. ఈ విషయమై స్థానిక పోలీసులతో కలిసి విచారించినట్లు వివరించింది. ఇందులో 24 మంది ఆటగాళ్లు అవినీతికి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందని స్పష్టం చేసింది. అందుకనే వాళ్లకు తగినశిక్ష వేశామని వెల్లడించింది. కాగా మ్యాచ్‌ఫిక్సింగ్‌తో సంబంధం ఉన్న మూడు క్లబ్‌లలో ఒకటైన సిహెఫెర్ వెంఘులున్ ఎఫ్‌సీ ఈ మధ్యే ముగిసిన మిజోరం ప్రీమియర్ లీగ్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఐజ్వాల్ ఎఫ్‌సీతో జరిగిన సెమీ ఫైనల్లో సిహెఫెర్ ఓటమిపాలైంది.

# ఆర్‌బిఐకి 98% రూ.2వేల నోట్లు

**న్యూఢిల్లీ, నవంబరు 5:** రూ.2000 నోట్లు ప్రస్తుతం కనుమరుగైపోయాయి. పెద్దనోట్లను ఉపసంహరించుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత యేడాది కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నోట్లకు సంబంధించి మరో విషయాన్ని వెల్లడించింది. రూ.2000 నోట్లలో 98.04 శాతం తిరిగి బ్యాంకులకు వచ్చాయని, కేవలం రూ.6,970 కోట్ల నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని తెలిపింది. మే 19, 2023న రూ.2000 బ్యాంకు నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. మే 19, 2023న బ్యాంకింగ్ వేళలు ముగిసే సమయానికి మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు చెలామణిలో ఉన్నాయని ఆర్బీఐ తెలిపింది. అక్టోబర్ 31, 2024న ట్రేడింగ్ ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ రూ.6,970 కోట్లుగా ఉంది. మే 19, 2023 వరకు చలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.04 శాతం తిరిగి వచ్చినట్లు ప్రకటనలో పేర్కొంది. ఈ నోట్లను డిపాజిట్ చేసే లేదా మార్చుకునే సదుపాయం అక్టోబర్ 7, 2023 వరకు అన్ని బ్యాంక్ శాఖలలో అందుబాటులో ఉంది. ఈ సదుపాయం ఇప్పటికీ రిజర్వ్ బ్యాంక్ 19 ఇష్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంది. సెంట్రల్ బ్యాంక్ రూ.2000 బ్యాంకు నోట్లను చెలామణి నుండి తీసివేసినప్పుడు 7 అక్టోబర్ 2023 వరకు ప్రజలకు సమీపంలోని ఏదైనా బ్యాంకు శాఖలో డిపాజిట్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. దీని తరువాత ప్రజలు 19 ప్రాంతీయ కార్యాలయాలు, ఆర్బీఐ పోస్టల ద్వారా నోట్లను మార్చుకునే సదుపాయాన్ని కల్పించారు. గత యేడాది మే 19 నుండి రిజర్వ్ బ్యాంక్ 19 ప్రాంతీయ కార్యాలయాలలో కూడా రద్దు చేసిన రూ.2,000 బ్యాంక్ నోటును మార్చుకునే సదుపాయం అందుబాటులో ఉంది. అయినప్పటికీ అక్టోబర్ 9, 2023 తర్వాత ఈ కార్యాలయాల్లో నోట్ల మార్పిడికి రద్దీ పెరిగింది. అప్పటి నుంచి ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు రూ.2000 నోట్లను కూడా స్వీకరిస్తున్నారు. దేశంలోని పోస్టాఫీసుల ద్వారా ప్రజలు రూ.2,000 నోట్లనుఆర్‌బీఐ కార్యాలయాలకు కూడా పంపుతున్నారు. ఈ డబ్బు వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. బ్యాంకు నోట్ల డిపాజిట్/మార్పిడి పనులు ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయంలో జరుగుతున్నాయి. ఈ కార్యాలయాలు అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్ము, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలో ఉన్నాయి.



# రికార్డు స్థాయిలో ఆన్‌లైన్ అమ్మకాలు

**న్యూఢిల్లీ, నవంబరు 5:** దేశవ్యాప్తంగా పండుగ సీజన్ సేల్ ముగియనుంది. గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న ఆన్‌లైన్ షాపింగ్ ట్రెండ్ ఇ-కామర్స్ కంపెనీలను పండుగ సీజన్‌లో విజయవంతంగా కొనసాగింది. పండుగ సీజన్‌లో ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు దాదాపు రూ. 1 లక్ష కోట్ల మొత్తం అమ్మకాలను నమోదు చేశాయని పరిశ్రమ డేటా పేర్కొంది. ఇది గత సంవత్సరం కంటే ఐదవ వంతు ఎక్కువ. కామర్స్ కన్సల్టెన్సీ డేటామ్ ఇంటెలిజెన్స్ ప్రకారం, గత సంవత్సరం రూ.81,000 కోట్లు, 2022లో రూ.69,800 కోట్లు స్థిరమైన నమూనాను కొనసాగిస్తూ, ఈ సంవత్సరం పండుగ విక్రయాలు 23పైగా పెరి గాయి. ఈ సీజన్‌లో సుమారుగా రూ. ఒక లక్ష కోట్ల (దాదాపు11.9బిలియన్లు) అమ్మకాలను నమోదు చేశాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 20 శాతానికిపైగా పెరిగింది. అయితే అమెజాన్ మెట్రోయేతర నగరాల నుండి 85కంటే ఎక్కువ కస్టమర్‌లను చేర్చుకుంది. ఇది స్మార్ట్‌ఫోన్‌లు, టెలివిజన్ సెట్‌లు, గృహోపకరణాలు, కిరాణ సామాన్లు, ఫ్యాషన్‌తో సహా అన్ని వర్గాలలో కనిపించిందని డాటమ్ ఇంటెలిజెన్స్ కన్సల్టెంట్ ఒకరు చెప్పారు. పరిశ్రమ అధికారుల ప్రకారం, పండుగల సీజన్‌లో జరిగే మొత్తం అమ్మకాల్లో ప్రజలు స్మార్ట్‌ఫోన్‌లు, కిరాణా, సౌందర్యం, వ్యక్తిగత ఆరోగ్యం కోసం ఎక్కువ డబ్బుఖర్చు చేశారు. ఈ సీజన్‌లో స్మార్ట్‌ఫోన్‌లు ప్రముఖ కేటగిరీగా ఉద్భవించాయి. ఈసీజన్‌లో షాపింగ్‌మొత్తం స్మార్ట్‌ఫోన్ అమ్మకాలలో దాదాపు 65 వాటాను కలిగి ఉంది. వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ నుండి వచ్చిన డేటా కూడా స్మార్ట్‌ఫోన్‌లను అత్యధిక సంపాదన వర్గంగా చూపుతుంది. ఫ్లిప్‌కార్ట్ టాప్ బ్రాండ్‌ల కోసం డిమాండ్‌లో 17శాతం పెరుగుదల నమోదైంది. ఈవిక్రయాలలో 70 శాతానికిపైగా చిన్న నగరాల నుండి వచ్చాయి.



ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లు, సౌందర్య ఉత్పత్తులు, బ్రాండెడ్ వస్తువుల గరిష్ట అమ్మకాలు జరిగాయి. 23 శాతం పెరిగిన అమ్మకాలు మెట్రోయేతర వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడం, లగ్జరీ బ్రాండ్‌ల కొనుగోలు పెరగడం పండుగసీజన్‌లో వ్యాపారం పెరగడానికి దోహద పడింది. ఇ-

# ఓలా ఎలక్ట్రిక్ షేర్లు డౌన్

**ముంబై, నవంబరు 5:** విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ షేర్లు మంగళవారం క్షీణించాయి. మూడు నెలల లాకిన్ పీరియడ్ ముగిసిన నేపథ్యంలో ఒత్తిడికి గురయ్యాయి. దీంతో ఓలా షేర్లు ఏకంగా 7శాతానికిపైగా క్షీణించాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కంపెనీ షేర్లు ఎన్ఎస్ఇలో 7.08 శాతం క్షీణించి రూ.75.08 వద్ద ట్రేడవుతున్నాయి. లాకిన్ పీరియడ్‌లో భాగంగా దాదాపు 18.2కోట్ల విలువైన షేర్లను విక్రయించడానికి లేదు. ఇవి మొత్తం ఈక్విటీల్లో 4శాతానికి సమానం. కంపెనీ ఐపిఒగా మార్కెట్లోకి రావడానికి ముందు ప్రమోటర్లు, యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరిస్తాయి. స్టాక్‌లలో ఆకస్మిక విక్రయాలు జరగకుండా ఉండేందుకు వీరికి కేటాయించిన షేర్లపై లాకిన్ పీరియడ్ విధిస్తాయి. అంటే మార్కెట్‌లో షేర్లు లిస్టయిన వెంటనే వీళ్లు తమ వాటాలను విక్రయించే అవకాశం ఉండదు. ఈ లాకిన్ పీరియడ్ గడువు ముగిసేంతవరకు ఓపెన్ మార్కెట్లో విక్రయించడానికి, ట్రేడ్ చేయడానికి కూడా వీలుండదు. సాధారణంగా ఈ లాకిన్ పీరియడ్ ఆరు నెలలు ఉంటుంది. ఒక్కోసారి యేడాది వరకు దీన్ని పొడిగిస్తారు. ఈ గడువు ముగిశాకే నిర్దిష్ట వాటాదారులు స్టాక్ మార్కెట్లో వారి వాటాలను విక్రయించగలుగుతారు. ఒక్కోసారి లాకిన్ పీరియడ్ ముగిసిన వెంటనే యాంకర్ ఇన్వెస్టర్లు భారీఎత్తున షేర్లను మార్కెట్లోకి వదులుతారు. దీంతో షేర్లపై ఒత్తిడి పెరుగుతుంది. ధర పడిపోయే అవకాశం ఉంటుంది.



# మార్కెట్లోకి మళ్లీ 'భారత్' బ్రాండ్

**న్యూఢిల్లీ, నవంబరు 5:** అధిక ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించేందుకు కేంద్రం చర్యలకు ఉపక్రమించింది. భారత్ బ్రాండ్‌పై తక్కువ ధరకే గోధుమ పిండి, బియ్యం విక్రయాలను పునః ప్రారంభించింది. దీనికి సంబంధించిన రెండో దశను మంగళవారం ప్రారంభించింది. నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్, కేంద్రీయ భండార్, ఇ-కామర్స్ సంస్థల ద్వారా ఈ విక్రయాలు చేపట్టనున్నారు. ధరల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు తాత్కాలికంగా ఈ విక్రయాలు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఫేజ్-2 ప్రారంభం సందర్భంగా తెలిపారు. రెండో దశలో భాగం 3.69 లక్షల టన్నుల గోధుమలు, 2.91 లక్షల టన్నులు బియ్యాన్ని ఎఫ్‌సిఐ నుంచి సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేటాయించిన స్టాక్ పూర్వయ్యే వరకు విక్రయాలు కొనసాగుతాయన్నారు. అవసరమైతే అదనపు కేటాయింపులు జరుపుతామని మంత్రి తెలిపారు. గోధుమ పిండిని కిలో రూ.30కే విక్రయిస్తామని మంత్రి తెలిపారు. ఇవి5, 10 కేజీల ప్యాకెట్స్‌లో లభిస్తాయి. బియ్యం కిలో రూ.34 చొప్పున విక్రయించనున్నారు. ఇవి కూడా 5, 10 కేజీల ప్యాకెట్ల రూపంలో లభిస్తాయి. గతేడాది అక్టోబరు నుంచి ఈ యేడాది జూన్ వరకు తొలి దశలో విక్రయాలు చేపట్టారు. మొత్తం 15.20లక్షల టన్నుల గోధుమలు, 14.58 లక్షల టన్నుల బియ్యాన్ని విక్రయించారు. అయితే ఫేజ్-1లో గోధుమపిండిని రూ.27.5 కి, బియ్యాన్ని రూ.29కే విక్రయించారు. గతంతో పోలిస్తే ఈ సారి వాటి ధరలను కాస్త పెంచారు. తమ ఉద్దేశం వ్యాపారం కాదని, వినియోగదారులకు ఊరట కల్పించడమేనని జోషి తెలిపారు. వినియోగదారులు కోరుకుంటే మరిన్ని చిన్న ప్యాకుల్లో సైతం వీటిని తీసుకొస్తామని పేర్కొన్నారు.



# వాణిజ్యం

# టాప్‌గేర్‌లో టూవీలర్ విక్రయాలు

**ముంబై, నవంబరు 5:** ప్రముఖ ద్విచక్ర వాహ నాల తయారీదారులైన టీవీఎస్ మోటారు కంపెనీ, హీరో మోటో కార్ప్, రాయల్ ఎన్ ఫీల్డ్ దేశీయ విక్రయాల్లో 13 నుంచి 26 శాతం వృద్ధిని నమోదు చేశాయి. అయితే బజాజ్‌ఆటో మాత్రం ఈవిషయం లో క్షీణతను చవిచూసింది. పండగ సీజన్ అన్ని కంపెనీలకు ఉత్సాహాన్ని కలిగించగా, బజాజ్ ఆటో మాత్రం వెనుకబడింది. దీపావళి సందర్భంగా అక్టోబర్‌లో ద్విచక్ర వాహనాల విక్రయాలు బాగా జరిగాయి. చెన్నైకి చెందిన టీవీఎస్ మోటార్స్ దేశీయ అమ్మకాల్లో (వైఓవై) 13శాతం పెరుగుదలను సాధించింది. ఈ కంపెనీ 3,90,489 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 3,44,957 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గతేడాదిలో పోల్చితే ఈసారి విక్రయాల్లో మంచి వృద్ధి నెలకొంది. అలాగే టీవీఎస్ ఎలక్ట్రిక్ వెహికల్ విభాగం లోనూ ముందంజలో దూసుకుపోతోంది. దాదాపు 45 శాతం మేర అమ్మకాలను పెంచుకుంది. దేశ ప్రజలకు టీవీఎస్ వాహనాల మీద నమ్మకానికి ఇదినిదర్శనంగా నిలుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ అయిన హీరో మోటాకార్ప్ కూడా పండగ సమయంలో అమ్మకాలను గణనీయంగా పెంచుకుంది. దేశీయ విక్రయాల్లో 17.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. గ్రాండ్ ఇండియన్ ఫెస్టివల్ ఆఫ్ ట్రస్టు ప్రచారం ద్వారా ఈ అక్టోబర్‌లో 657,403 యూనిట్లను విక్రయించింది. ముఖ్యంగా ధన్ తేరాస్‌లో జోరుగా విక్రయాలు జరిగాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా హీరో మోటోకార్ప్ వాహనాలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా 100 సీసీ, 125 సీసీ సెగ్మెంట్ వాహనాలపై కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. రాయల్ ఎన్ ఫీల్డ్ కూడా పండగ సందర్భంగా విక్రయాలను పెంచుకుంది. దాదాపు 26 శాతం వృద్ధిని సాధించింది. అక్టోబర్ నెలలో 1,01,886 యూనిట్ల అమ్మకాలు జరిగింది. గతేడాది ఇదే నెలలో 80,958 యూనిట్లను మాత్రమే విక్రయించింది. దీంతో ఈ దీపావళి ఆ కంపెనీకి ఉత్సాహం కలిగించింది. క్లాసిక్, కొత్త మోడళ్లకు బాగా డిమాండ్ ఏర్పడింది. బజాజ్ ఆటో కంపెనీకి మాత్రం దీపావళి కలిసి రాలేదు. ఈ సంస్థ వాహనాల విక్రయాలు 8శాతం తగ్గిపోయాయి. కేవలం 2,55,909 యూనిట్లను మాత్రమే అక్టోబర్ నెలలో విక్రయించగలిగింది. దేశంలోని ద్విచక్ర తయారీదారులు అక్టోబర్‌లో ఎగుమతుల్లో గణనీయమైన ప్రగతి సాధించారు.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబరు 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ లాభాల్లో ముగిసాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు తర్వాత బలంగా పుంజుకొన్నాయి. ఇంట్రాడే కనిష్టాల నుంచి సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల మేర రాణించగా, నిఫ్టీ 24,200పాయింట్ల ఎగువన ముగిసింది. మెటల్, ఫైనాన్షియల్, బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సోమవారం భారీ నష్టాల నుంచి సూచీలు కోలుకున్నాయి. సెన్సెక్స్ ఉదయం 78,542.16 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,296.70 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివర్లో కొనుగోళ్ల మద్దతు కారణంగా పైకి ఎగబాకింది. చివరికి 694.39 పాయింట్లు పెరిగి 79,476.63 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 217 పాయింట్లు పెరిగి 24,213.30 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.84.11 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్‌లో జెఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంకు, ఇండస్ ఇండ్‌బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 75.53 డాలర్లు వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2,747 డాలర్ల వద్ద ట్రేడయింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps